ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-3-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 55 పేజీలు: 10+4 వెల: 6.50

మొయినాబాద్ డ్రగ్స్ కేసు: సిట్ అదుపులో డాక్టర్
ప్రపోజ్ చేసిన ప్రొఫెసర్‌ను చెప్పుతో కొట్టిన విద్యార్థిని 3


గురువారం తెల్లవారు జామున మార్కాపురంలో దగ్ధమవుతున్న బస్సు, టిప్పర్

## తెల్లవారకుండానే.. తెల్లారిన బతుకులు

### ఎపిలోని మార్కాపురం వద్ద ఘోర ప్రమాదం

### టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

### చిన్నారి సహా 14 మంది సజీవ దహనం

### 27 మందికి తీవ్ర గాయాలు

**మార్కాపురం, మార్చి 26, ప్రభాతవార్త ప్రతినిధి:** మార్కాపురం జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో గురువారం తెల్లవారుఝామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్ ఢీకొని చెలరేగిన మంటల్లో 14 మంది సజీవ దహనం కాగా, 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల నుండి వింజమూరుకు బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారుఝామున 5.45గంటలకు మార్కాపురం సమీపంలోని పలకల క్వారీల వద్దకు వెళ్ళేసరికి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బస్సు ఢీకొట్టింది. ఎదురుగావస్తున్న టిప్పర్‌ను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ నిర్ల క్ష్యంగా వ్యవహరించడంతో ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కంకర లోడుతో వస్తున్న టిప్పర్ ఆయిల్ ట్యాంక్‌ను బస్సు ముందు >>2

## సిఎస్ఆర్ నిధులేవి?

### పరిశ్రమలు తెలంగాణలో.. ఫండ్స్ మరోచోట ఖర్చుచేస్తామంటే ఎలా?

### నిధుల సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ

### రాష్ట్ర స్థాయిలో సిఎస్ఆర్ సెల్ ఏర్పాటు

### సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి


గురువారం సిఎస్ఆర్ సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి26:** తెలంగాణలో కంపెనీలు,పరిశ్రమలు ఏర్పాటు చేసి సిఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడతామంటే ఎలా?అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నిం చారు. ఇప్పటి వరకు వచ్చిన సిఎస్ఆర్ ఫండ్స్ మెరుగుగా లేవని, రాష్ట్రానికి మరిన్ని సిఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ ఆర్)పై శాసనమండలిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం జరిగింది. నిధుల సమీకరణతో పాటు సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధుల విరాళాలతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం పంచుకున్న సంస్థల ప్రతినిధులను అభి నందించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ అభినందన ఉత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయిం చారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్‌తో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలు న్న కార్యక్రమాల వివరాలన్నీ సమన్వయం చేసే >>2

### కెసిఆర్‌పై చర్చలే గొప్పలా?

బిఆర్ఎస్ సభ్యులపై డి.సిఎం భట్టి ఆగ్రహం 3

### పేదల వైద్యానికి రూ. 4,500 కోట్లు

గత ప్రభుత్వ బకాయిలు 600 కోట్లు: సిఎం 7

## ఇజ్రాయెల్ చేతిలో ఇరాన్ నేవీ చీఫ్ హతం

### రష్యానుంచి వస్తున్న చమురు ట్యాంకర్‌పై దాడి

### అబుదాబిపై క్షిపణులతో ఇరాన్ దాడులు

### ఇద్దరు భారతీయులు మృతి

### ఖర్గ్ ద్వీపంలో మందుపాతరలు అమర్చిన ఇరాన్

### మళ్లీ ముదురుతున్న వార్



**టెహ్రాన్ / టెల్‌అవీవ్/ వాషింగ్టన్, మార్చి 26:** మధ్యప్రాచ్యంలో నాలుగు వారాలుగా కొన సాగుతున్నయుద్ధం ఇప్పటికీ చల్లారేపరిస్థితులు కనిపించడంలేదు. గురువారం కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్, ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులుకొనసాగాయి. ఇరాన్ మరో సారి గల్ఫ్‌దేశాల్లోని అమెరికా బేస్‌లపై దాడులకుయత్నించింది. పనిలోపనిగా ఆదేశా ల్లోని ఎయిర్‌పోర్టులు, కీలక స్థావరాలపైనా క్షిపణులు, డ్రోన్లతోమోత మోగిం చింది. ఇదిలా ఉంటే ట్రంప్ ఇప్పటికీ తన వైఖరిలో మార్పు కనిపించడంలేదని, అదే నియంతృత్వ ధోరణిలో కొనసాగుతున్నారని ఇరాన్ ఆరోపించింది. 15 డిమాండ్లతో కూడిన పత్రాన్ని పాకిస్తాన్ ద్వారా ఇరాన్‌కు చేరవేసినప్పటికీ వాటిలో ఏ ఒక్కటీ కూడా ఆమోదయోగ్యంగా లేదని, వాటిని అంగీకరించేపరిస్థితి లేదని ఇరాన్ తెగేసి చెప్పింది. మొత్తం అమెరికా స్థావరాలన్నింటినీఎత్తివేయాలని, భవిష్యత్తు లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు దాడులుచేయకూడదని, ప్రస్తుత >>2



### దేశంలో చమురు కొరతలేదు

60 రోజులకు సరిపడా నిల్వలు
అసత్య ప్రచారంవల్లే ప్రజల్లో ఆందోళన 5



### రామయ్య కల్యాణానికి సర్వం సిద్ధం

మిథిలా స్టేడియంలో భారీగా ఏర్పాట్లు 2



### రాజ్‌బరి జిల్లా పద్మానదిలో పడిన బస్సు

16 మంది మృతి, 20 మంది గల్లంతు 5



## జి-7 శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోడీ

### ఫ్రాన్స్‌లో జరగనున్న సమ్మిట్

**న్యూఢిల్లీ, మార్చి 26:** ప్రధాని మోడీ మరో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. జీ7 శిఖ రాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ల నున్నారు.జూన్ 15నుంచి 17 వరకు ఫ్రాన్స్ లో జరిగే జీ7 సదస్సులో పాల్గొంటారు. ఫ్రాన్స్ విదేశీ వ్యవహారాల మంత్రి జీన్ నోయెల్ బారోట్ గురువారం అబ్బే డెస్ వాక్స్ డిసెర్నేలో జరిగిన జీ7 విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్‌తో చర్చలు జరిపారు. ఈ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొంటారని వెల్లడించారు. ఈ మంత్రుల సమావేశంలో మధ్యప్రాచ్యంలోని పరిస్థితులపై విస్తృతంగా చర్చలు జరిపారు. హార్ముజ్ జలసంధిపై సంయు క్తంగా పనిచేయడానికి సన్నిహిత >>2

## 2 నుంచి 5 మండలాల్లో ఇంటెగ్రేటెడ్ భూభారతి



### సర్వే నుంచి రిజిస్ట్రేషన్ దాకా అంతా ఒకే గొడుగు కిందకు

### ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం.. ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 26:** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్)ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయం లోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ రిజిస్ట్రేషన్, ఎన్ఐసి అధికారులతో మంత్రి గారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలో చన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగ వంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపిం చేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభా రతి పోర్టల్‌ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా >>2

## నేను మంత్రికావడం ఇష్టంలేని బిఆర్ఎస్

### అందుకే నాపై మొదటి నుండి ఆరోపణలు చేస్తున్నారు..

### సబితపై నాకు ఎలాంటి ద్వేషం లేదు: మంత్రి సీతక్క

### కాంగ్రెస్ పార్టీలో పుట్టినట్టుగా సీతక్క మాట్లాడుతోంది: సబిత



**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** ఆదివాసీ సామాజికవర్గం నుండి తాను మంత్రి అవడం బిఆర్ఎస్‌కు ఇష్టం లేదని మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే బిఆర్ఎస్ నేతలు మెదటి నుండి తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ మాజి మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై తనకు ద్వేషం లేదని, ఆమె కేటగిరీ వేరు, తన కేటగిరీ వేరని వ్యాఖ్యానిం చారు. ఆమె రాజ్యం వేరు, తన రాజ్యం వేరు అని, సబితది హైదరాబాద్ నగరమైతే తాము అడవి బిడ్డలమన్నారు. తనకు ఎక్కడ కూడావాళ్లతో కంపా రిజన్ లేదన్నారు. కాగా.. గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమం పద్దులపై చర్చలో భాగంగా గురువారం బిఆర్ఎస్ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీ తా లక్ష్మారెడ్డి చేసిన విమర్శలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. సర్పంచ్‌లు లేనందునే కేంద్రం నుండి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదని, ఆ నిధులు లాప్స్ అవుతాయోమోననే 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం రాకున్నా ఎన్నిలకు వెళ్లామన్నారు. పంచాయతీలకు నిధులు కాం గ్రెస్ గవర్నమెంట్ ఇవ్వకపోతే ఇన్ని రోజులు విద్యుత్ దీపాలు ఎలా పెట్టాం? అని మంత్రి ప్రశ్నించారు. అంతగా పారిశుధ్యం లోపిస్తే ఊర్లు ఉంటాయా..? ప్రజలు విషజ్వరాల భారినపడేవారుకదా..? అని ప్రశ్నించారు. పంచాయతీరాజ్‌శాఖలో బిఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన ఈఎన్సినే ఇప్పటి వరకు కొనసాగిస్తున్నామన్నారు. ప్రతి 15 రోజులకోసారి తాగునీటి విషయంలో తాను రివ్యూ చేస్తున్నానని, ఎంత మంది సర్పంచులతో మాట్లా డింది, ఏయే సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయో వాటి వివరాలను కూడా సభ ముందుంచుతామని చెప్పారు. త్రాగునీటి విషయంలో ఒకసారి ఓ బాలుడు నీళ్ల పైపుతో ఆడుకుంటుంటే బిఆర్ఎస్ >>2





భద్రాచలంలో గురువారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# రామయ్య కళ్యాణానికి సర్వం సిద్ధం

## సిఎం చేతులమీదుగా పట్టు వస్త్రాల సమర్పణ

### మిథిలా స్టేడియంలో భారీగా ఏర్పాట్లు

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రుని కొండైన భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ శోభతో కళకళలాడుతోంది. ఎటు చూసినా స్వాగత ద్వారాలు... చలువ పందిళ్లు... అలంకరణలు... దేదీప్యమానంగా భద్రగిరి ప్రకాశిస్తుంది. మొత్తంగా భద్రాచల రామక్షేత్రం భూలోక వైకుంఠంగా భక్తు లకు దర్శనమిస్తోంది. ఎటు చూసినా సీతారాముల కళ్యాణ శోభ.... ఎవరి నోట విన్నా ఆది దంపతుల ముచ్చటే... శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం మిథిల స్టేడియంలోని శిల్పకళా శోభిత మైన కళ్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వైకుంఠ ద్వారం వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రామయ్య సన్ని దికి చేరుకుంటున్నారు. కాగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వస్తున్నారు. అలాగే రూ.560 కోట్లతో రామాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఎదుర్కోలు, శ్రీరామనవమి, మహా పట్టాభిషే కంను పురస్కరించుకొని స్వామివార్లను తీసుకెళ్లే మార్గంలో దేవస్థానం, పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలోపరిశీలించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ సుమారు రెండువేల మందికి పైగా సిబ్బందితో బందోబస్తును నిర్వహిస్తున్నారు. రామయ్య కళ్యాణం వీక్షించేందుకు సుమారు లక్ష మంది పైనే భక్తులు వస్తారని అంచనా తో అధికారులు ఏర్పాట్లు గావించారు.కాగా దేవస్థానం ఆధ్వర్యంలో మూడు లక్షల లడ్డూ లను సిద్ధం చేశారు. 26 కౌంటర్ల ద్వారా లడ్డూ ప్రసాద విక్రయాలు, 80 కౌంటర్ల ద్వారా నవమి కళ్యాణ తలంబ్రాల పంపిణీ చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా కళ్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించగా 34 వేల మంది భక్తులు కల్యాణంను వీక్షించనున్నారు. కాగా ఇందులో 15000 మంది భక్తులు ఉచితంగా స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు వీలుంది. కల్యాణ మండపం ప్రాంగణంలో 50 టన్నుల ఏసీ, 150 కూలర్లు, 250 ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

# 2 నుంచి 5 మండలాల్లో ఇంటెగ్రేటెడ్ భూభారతి

>> వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు.ఈ పైలట్ మండలాల్లో మెరిట్ డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

# జి-7 శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని

>> సమన్వయ్యాన్ని కొనసాగించాలని భారతదేశంలోని ఫ్రాన్స్ రాయబార కార్యాలయం తెలిపింది. ఇక జి7 కార్యకలాపాలకు భారతదేశం అందించిన సహకారాన్ని ఫ్రాన్స్ అభినందించింది. విదేశాంగమంత్రుల సమావేశంలో భారత్ ప్రతినిధి జైశంకర్ పశ్చిమాసియాలో నెలకొంటున్నపరిస్థితులపైనా చర్చలుజరిపారు. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల కారణంగా ఇంధనసరఫరాలో ఆటంకాలు ఎదురయినట్లు మంత్రులు అందరూ ఏకీభవించారు. హార్మూజ్ జలసంధిలో భద్రతా ఏర్పాట్లపై అన్ని జి7 దేశాలు సమిష్టిగా కృషి చేయాలనినిర్ణయించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్‌మాక్రాన్ ఇప్పటికే ఫిబ్రవరిలో కృత్రిమమేధపై జరిగిన ప్రపంచ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌లో పర్యటించారు. ఈ పర్యటనలోనే ఫ్రాన్స్ అధ్యక్షునితో ప్రధానిమోడీ ద్వైపాక్షిక చర్చలుకూడా జరిపారు.

# బస్సు ప్రమాదంపై సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి సీఎస్‌కు కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి26:** మార్కాపురం జిల్లాలో బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌ను ఆదేశించారు. ప్రమాదంలో పలువురు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసిన సీఎం, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద ఘటనలో ప్రయాణికుల వివరాలు తెలుసుకోవాలని, ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని సీఎస్‌కు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఏపీ సీఎస్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు తెలంగాణలోని నిర్మల్ నుంచి నెల్లూరుకు వెళ్తుండటంతో సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారు.

## సిఎస్ఆర్ నిధులేవి?

>> బాధ్యతలను రాష్ట్రస్థాయి సెల్ నిర్వర్తిస్తుందన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ విరాళాలను ఇచ్చేందుకు, వివిధ విభాగాల పరిధిలో చేపట్టేందుకు వీలున్న ప్రాజెక్టుల వివరాలన్నీ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు, తమకు అనువైన ప్రాజెక్టులను ఎంచుకు నేందుకు వీలుగా ఈ పోర్టల్ ఆకర్షణీయంగా తయారు చేయాలని చెప్పారు.జాతీయస్థాయిలో సీఎస్ఆర్ విరాళాల వాటా మనరాష్ట్రంలో కేవలం 3%మాత్రమే ఉందని అధికారులు సీఎంకు నివేదించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ఆర్ ఫండ్స్ ఆశించిన స్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడితే ఎలా..? అని సీఎం అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందని, మన రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు తెలంగాణలోనే ఎక్కువ సీఎస్ఆర్ ఖర్చు పెట్టేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ వాటాను పెంచుకునేందుకు వీలుగా కొత్త పాలసీ ఉండాలని, కార్పొరేట్ సంస్థలను ఆకర్షించే విధానాలను అనుసరించాలని చెప్పారు. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచిఘోష్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రెటరీ మాణిక్యరాజ్, యోగితారాణా, శశాంక, భవేష్ మిశ్రా, నిఖిల్ చక్రవర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

27-03-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
నవమి ఉ.10.08
పునర్వసు మ.3.26
వర్జ్యం : రా.11.15-రా.12.49
దు.ఉ.8.33-ఉ.9.22, 2)మ.12.37-మ.1.26
శుభసమయం:ఉ.10.30-11.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** విదేశాలలో ఉన్న మీ సన్నిహిత వర్గం తిరిగి చేరువ అవుతుంది. నరఘోష అధికంగా వుంటుంది.దైవబలం అవసరం.

**వృషభం:**శుభకార్యాలు మానసిక ప్రశాంతతకు కారణం అవుతుంది. ఆర్థిక వరమైన సర్దుబాటును అద్భుతముగా చేయగలుగుతారు.

**మిథునం:** మీ స్వంత ఆలోచనలు అమలు చేసే ముందు పూర్వపరాలు మీ జీవిత భాగస్వామితో చర్చించడం మరవవద్దు.

**కర్కాటకం:**ఒకానొక కీలక విషయంలో ఇతరుల సూచనలు పాటించి భంగపడవలసి రావచ్చు. జాగ్రత్త వహించండి.

**సింహం:**వాహనాలు నడిపేటప్పుడు మెలుకువ అవసరం. సంగీత, సాహిత్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**కన్య :**కుటుంబ బాధ్యతలు సకాలంలో నిర్వహిస్తారు. సంతాన పురోభివృద్ధి సాధిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**తుల :** వృత్తి, ఉద్యోగాల పరంగా అధికంగా శ్రమించవలసి వస్తుంది. కొత్త వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన అతికీలకమైన పత్రాలు, డాక్యుమెంట్స్ భద్రత విషయంలో జాగ్రత్త వహించండి. వాహన సౌఖ్యం.

**ధనుస్సు:** ఆధ్యాత్మిక భావాలకు ప్రాముఖ్యత ఇవ్వడం వలన మానసిక ప్రశాంతత చేకూరుతుంది. నిదానమే ప్రధానమన్న ఆర్యోక్తిని పాటించండి.

**మకరం:** జీవిత భాగస్వామి అభి ప్రాయాలకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తారు. మాటమీద నిలబడే వ్యక్తిగా మంచిపేరు సంపాదిస్తారు.

**కుంభం:**మీ గురించి చెడుగా ప్రచారం చేసే వారితో వాదించడం కన్నా దూరంగా ఉండటం మంచిదని భావిస్తారు.

**మీనం:** ఖర్చులను అదుపు చేసే చర్యలు ఎటువంటి ఫలితాలు ఇవ్వలేకపోతాయి. ఉద్యోగస్తులకు అనుకూలం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'అసైన్డ్'పై పట్టాల కోసం ఉన్నతస్థాయి కమిటీ

## అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా పట్టణాలు విస్తరించడంతో అసైన్డ్ భూ ముల్లో ఇళ్ళుకట్టుకొని కొత్త కాలనీలు ఏర్పడ్డాయని దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వీరికి పట్టాలు ఇవ్వడానికి ఉన్నతస్థాయి కమిటీని వేస్తామని రెవె న్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ప్రకటిం చారు. జీరో అవర్‌లో బీర్ల అయిలయ్య తన నియో జకవర్గంలో 22ఎ చట్టం అనుసరించి అసైన్డ్ భూముల్లో కట్టుకున్న 49650 ఇళ్ళ విషయంలో భయాందోళనలు ఇటీవల మొదలైందని వాటిని పరిష్కరించాలని కోరగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్య ఉందని దానిపై మంత్రి మండలిలో చర్చించి నిర్ణయం తీసుకొంటామని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన 20,21,21ఎ, ప్యాకేజ్ పనులను పూర్తి చేసి సాగు వెంటనే సాగు నీరందించాలని మాజీ మంత్రి, నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసన సభ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో బాల్కొండ నియోజకవర్గం ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్యాకెజ్ 21ఎ, చిట్టాపూర్, ఫత్తేపూర్, సుర్బిర్యాల్ లిఫ్ట్ సమస్యలను లేవనెత్తారు. కోరుట్ల, బాల్కొండ ఆర్మూర్ నియోజకవర్గాలకుచెందిన ఒకలక్ష ఎకరాలకుపైగా వ్యవసాయ భూములకు సాగునీరు అందించడానికి గత ప్రభుత్వం 4,800 కోట్ల రూపాయలు కేటాయించగా, ఇప్పటికే 3,300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 70 శాతం పనులు పూర్తి చేశామని తెలి పారు. మిగిలిన 30శాతం పనులు పూర్తి చేస్తే 2లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని సూచించారు. మెట్‌పల్లి సెగ్మెంట్ ప్యాకేజీ 21 ఏ లోనే బాల్కొండ నియోజకవర్గంలో 70వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్ జక్రాన్ పల్లి మండలంలో 29వేల ఎకరాలు, కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి, ఇబ్రహీపట్నం ప్రాంతంలో 19వేల ఎకరాలు, ఆర్మూర్, మాక్లూర్‌లో 5వేలు ఎకరాలు మొత్తంగా సుమారు 1.20 లక్షల ఎకరాలు ఉంటుందని తెలిపారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల మెట్‌పల్లి సెగ్మెంట్ పనులల్లో హెడ్ వర్క్స్, పంపు హౌజ్, మెయిన్ పైప్ లైన్ పూర్తి అయ్యి దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, కేవలం మరో రూ. 500 కోట్లు ఖర్చు చేస్తే 1.20 లక్షల ఎకరాలకు 3 నుంచి 6 నెలల్లో నీరు అందించవచ్చని సూచించారు. మరో వెయ్యి కోట్లు ఖర్చు చేస్తే మిగతా 80వేల ఎకరాలకు సాగున్నీరు అందించవచ్చని వెల్లడించారు.

ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు సంబదించిన చిట్టాపూర్‌ఫతేపూర్‌సుర్బిర్యాల్ లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గత రెండున్నర ఏళ్లుగా ఈ ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయని , తక్కువ ఖర్చుతోనే ఒక్క ఎకరానికి సాగునీరు అందించే అవకాశం ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉందని తక్షణమే ఈ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రిని పలుసార్లు కలిసి విన్నవించడమే కాకుండా గత అసెంబ్లీ సమావేశాల్లో ఇదే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన పనుల్లో ఇప్పటికి ఎలాంటి కదలిక లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనుల్లో వేగం పెంచి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కూచుకుల్ల రాజేశ్ రెడ్డి జీరో అవర్‌లోనాగర్‌కర్నూల్ కల్వకర్తికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.దానంనాగేందర్ రోబోటిక్ కృత్రిమ మేధా ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్ చేయడానికి వేదిక ఇవ్వాలనికోరారు.నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నాల లక్ష్మయ్య పూనుకోవడంతో రైల్వేకోచ్ ప్యాక్టరీకి భూసేకరణజరిగిందని ఉమ్మడి వరంగల్ జిల్లా యువతకు అందులో ఉద్యోగాలు 90శాతం వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రకాష్‌గౌడ్ తన నియోజకవర్గంను మూడు ముక్కలు చేసి మూడు కమీషనరేట్ల పరిధిలో చేర్చారని ఒకే చోటుకు మార్చాలని కోరారు. రాగమయి 11కెవి వైర్లు ఇళ్ళపై పోతున్నాయని వాటిని తొలగించాలని జిపిలకు పక్కాభవనం కట్టించాలని మహ్మద్ మోసిన్ రోడ్‌వైడనింగ్ బాధలు బండారులక్ష్మారెడ్డి, ధన్‌పాల్‌సూర్యానారాయణ, కనయ్యతదితర ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గం సమస్యలు జీరో అవర్‌లో సభ ముందు పెట్టారు.సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని వారికి గృహనిర్మాణం పెన్షన్, అక్రిడేషన్ వంటి సౌకర్యం కల్పించాలని జవహర్‌లాల్‌నెహ్రూసొసైటీలో ఉన్నవారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# తెల్లారిన బతుకులు

>> భాగం ఢీకొట్టడంతో ట్యాంకర్ పగిలి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ట్యాంకర్ పగిలిన క్షణాల్లోనే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో కొంత మంది గాయాలతో తప్పించుకోగా 14 మంది సజీవ దహనమయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి ఉపాధి కోసం వలస వెళ్ళిన ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాలకు చెందిన ఉపాధి కూలీలు శ్రీరామనవమి వేడుకలకు స్వగ్రామాలకు బయలుదేరారు. జగిత్యాలలో బుధవారం రాత్రి 8గంటల సమయంలో బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారుఝామున ప్రమాదానికి గురయ్యింది. మరికొన్ని గంటల్లో గమ్యస్థానాలకు చేరుకోనున్న ఈ ఉపాధి కూలీలను మృత్యువు కబలించింది. తాము ప్రయాణిస్తున్న ట్రావెల్ బస్సులో సుక్షితంగా చేరుకుని శ్రీరామనవమి పండుగను జరుపుకుంటామని ఆనందకేలియాలలో వున్న తమ పాలిటి మృత్యు శకటమని భావించలేకపోయారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాల్సిన శ్రీరామనవమి వేడుకలు ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. తమవారి కోసం ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు వారు తిరిగిరాని లోకాలకు వెళ్ళడాన్ని జీర్ణించుకోలేక అల్లాడిపోతున్నారు. కొద్ది క్షణాల్లో ఇంటికి చేరుకునే అభాగ్యులు గాఢ నిద్రలోనే మృత్యు ఒడిలోకి చేరారు. అభమూ శుభమూ తెలియని 6 నెలల చిన్నారితో పాటు మరో 13 మంది సజీవ దహనం కాగా 27 మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో కొనకనమిట్ల మండలం, పెద్దారికట్ల గ్రామానికి చెందిన అంబటి అనిల్, కనిగిరికి చెందిన బండారు పద్మ, ఉదయగిరి మండలం, దాసరిపల్లెకు చెందిన ముత్తంగా వెంకటేశ్వర్లు, కనిగిరి చెందిన తమ్మిశెట్టి పిచ్చమ్మ, తమ్మిశెట్టి రుక్మిణి, లింగారెడ్డిపల్లెకు చెందిన ఉప్పు రమాదేవి, వెలిగండ్లకు చెందిన పొదిలి మహేంద్ర, పొదిలికి చెందిన ప్రభావతి, కత్తి జయరాములు, ఆత్మకూరు చిన్న, దేవేంద్ర రామయ్య, చైత్ర, జ్యోతిలు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే మృతదేహాలు ఈ ప్రమాదంలో గుర్తు పట్టలేనివిధంగా కాలిపోయాయి. క్షతగాత్రులు తెలిపిన వివరాల మేరకు అధికారులు మృతులను గుర్తించినట్లు తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రమాదానికి గురైన మృతుల కుటుంబ సభ్యులకు, క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించారు. మార్కాపురం డిఎస్పీ నాగరాజు నేతృత్వంలో సిఐ సుబ్బారావు, ఎస్సైలు, సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. రాష్ట్ర మంత్రులు అనిత, రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఐజి హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, వై.పాలెం టిడిపి ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు వైద్యశాలను సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు.



గురువారం మార్కాపురంలో దగ్ధమవుతున్న బస్సు, టిప్పర్ మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

# సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పనివేళల పొడిగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి26:** తెలంగాణ రిజిస్ట్రేషన్ల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో రద్దీని దృష్టిలో ఉంచుకొని పని వేళలను పొడిగించింది. ఈనెల 28,30,31 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 9-30 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకు పని చేస్తాయని చెప్పింది. రిజిస్ట్రేషన్ స్లాట్ల సంఖ్యనూ పెంచింది.సెలవులు తీసుకోకుండా పనిచేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.

# ఇరాన్ నేవీ చీఫ్ హతం

>> యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలన్న డిమాండ్‌లు ఆమోదిస్తేనే యుద్ధం ఆగుతుందని ఇరాన్ తెగేసి చెప్పింది. ఇదిలా ఉంటే ఇజ్రాయెల్ ఇరాన్‌లోని మరిన్ని నగరాలపై దాడులుచేసింది. ఇరాన్‌కు ఉన్న కీలకమైన ఇంధన వ్యవస్థలే టార్గెట్‌గా దాడిచేసింది. అదే విధంగా ఇరాన్‌కూడా ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలోని చమురు, గ్యాస్ క్షేత్రాలే లక్ష్యంగా దాడులుచేసింది. ఇదిలా ఉంటే భూతల దాడులుచేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రయత్నిస్తూ అందుకు మూల్యం కూడా తీవ్రస్థాయిలోనే ఉంటుందని, అదే జరిగితే ఆ రెండుదేశాలు అతిపెద్ద తప్పుచేసినట్లు భావించాల్సిందేనని అన్నారు. ఇరాన్ రాయబారి అలిబహ్రానీ మాట్లాడుతూ హార్మూజ్ జలసంధిలో యధావిధిగా ఆ శతృదేశాలుమినహా ఇతర దేశాలకు రాకపోకలు యధావిధిగానే కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇదిలా ఉంటే అబూదాబిపై ఇరాన్‌జరిపిన క్షిపణి దాడుల్లో ఇద్దరుప్రాణాలు కోల్పోయారు. ఒకరు భారతీయుడు మృతుల్లో ఉన్నారు. యుఎఇ ఇరాన్‌క్షిపణులను అడ్డుకుంటున్నప్పటికీ క్షిపణి శకలాలు పడి ఇద్దరూ చనిపోయినట్లు తేల్చారు. కాగా బుధవారం జరిగిన దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్‌కోర్ నేవీచీఫ్ ఆలిరెజాతంగ్సిరిని మట్టుబెట్టామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. చీఫ్‌తోపాటే మరికొందరు సీనియర్ నౌకాదళ కమాండర్లు మృతిచెందారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్‌కట్జ్ వెల్లడించారు. హార్మూజ్‌జలసంధి మూసివేతను అలీరేజానే పర్యవేక్షించారన్న సమాచారంతో ఇజ్రాయెల్ ఆయన్నే టార్గెట్‌చేసుకుందని సమాచారం. రష్యా చమురు రవాణా చేస్తున్న ట్యాంకర్ నౌకపై డ్రోన్ బోటు దాడి చేసింది. టర్కీ తీరం సమీపంలోని నల్ల సముద్రంలో ఈ సంఘటన జరిగింది. ఈ దాడి వల్ల నౌక బ్రిడ్జిపై పేలుడు సంభవించిందని, ఇంజిన్ రూమ్‌లోకి నీరు ప్రవేశించిందని తుర్కియే మీడియా పేర్కొంది. షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం సియెర్రా లియోన్ జెండా కలిగిన ఎంటి అల్టురా నౌక సుమారు 10 లక్షల బ్యారెల్స్ ముడి చమురుతో రష్యాలోని నోవోరోస్సిస్క్ ఓడరేవు నుంచి బయలుదేరింది. యూరోపియన్ యూనియన్, బ్రిటన్ దీనిపై ఆంక్షలు విధించాయి. ఇస్తాంబుల్ బోస్ఫరస్ జలసంధికి సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న ఈ ట్యాంకర్‌ను డ్రోన్ బోటు ఢీకొట్టినట్లు తుర్కియే వెల్లడించింది. తన మిత్రదేశం అయిన ఇరాన్‌కు రష్యా ఆపన్న హస్తం అందిస్తోంది. డ్రోన్లను సరఫరాచేయడంతోపాటు ఇరాన్‌కు శతృదేశాల సమాచారం మొత్తం తన నిఘా వ్యవస్థలతో అందించేందుకు ఏర్పాట్లుచేస్తోంది. అమెరికాసైనికులు, కమాండర్లు ఆచూకీ చెప్పాలంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ పిలుపునిచ్చింది. అమెరికా బేస్‌లపై తమ దాడులకు భయపడియుఎస్‌సైనికులు ఇతరప్రాంతాల్లో తలదాచుకుంటున్నారని ఇరాన్ ప్రకటించింది.

# నేను మంత్రికావడం ఇష్టంలేని బిఆర్ఎస్

>> ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇష్యూ చేశారని, ఒకవేళ గ్రామాల్లో బిఆర్ఎస్ పెద్ద తాగునీటి వ్యవస్థన్ను ఏర్పాటు చేస్తే అది ఎటుపోయింది? అని ప్రశ్నించారు. కెసిఆర్ లేకుంటే నీళ్లే రావు అనేలాగా క్రియేట్ చేశారని మండిపడ్డారు. అసెంబ్లీ భవనం కట్టిన నిజాం లేదని, ఈ భవనాన్ని నేటి తరడం వాడుకోవట్లేదా ..? అదే విధంగా, మిషన్ భగీరథను కాపాడాలని ఊర్లలో కూడా అవేర్నెస్ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో నీళ్లు రావడం లేదని ఊరికే ఆరోపణలు చేయడం సరికాదని హితవు చెప్పారు. నేను టీడీపీలో ఎమ్మెల్యేగా ఉన్నపుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా చేరలేదని, కాని సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్‌లో ఎంమ్మెల్యేగా గెలిచి, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారని విమర్శించారు. సబితా ఇంద్రారెడ్డికి తనపై ద్వేషం ఉండొచ్చు... కానీ పార్టీ మారొద్దని సబితను, సునీతా లక్ష్మారెడ్డిని బతిమలాడామని చెప్పారు. తాము మహిళలకు 57,000 కోట్ల వడ్డీ లేని రుణాల కింద ఇప్పించామంటే ప్రశ్నిస్తున్నారని, బిఆర్ఎస్ హయాంలో బడ్జెట్ లో వడ్డీ లేని రుణాలు కోసం 3000 కోట్లు పెట్టి, కేవలం 6 కోట్లు మంజూరు చేశారని విమర్శించారు. ఎవరికి కళ్యాణ లక్ష్మి పథకం రాలేదో వారి వివరాలు చెబితే అక్కడి తహిసిల్దార్, ఆర్డీవోలను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి సీతక్క స్పందించారు. లబ్దిదారురాలు ఇంటికి పోయి కల్యాణలక్ష్మి ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. తులం బంగారం పథకాన్ని ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్ట లేదని, బిఆర్ఎస్ ఎన్నో వాగ్దానాలు ఇచ్చి అమలు చేయకపోయినా.. తమకు ఇంకా సమయం ఉందని, హామీలన్ని అమలు చేస్తామన్నారు. మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగినట్టు మాట్లాడుతోందని శాసనసభలో బిఆర్ఎస్ మాజి మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.

# సదరన్ పార్ట్ రీజనల్ రింగ్ రోడ్డు డిపిఆర్ రూపొందిస్తున్నాం

## మంత్రి కోమటిరెడ్డికి కేంద్ర మంత్రి గడ్కరీ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి26:** తెలంగాణ రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌లో మరో మైలురాయి చేరబోతోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిరంతర కృషితో, దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు (సౌథరన్ పార్ట్ ఆర్ఆర్ఆర్) నిర్మాణ ప్రక్రియలో ఒక కీలక ముందడుగు పడింది. మంత్రి కోమటిరెడ్డి గతంలో చేసిన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఈ ప్రాజెక్టు పురోగతిని వివరిస్తూ ఆయనకు ఒక అధికారిక లేఖ రాశారు. సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) రూపొందిస్తున్నట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఈ పనుల కోసం ఇప్పటికే ప్రత్యేక కన్సల్టెన్సీని అపాయింట్ చేశామని, నివేదిక తయారీ ప్రక్రియ కొనసాగుతోందని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చిన సానుకూల స్పందన పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాము చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఇది ఒక అద్భుతమైన శుభవార్త. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్మితం కాబోయే ఈ రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేయబోతోంది.శివారుజిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి భారీ అవకాశాలు లభిస్తాయన్నారు. ఇప్పటికే ఉత్తర భాగానికి అనుమతి తెలిపి టెండర్ ప్రక్రియ కొనసాగుతున్న సందర్భంలో.. దక్షిణ భాగం పట్ల కూడా కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తెలపడంతో పూర్తి రీజినల్ రింగ్ రోడ్డు(రింగ్)సాకారమవుతుందని మంత్రి తన ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఉత్తర దక్షిణ భాగాల అనుసంధానంతో హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాలు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను పొందుతాయనీ, ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకుంటుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY LIMITED**
TN No:- 19/2025-2026/SGM/GM(VIWSCO) dt. 25-03-2026.
No. of Works = 1 Value of Work - Rs. 56.81 Lakhs
Downloading starting Date:- 26-03-2026
Tender Closing Date:- 10-04-2026
Further Details at http://tender.apeprocurement.gov.in
O/o GM(VIWSCO) Cell No. 8187898428
Sd/- SGM(VIWSCO)

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 27.03.2026
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి తెలంగాణ జనశక్తి పార్టీ (పార్టీ పేరు) అధ్యక్షులు అయిన శ్రీ వంజాల రమేష్ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ పెద్ది సతీష్ గారు (2) శ్రీ పుల్ల బిక్షపతి గారు (3) శ్రీమతి పెద్ది కృష్ణవేణి గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము బంజారా హిల్స్, హైదరాబాద్ సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు తెలంగాణ జనశక్తి పార్టీ (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
శ్రీ వంజాల రమేష్ అధ్యక్షులు,
తెలంగాణ జనశక్తి పార్టీ.

### మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కొత్త ట్విస్ట్
## డాక్టర్‌ని అదుపులోకి తీసుకున్న సిట్

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** మొయినాబాద్ డ్రగ్స్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా జుబ్లీహిల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ బాలాజీని అదుపులోకి తీసుకుంది. ఈ అరెస్టుతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరిన్ని పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. రోహిత్ రెడ్డి, రితీష్ రెడ్డిలను విచారించిన సమయంలో డాక్టర్ బాలాజీ పేరు బయటకు వచ్చింది. డ్రగ్ పెడ్లర్ రాకేష్ వర్మ నుంచి డాక్టర్ బాలాజీకి ఎండిఎంఏ వంటి ప్రమాదకరమైన డ్రగ్స్ అందినట్లు ఆధారాలు లభించాయి. ఈ కేసులో లోతైన విచారణ జరుగుతున్న కొద్దీ నిందితుల జాబితా పెరుగుతోంది. ఇప్పటివరకు 11 మందిగా ఉన్న నిందితుల సంఖ్య, తాజా అరెస్టులతో 15కు చేరింది.

### జగ్గారెడ్డి,కుసుమకుమార్‌లపై
## కేసు కొట్టివేత

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** మానవ అక్రమ రవాణా కేసులో జగ్గారెడ్డి, కుసుమ కుమార్‌లను నిర్దోషులుగా తీర్పుచెప్పి నాంపల్లి లోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు గురువారం కొట్టివేసింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఎ1, ఎ3గా కుసుమ కుమార్‌లు ఉన్నారు. జగ్గారెడ్డి, కుసుమ కుమార్ తరుపున న్యాయవాది సంతోష్ రెడ్డి వాదించారు. ఎ1, ఎ3 హాజరైనారు ప్రత్యేక కోర్టు ఐపిసి సెక్షన్ 419, 420, 467, 468, 471, 409, 370 భారత పాస్‌పోర్టు చట్టం సెక్షన్ 12, ఇమ్మిగ్రేషన్ చట్టంలోని సెక్షన్ 24 కింద శిక్షార్హమైన నేరాలకు సంబంధించి ఏ1 ఏ3 నిర్దోషులని ప్రకటించారు.

# కెసిఆర్‌పై గొప్పలే చర్చలా?

- గ్రామాల్లో తాగునీటి వ్యవస్థను ధ్వంసం చేసిన బిఆర్‌ఎస్
- డి.సిఎం భట్టి విక్రమార్క ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా సభలో మాట్లాడటం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని హితవు చెప్పారు. "పెళ్లై బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు" అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదన్నారు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడంవల్లనో, లేదంటే దరఖాస్తు చేయడంలో జాప్యంవల్లనో జరుగుతోందన్నారు. ఈ అంశంపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపులు కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా? అని భట్టి ప్రశ్నించారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారని, కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కాలేదని స్పష్టం చేశారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదని, ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోందన్నారు. ఉదాహరణకు ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదని గుర్తు చేశారు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోందన్నారు. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను బిఆర్ఎస్ ఇబ్బందులకు గురిచేసిందని భట్టి మండిపడ్డారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దామని ప్రతిపాదించారు. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దామని సవాల్ విసిరారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని, మంత్రులను గౌరవిస్తూ మాట్లాడాలని, సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరమని సూచించారు.

### రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి
## శుభాకాంక్షలు: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. భద్రాద్రి రామాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.351 కోట్లు కేటాయించామన్నారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యం దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు జరుపుకోవాలన్నారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

### పీఆర్‌సీలో రివైజ్డ్ పే ఫిక్సేషన్‌కి
## సెప్టెంబర్ 30 వరకు గడువు
### సర్క్యూలర్ జారీ చేసిన ఆర్థిక శాఖ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26:** తెలంగాణ రాష్ట్రంలో మొదటి పీఆర్సీలో రివైజ్డ్ పే స్కేల్స్–2020 పే స్కేల్స్ ఫిక్సేషన్ చేయాలంటూ ఉద్యోగులు ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా పే ఫిక్సేషన్–2020 చేసుకునే గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన సర్క్యూలర్ ఆర్థిక శాఖ కార్యదర్శి జారీ చేశారు. పీఆర్‌సీలో సవరించిన పే స్కేల్స్ 2020లో పే ఫిక్సేషన్లను మార్చి 31. 2023 లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మార్చి 31, 2023 తర్వాత కూడా పెండింగ్‌లో ఉన్న ఏవైనా పే ఫిక్సేషన్లకు, ఆర్థిక శాఖ అంగీకారంతో పాటు ప్రభుత్వ ముందస్తు ఆమోదం కూడా అవసరం ఉంటుంది. సవరించిన పే స్కేల్స్–2020లో పెండింగ్‌లో ఉన్న పే ఫిక్సేషన్లను పూర్తి చేయడానికి సమయాన్ని 31.03. 2026 వరకు పొడిగించాలని ఆఫీసర్స్ కమిటీ సిఫార్సు చేసినట్లు సాధారణ పరిపాలన (ఎస్‌డబ్ల్యూ) విభాగం తెలియజేసింది. తదనుగుణంగా సవరించిన పే స్కేల్స్–2020లో పెండింగ్‌లో ఉన్న అన్ని పే ఫిక్సేషన్లను పూర్తి చేయడానికి సెప్టెంబర్ 30 వరకు గడువును నిర్ణయించినట్లు సర్క్యూలర్‌లో ప్రకటించింది. సచివాలయంలోని అన్ని విభాగాలు, విభాగాధిపతులు, కార్యాలయ అధిపతులు, డిడిఓఎస్, ఆడిట్ అధికారులు, నిబంధనల ప్రకారం అర్హతను ధృవీకరించి, నిర్ధారించిన తర్వాత, సవరించిన పే స్కేల్స్–2020 లోని అన్ని పే ఫిక్సేషన్లు సెప్టెంబర్ 30 నాటికి తప్పనిసరిగా పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్క్యూలర్‌లో పేర్కొన్నారు.

## ఆర్‌కామ్ మాజీ డైరెక్టర్ల ఇళ్లల్లో సిబిఐ సోదాలు
### ఎస్‌బిఐని రూ.114.98 కోట్ల మోసం అభియోగాలపై దర్యాప్తు

**న్యూఢిల్లీ, మార్చి 29:** రిలయన్స్ టెలికామ్‌కు సంబంధించిన ఇద్దరు మాజీ డైరెక్టర్ల నివాసాలపై కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ అధికారులు ఏకకాలంలో దాడులునిర్వహించారు. వారిద్దరిపైనా రూ.114.98 కోట్లమేర బ్యాంకులోను మోసం కేసునమోదయింది. రిలయన్స్ టెలికామ్ ఆనాటి డైరెక్టర్ సతీష్ సేథ్, గౌతమ్ బి దోషి, మరికొందరుప్రభుత్వ ఉద్యోగులపై కేసులునమోదుచేసారు. ఐపిసి పరిధిలో నేరపూరిత ఆర్థిక నియమావళి, అధికార దుర్వినియోగం, అవినీతినిరోధక చట్టం 1998 ప్రకారం కేసులునమోదుచేసారు. భారతీయ స్టేట్‌బ్యాంకును వీరు మోసం చేసారని బ్యాంకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఈ దర్యాప్తుకొనసాగుతోంది. బ్యాంకుకు వీరు అనుసరించిన అవకతవకల కారణంగా 114.98 కోట్ల నష్టం వాటిల్లిందని ఉద్దేశ్యపూర్వకంగానే నష్టం వాటిల్లేలాచేసారని సిబిఐ వెల్లడించింది. రిలయన్స్ టెలికామ్ సంస్థకు ఆనాడు 11 బ్యాంకుల కూటమి కలిసి వచ్చిన రూ.735 కోట్లరుణంలో ఎస్‌బిఐ కూడా ఉంది. ఈకేసుపరిధిలోనే ఎస్‌బిఐ 114.98 కోట్ల నష్టం వచ్చిందని అందుకు సంస్థతోపాటు ఆనాటి డైరెక్టర్లు కూడా బాధ్యులేనని తేల్చింది. దీనితో సతీష్‌సేత్, గౌతమ్ బి దోషిల నివాసాల్లోకూడా గురువారం సోదాలునిర్వహించింది. ఆకస్మిక దాడుల్లో రిలయన్స్ టెలికామ్ కార్యాలయం, డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాల్లో కీలక పత్రాలు స్వాధీనంచేసుకున్నట్లు తెలిపింది. రిలయన్స్‌గ్రూప్‌కు లింక్ అయి ఉన్న అనుబంధ కంపెనీల్లో జరిగిన అవకతవకలపైనే దర్యాప్తులు సాగుతున్నాయి. అనిల్ అంబానిని సిబిఐ కొన్ని గంటలపాటు విచారణచేసింది. రూ.2929 కోట్ల మోసానికి సంబంధించి సిబిఐ దాడులుచేస్తోంది.

## భార్యను కారుతో తొక్కించి చంపిన భర్త!

**కాలబురగి (కర్ణాటక) మార్చి 26:** కట్టుకున్న భార్యను ఓ భర్త అత్యంత కిరాతకంగా హతమార్చాడు. నడిరోడ్డుపై జుట్టు పట్టుకుని కొట్టి, ఆ తర్వాత కారుతో తొక్కి చంపేసిన అమానవీయ ఘటన కలబురగి జిల్లాలో గురువారం జరిగింది. సీసీటీవీలో రికార్డయిన ఈ దృశ్యాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మహారాష్ట్రలోని బరామతికి చెందిన అక్షయ్, షైలా (28) దంపతులు. వీరికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. గురువారం ఉదయం వారు పుణ్యక్షేత్రమైన గణగాపుర వెళ్లేందుకు మారుతి ఎర్టిగా కారులో బయలుదేరారు. కలబురగి సమీపంలోని బల్లూర్గా గ్రామ శివార్లలోకి రాగానే ఉదయం 11 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. దీంతో ఆగ్రహానికి గురైన అక్షయ్, భార్య షైలాను కారులోంచి బయటకు తోసేశాడు. అనంతరం ఆమె జుట్టు పట్టుకుని నడిరోడ్డుపైనే విచక్షణారహితంగా కొట్టాడు. షైలా కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వారు జోక్యం చేసుకుని అక్షయ్‌ను అడ్డుకున్నారు. ఆమెను తిరిగి కారులో ఎక్కించారు. కాసేపటికే అక్షయ్ కారును సమీపంలోని ఓ పొలం వైపు మళ్లించాడు. అక్కడ మళ్లీ షైలాను బయటకు నెట్టి, ఆమెపై నుంచి కారును నడిపి అతి దారుణంగా చంపేశాడు. భార్య షైలాకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే అక్షయ్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై కలబురగి ఎస్పీ అద్దూరు శ్రీనివాసులు మాట్లాడుతూ, "నిందితుడిని అరెస్ట్ చేశాం. అన్ని కోణాల్లోనూ కేసును దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోలీసులు అక్షయ్‌పై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

### హార్వర్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సింపోజియం
#### నేడు ఆన్‌లైన్‌లో కీలకోపన్యాసం ఇవ్వనున్న సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ శుక్రవారం నిర్వహించనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సింపోజియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్‌లో కీలకోపన్యాసం ఇవ్వనున్నారు. సదస్సులో వివిధ దేశాల ప్రభుత్వాధినేతలు, పరిశ్రమల యాజమాన్యాలు, అకడమిక్ నిపుణులు పాల్గొంటారు. పరిపాలన, ఆర్థిక, మానవీయ అంశాల్లో ఏఐ వినియోగం, ప్రభావంపై సదస్సులో చర్చిస్తారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెన్నెడీ స్కూల్‌లో ఈ సదస్సు జరగనుంది. జనవరిలో సీఎం రేవంత్‌రెడ్డి కెన్నెడీ స్కూల్‌లో లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేశారు. కెన్నెడీ స్కూల్ మాజీ విద్యార్థిగా సదస్సుకు హాజరు కావడంతో పాటు కీలక ఉపన్యాసం ఇవ్వాలని హార్వర్డ్ యూనివర్సిటీ రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున బోస్టన్‌కు వెళ్లడం వీలుకాక ఆన్‌లైన్‌లో కీలకోపన్యాసం ఇవ్వాలని సీఎం నిర్ణయించారు.

### పెట్రోలు, గ్యాస్ నిల్వలపై
# ఆందోళన వద్దు
#### బ్లాక్‌మార్కెటింగ్, పుకార్లపై ప్రత్యేక నిఘా: స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** తెలంగాణలో పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబోయే 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని, బుధవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 484 ట్రక్కుల గ్యాస్ సిలిండర్లను డెలివరి చేసినట్లు కమిషనర్ తెలిపారు. డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతున్నప్పటికీ, ప్రజలు అవసరానికి మించి బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఒత్తిడి పెరుగుతోందని వివరించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్, వాహనాలకు వాడే సిఎన్‌జి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. కాగా.. పెట్రోల్, డీజిల్ సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. నిల్వలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని కమిషనర్ స్టిఫెన్ తెలిపారు. రాష్ట్రంలో ఇంధన కొరత లేదు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు. ప్రజలు తమకు అవసరమైన మేరకే ఇంధనాన్ని, సిలిండర్లను తీసుకోవాలి అని పిలుపునిచ్చారు.

### ప్రయాణికుల అవసరాలకు
## అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు
#### స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి: సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి
#### రాజస్థాన్ తరహాలో రాష్ట్రంలో ప్రజా సూచన పోర్టల్ ఏర్పాటు
#### తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను అభినందించిన నిఖిల్ డే
#### సిఎం రేవంత్‌రెడ్డితో నిఖిల్ డే బృందం సమావేశం

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాసనమండలిలో కాన్ఫరెన్స్ హాల్‌లో కలిసింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణ లోనూ ప్రజా సూచన పోర్టల్ ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోట ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఐటీ శాఖ ద్వారా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను నిఖిల్ డే ప్రశంసించారు. ఈ బిల్ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు దాన కిషోర్, వి.శేషాద్రి, బి. అజిత్ రెడ్డి, మాణిక్‌రాజ్, దివ్య దేవరాజన్, వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం బస్ దుర్ఘటనపై...
#### మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26: ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో 13 మంది సజీవ దహనం కావడంపై విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి**

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం సమీపంలో రాయవరం వద్ద తెల్లవారు జామున జరిగిన ఘోర బస్ ప్రమాదంలో పలువురు దుర్మరణం చెందడం పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిర్మల్ నుంచి వింజమూర్ వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్ బస్ ఇంకో వాహనాన్ని డీ కొన్న ప్రమాదంలో అగ్నికి ఆహుతి అవ్వడం అందులో ప్రయనిస్తున్న పలువురు సజీవ దహనం అవ్వడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షి ంచారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ని వ్యక్తం చేస్తూ మృతులకు తన సంతాపం ప్రకటించారు.

## నేడు వైన్ షాప్‌లు బంద్

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** హిందువులకు ఎంతో పవిత్రమైన శ్రీరామ నవమి వేడుకలు హైదరాబాద్ నగరంతో రాష్ట్రం నలుమూలల అత్యంత భక్తి శ్రద్ధలతో జరగనున్నాయి. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో రామాలయాల వద్ద బారులు తీరుతుంటారు. ఈ క్రమంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే శ్రీరామ నవమి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో వైన్‌షాప్‌లను మూసివేయాలంటూ పోలీసులు ఆదేశించారు.

## పోలీసులకు ఖాళీల లభ్యత ఆధారంగా పదోన్నతులు
#### డిపిసి కమిటి త్వరలోనే ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్
#### సూపర్‌న్యూమరీ పోస్టులు ఏర్పరిచి పదోన్నతులు ఇవ్వండి: సబితా ఇంద్రారెడ్డి

**హైదారబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** పోలీసులకు ఖాళీల లభ్యత ఆధారంగా పదోన్నతులు ఇస్తావని, పదోన్నతి రానివారికి ఆర్థిక ప్రయోజనాలు యథావిధిగా సర్వీసు ఆధారంగా6,12,18 ఏళ్ళకు ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే డిపార్టుమెంట్ ప్రమోషన్ కమిటిని ఏర్పాటు చేస్తామని ప్రశ్నోత్తరాల సమయంలో వివరించారు.1991,96 బ్యాచ్‌ల వారికి కూడా పదోన్నతులు రాలేదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మందుల సామేల్ వేసిన ప్రశ్నపై సభ్యులు పోలీసుల సమస్యలపై సభలో వివరించారు. పల్లారాజ్వేర్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి రెండేళ్ళకు ఒకసారి పోలీసు రిక్రూట్‌మెంట్ చేసేదని కోవిడ్ కారణంగా 2020లో నియామక ప్రక్రియచేపట్టలేదని 2022లో నోటిఫికేషన్ వేయగా అది మీరు వచ్చాక నియామక పత్రాలు ఇచ్చారని మళ్ళీ నోటిఫికేషన్‌వేయలేదని అన్నారు. రాష్ట్రంలో 17లక్ష మంది యువత నోటిఫికేషన్ కోసం చూస్తున్నారని తెలిపారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ 2001 ఎస్‌ఐ బ్యాచ్‌వారికి ఇప్పటికి 90 మందికి పదోన్నతులు రాలేదని వారిని సూపర్ న్యూమరీ పోస్టులు కల్పించి పదోన్నతులు ఇవ్వాలని అన్నారు.హోంగార్డులకు వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏవైతే సంక్షేమపథకాలు చేస్తామని హామిఇచ్చారో వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. కెసిఆర్ 27వేల రూపాయలకు జీతం పెంచారని అన్నారు. 60మంది హోంగార్డులు చనిపోయారని వారి కుటుంబలో ఒకరి ఉపాధిని కారుణ్య నియామకం కింద ఇవ్వాలని పదిలక్షల రూపాయలు చెల్లించాలని కోరారు. సహజ మరణంకు కూడా వారికి ఆర్థిక సహాయం అందించాలనిపెన్షన్ కూడా ఇవ్వాలని సూచించారు. సినియార్టీ ఫిక్సేషన్ ట్రేనింగ్‌లోనే చేయాలని కోరారు. పాయల్ శంకర్ ఎస్‌ఐసిఐ పదోన్నతి కేసు కోర్టులో ఉందని దానిపై ప్రభుత్వం శ్రద్ధతీసుకోకపోవడంతో పదోన్నతులు నిలిచిపోయాయని ఆవేదన చెందారు. నాగరాజు మాట్లాడుతూ మల్టీజోన్ వన్, మల్టీజోన్ టూలో పోస్టుల సంఖ్యలో భారీగా తేడా ఉండటంతో పదోన్నతులలో వివక్ష జరుగుతోందని ఆవేదన చెందారు.ఇది గత ప్రభుత్వం అనాలోచితంగా చేసిన చర్యలవల్లే జరిగిందని ఆరోపించారు.




## సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి హైకోర్టులో పాలాభిషేకం


**తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి గురువారం తెలంగాణ హైకోర్టు వద్ద పాలాభిషేకం చేసిన న్యాయవాదులు.**

# క్షిపణి శకలాలుపడి భారతీయుని మృతి
### అబూదాబిలో ఘటన, మరో భారతీయుడికి తీవ్రగాయాలు



అబూదాబి, మార్చి 26: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు విషాదానికి దారితీశాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో గురువారం గగనతలంలో పేల్చివేసిన బాలిస్టిక్ క్షిపణికి చెందిన శకలాలు జనావాసాలపై పడటంతో ఈ జరిగిన ఓ ఘటనలో ఒక భారత జాతీయుడు ప్రాణాలు కోల్పోయారు. మరొక భారతీయుడు గాయపడ్డారు. ఘోరం జరిగింది. ఈ దుర్ఘటనలో మొత్తం ఇద్దరు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు ఓ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డగించి కూల్చివేశాయని తెలిపింది. అయితే, ఆ క్షిపణి శకలాలు అబుదాబిలోని స్వీహాన్ వీధిలో పడ్డాయని పేర్కొంది. ఈ ప్రమాదంలో ఒక భారత, ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించారని ధృవీకరించింది. గాయపడిన ముగ్గురిలో ఒక యూఏఈ, ఒక జోర్డాన్, ఒక భారత జాతీయుడు ఉన్నారని, వారికి చికిత్స అందిస్తున్నామని వివరించింది. ఈ ఘటనలో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పశ్చిమాసియాలో గతనెల 28 నుంచి మొదలైన ఘర్షణల పర్యవసానంగానే ఈ దాడులు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పశ్చిమాసియాలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలు, వారి మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగుతోంది. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వినిపిస్తున్న భారీ శబ్దాలు క్షిపణులను అడ్డగించడం వల్లే వస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ప్రజలు అనవసరపు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అబుదాబి అధికారులు విజ్ఞప్తి చేశారు.

### క్లాస్‌రూమ్‌లోనే విద్యార్థినికి ప్రపోజ్‌చేసిన ప్రొఫెసర్
# చెప్పుతో కొట్టిన విద్యార్థిని



**బెంగళూరు, మార్చి 26:** బాధ్యతాయుతమైన ప్రొఫెసర్ హోదాలో ఉన్న ఒక వ్యక్తి నీచంగా ప్రవర్తించాడు. క్లాస్ రూంలోనే అంతరి ముందు విద్యార్థినికి లవ్ ప్రపోజ్ చేశాడు. ఈ ఘటన కర్ణాటకలోని తుమకూరులో ఉన్న శ్రీ సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్దుల్ విద్యార్థినికి ప్రపోజ్ చేయడం ఉద్రిక్తతల్ని పెంచింది. దీంతో ఆగ్రహించిన స్టూడెంట్స్ ప్రొఫెసర్‌పై దాడి చేశారు. ఈ కాలేజీ కర్ణాటక హోం మంత్రి జి పరమేశ్వరకు చెందినది. ఈ ఘటన వైరల్ కావడంతో ప్రొఫెసర్‌ను కాలేజీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. వైరల్ అవుతున్న వీడియోలో మీ బ్యాచ్ చూపిస్తున్న అపారమైన ప్రేమను నేను తట్టుకోలేకపోయాను, మరియు మీ బ్యాచ్‌లోని అత్యంత ముఖ్యమైన అమ్మాయిలలో ఒకరికి నేను ప్రపోజ్ చేయాలనుకుంటున్నాను మరియు నేను మొత్తం బ్యాచ్‌కు చాక్లెట్లు పంచుతాను అంటూ, సదరు అమ్మాయి ఐలవ్ యూ అని చెప్పాడు. ఈ ఘటన తర్వాత షాక్‌కు గురైన విద్యార్థిని ప్రొఫెసర్‌ను నిలదీసింది. స్టూడెంట్ తనను ప్రేమిస్తోందని, దానికి రుజువులు ఉన్నాయని ప్రొఫెసర్ చెప్పడం కొసమెరుపు. నువ్వు నాకు ఐలవ్ యూ చెప్పావు. దీనికి సీసీటీవీ ఫుటేజ్ రుజువులు ఉన్నాయి అని ప్రొఫెసర్ విద్యార్థినితో అన్నాడు. దీని తర్వాత విద్యార్థిని తన చెప్పుతో ప్రొఫెసర్‌ను కొడుతున్న వీడియో వైరల్‌గా మారింది. క్యాంపస్‌లో వెంబడించి మరీ విద్యార్థులు దాడి చేశారు. ఈ ఘటనలో అబ్దుల్‌ను సస్పెండ్ చేయగా, దీనిపై విచారణ జరుగుతోంది.


**VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY LIMITED**

TN No:- 19/2025-2026/SGM/GM(VIWSCO) dt. 25-03-2026.

No. of Works = 1 Value of Work - Rs. 56.81 Lakhs

Downloading starting Date:- 26-03-2026

Tender Closing Date:- 10-04-2026

Further Details at http://tender.apeprocurement.gov.in

O/o GM(VIWSCO) Cell No. 8187898428

Sd/- SGM(VIWSCO)

**శ్రీ గండిమైసమ్మ దేవస్థానం**

దేవాదాయ-ధర్మాదాయ శాఖ, గండిపేట గ్రా., మం., రంగారెడ్డి జిల్లా

**సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన**

లేఖ నెం: SGMD/2026 తేది: 25.03.2026

[illegible] తేది: 10.04.2026 శుక్రవారం రోజున ఉ.11.00గం.లకు [illegible] మూడు (3) సంవత్సరాల కాలపరిమితికి బహిరంగ వేలం [illegible]

| క్రమ సంఖ్య | బీట్ నెం. | స్థలము కొలతలు | వేలం పాట కాలపరిమితి | టెండరు ధర | ప్రతిబిటీకి డిపాజిట్ రూపాయలు |
|---|---|---|---|---|---|
| 1 | నెం.3,4 & 5 | 18x50 | 3 సంవత్సరములు 10.04.2026 నుండి 09.04.2029 | రూ. 1000/- | రూ. 50,000/- |
| 2. | పార్కింగ్ నిర్వహణ వసూలు చేసుకునే హక్కు | | 1 సంవత్సరము 10.04.2026 నుండి 09.04.2027 | రూ. 500/- | రూ. 50,000/- |

[illegible]

సం/-. కార్యనిర్వహణాధికారి, సెల్ నెం. 9912186517.

DIPR.NO. 17645-PP/CL/ADVT/1/2025-26 తేది: 26.03.2026

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 27.03.2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి తెలంగాణ జనశక్తి పార్టీ (పార్టీ పేరు) అధ్యక్షులు అయిన శ్రీ వంజాల రమేష్ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ పెద్ది సతీష్ గారు (2) శ్రీ పుల్ల బిక్షపతి గారు (3) శ్రీమతి పెద్ది కృష్ణవేణి గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము బంజారా హిల్స్, హైదరాబాద్ సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు తెలంగాణ జనశక్తి పార్టీ (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

శ్రీ వంజాల రమేష్ అధ్యక్షులు,
తెలంగాణ జనశక్తి పార్టీ.

వార్త

దేశానికి గాని, సమాజానికి గాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.

- అంబేద్కర్

# హార్ముజ్ తెరుచుకుంటుందా!

మధ్యప్రాచ్యంలో నెలరోజులనుంచి కొనసాగుతున్న యుద్ధం ఇక సద్దుమణుగుతుందని భావిస్తున్నా రెండు దేశాల డిమాండ్ల జాబితాలను చూస్తే ఇప్పట్లో తగ్గుముఖం కనిపించడంలేదు. సరికదా మరింతగా దాడులు పెరిగే ప్రమాదం సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మూడుదేశాలకు మధ్య ఇప్పుడు కేంద్ర బిందువుగా హార్ముజ్ జలసంధి నిలిచింది. ఈ జలసంధి మీదుగా చమురు, గ్యాస్ రవాణాను పూర్తిగా నిలిపివేయడంతో ఇరాన్‌పై అగ్రరాజ్యానికి మరింత కోపం పెరిగిపోయింది. ఫలితంగానే బంకర్‌బస్టర్ బాంబులు, క్షిపణులు, ఎఫ్‌-35 విమానాలు వంటి వాటితో దాడులు చేసింది. అదంతా ఒక ఎత్తు. అసలు అరేబియా సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఓమన్‌లను కలుపుతూ ఈ జలసంధి ప్రయాణిస్తుంది. ప్రపంచంలోని చమురు రవాణాలో 20శాతానికిపైగా ఈహార్ముజ్ మీదుగానే కొనసాగుతుంది. ఇరాన్‌పైయుద్ధం పుణ్యమా అని ఈ రవాణా ఇప్పుడు పూర్తిగా స్తంభించిపోయింది. ఫలితంగా ప్రపంచదేశాల్లో చమురు ధరలు కూడా పెరిగిపోయాయి. అప్పటివరకూ ఉన్న తక్షణ నిల్వలు కూడా కరిగిపోయాయి. యుద్ధం ప్రకటించినఅమెరికాలో కూడా ధరలు విపరీతంగా పెరిగాయని ఆ దేశ ప్రజాప్రతినిధులే ఒప్పుకుంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో హార్ముజ్ జలసంధిని పూర్తిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూనే ఆ ప్రాంతం పూర్తిగా తమ పర్యవేక్షణలోనే కొనసాగాలని అమెరికా పట్టుబట్టడం చూస్తుంటే యుద్ధ విరమణకు అసలు అమెరికాకే ఇష్టం లేనట్లుగా కనిపిస్తోంది. హార్ముజ్ మార్గం శతాబ్దాలుగా ఇరాన్ పరిధిలోనే కొనసాగుతోంది. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని ఈ ప్రాంతం మీదుగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్ల నుంచి టోల్‌ఫీజు వసూలుకు కూడా నిర్ణయిస్తోంది. అదే జరిగితే ఒక్కొక్క నౌకనుంచి సుమారు 18 కోట్లకుపైగా ఇరాన్‌కు నిధులు అందుతాయి. ఈ పరిణామాలను ఇరాన్ ఎంతకూ అంగీకరించకపోయినా అటు అణ్వాయుధ తయారీ, ఇటు హార్ముజ్ ఈ రెండిం టిపైనే ఎక్కువగా దృష్టిసారించి చర్చలు జరపాలని అమెరికా పట్టుబడుతోంది. మధ్యవర్తిదేశాలు అమెరికా చెప్పినట్లు నడుచుకోవడం, అగ్రరాజ్యం ఇచ్చిన 15షరతుల లేఖను అందించడం మినహా సొంతంగా నిర్ణయాలు తీసుకునే వీలులేదు. అందువల్ల ఇప్పుడు హార్ముజ్ జలసంధిని ముడిపెట్టి అమెరికా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తోంది. ప్రపంచంలో అగ్రరాజ్యంగా తాము తప్పమరొకరు ఉండకూడదన్న లక్ష్యం ట్రంప్‌లో ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తోంది. మాగా నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ ఇప్పుడు చిన్నదేశాల్లో తమ దేశ సైనిక, వైమానిక స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, దారికిరాని దేశాలను సైనిక చర్యతో లొంగదీసుకోవడం అనేది అమెరికాకు ఇప్పటికిప్పుడు అలవడిన వైఖరి కాదు. ఆది నుంచి కూడా అమెరికాది ఇదే దారి. ఇప్పుడు ఇరాన్‌పై యుద్ధవిరమణ ప్రతిపాదన తెచ్చింది కూడా అమెరికాయే. ముఖ్యంగా మిత్ర దేశాలైన గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులుఅమెరికాను మరింత ఇరుకునపెట్టాయి. చమురు స్థావరాలతోపాటు వాణిజ్య స్థావరాలపైనాదాడులు చేస్తుండటంతో అమెరికాకు చిక్కుపరిస్థితి ఎదురైంది. స్వదేశంలోనూ ఎదురవుతున్న అసమ్మతి దీనికితోడు యుద్ధవ్యయం తడిసిమోపెడు కావడం వంటివి కారణాలుగా కనిపిస్తున్నా ముఖ్యంగా హార్ముజ్ జలసంధిని మూసివేయడం అనేది కేవలం అమెరికా వల్లనేనని ప్రపంచదేశాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. అందుకే ఇప్పుడు తమడిమాండ్ల జాబితాలో హార్ముజ్‌ను ప్రధానంగా అమెరికా ప్రస్తావిస్తోంది. వారంలో900కిపైగా నౌకలు, ట్యాంకర్లు ఈ ప్రాంతంమీదుగా తమతమ గమ్యస్థానాలకు వెళుతుంటాయి. రోజుకు 100నుంచి138 వరకూ వాణిజ్యనౌకలు ఈప్రాంతం మీదుగానేవెళతాయి. ఇప్పుడు చమురు, సహజవాయువులే కాకుండా ఎరువులు, రసాయనాలు కూడా ఈప్రాంతం మీదుగానే వెళుతుంటా యి. ఇప్పుడు మూసివేత కారణంగా పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించేందుకు గల్ఫ్ ఆఫ్ ఓమన్‌లోనే నిలిచిపోయాయి. 95శాతం ట్రాఫిక్ నిలిచిపోయిందనే అంచనా. ఇప్పుడున్న పరిస్థితుల్లో యుద్ధవిరమణ చర్చలు ఎప్పుడు ప్రారంభం అవుతాయి? ఎప్పటికి ముగిసేను? ఈప్రాంతం మీదుగా నౌకల రవాణా సజావుగా ఎప్పటినుంచి పునరుద్ధరణ అవుతుందనేది ఎవ్వరికీ అంతుబట్టడంలేదు. అమెరికా విధించిన షరతులు ఆచరణ యోగ్యం కానివని, హార్ముజ్ రవాణాపై తమపర్యవేక్షణ మాత్రమే ఉండాలని ఇరాన్ పట్టుబడుతోంది. రోజుకు కనీసం 21 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈగల్ఫ్ జలసంధి మీదుగా వెళుతుంది. బ్యారెల్ వందడాలర్లకు మించుతున్న తరుణంలో వర్ధమాన దేశాల ఆర్థికవ్యవస్థలకు మరింత వ్యయభారంఅవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రోజుకోవిధంగా స్పందిస్తున్న తీరుతెలిసిందే. చర్చలకు ఇరాన్‌వచ్చిందనిముందు ప్రకటించి న ట్రంప్ ఐదురోజులు బ్రేక్ ప్రకటించామని తర్వాతఆపై అణుఉత్పత్తి, శుద్ధిపై పెట్టిన ఆంక్షలు ఇలా రోజుకోతీరులో కొనసాగాయి. అందుకే ఈ పర్షియన్‌దేశం ట్రంప్‌ను విశ్వసించడంలేదు. మధ్యవర్తిత్వానికి పాకిస్థాన్, ఈజిప్టు, తుర్కియేవంటి దేశాలు భుజాలగెరేసుకునిముందుకు వచ్చినా ఇరాన్ సుతరాము స్పందించలేదు. జలసంధిపర్య వేక్షణ వదులుకోవడం వీలుకానేకాదని స్పష్టం చేసింది. పైగా సుంకం వసూలు చేస్తే అమెరికా చేసిన నష్టాన్ని మొత్తం భర్తీచేసుకోవచ్చున్న ధీమాతోకూడాఉంది. వీటన్నింటి నేపథ్యంలో హార్ముజ్‌మీదుగా రాకపోకలుసాగడమనేది కూడా జవాబులేని ప్రశ్నగా మారుతోంది. ఇవన్నీ పక్కనపెడితే చర్చలపునరుద్ధరణ సాధ్యమేనా? జలసంధిపై ఉభయతారకమైన ఒప్పందం వీలవుతుందా అన్నది ప్రపంచదేశాలకు మిలియన్ డాలర్లప్రశ్నగా మారింది.

పొగిడేవారు లేనప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు

### చట్ట సభల్లో సీట్ల కోసం

చట్టసభల్లో సీట్ల పెంపు కోసం కేంద్రం చర్యలు మొదలుపెట్టింది. నియోజక వర్గాలపెంపుపై వివిధ రాష్ట్రాల, రాజకీయ పక్షాల అనుమానాలు, ఆందోళనల్ని తాత్కాలికంగా నివారించేలా మధ్యేమార్గాన్ని ఎన్నుకుంది. వాస్తవానికి 2029 ఎన్నికల నుండి, తాజాగా జరిగే 2026 జనాభా లెక్కలప్రకారంనియోజక వర్గాల్ని పునర్విభజించుకోవాలి. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పక్కాగా అమలు చేసినందున ఉత్తరాది రాష్ట్రాల కన్నా సీట్ల నిష్పత్తిలో వెనకబడతాయని ఆందోళన ఉంది. తద్వారా తమ పలుకుబడి, చట్టసభల్లో బలంతగ్గిఅసమానతలు పెరుగుతాయని, ఉత్తరాది రాష్ట్రాల మాటే చెల్లుబాటు అవుతుందని అనుమానపడ్డాయి. ఆస్థితిని ఎలాఎదుర్కోవాలా అన్నది, ఏ పద్ధతిలో సీట్ల పెంపు జరిగితే తక్కువ నష్టం, ఎక్కువ న్యాయం జరగవచ్చొనని మల్లగుల్లాలు పడుతున్నాయి. 2026జనాభా ప్రాతిపదికన కాకుండా2011జనాభా లెక్కల్నిగణనలోకి తీసుకుందామని. తద్వారా వచ్చే ఎన్ని కలకి ఆఖరునిమిషం మార్పులుకాకుండాచేర్పులు చెయ్యొచ్చని.

- డా.డి వి జి శంకరరావు, విజయనగరం

### పర్యావరణాన్ని కాపాడుకోవాలి

**ఎండాకాలంలో** ఎండవేడిమికి చెట్ల ఆకులు అప్పుడప్పుడు రాలిపోతుంటాయి. ఎక్కువగా రాలిపోయిన ఆకులను అనేకులు తగలబెడుతూ పర్యావరణానికి హాని చేకూరుస్తున్నారు. రాలిన ఆకులు తేలికగా భూమిలో కలిసిపోయో పూర్తి పర్యావరణ హితమైనవి. రాలిన ఆకులను వ్యర్థం చేయకుండా తిరిగి ఉపయోగిస్తే ప్రయోజనమే కాక పర్యావరణానికి పాటుపడిన వాళ్ళం అవుతాం. రాలిన ఆకులను నీటిలో కొన్ని రోజులు నానబెట్టి సేంద్రియ ఎరువుగావాడుకోవచ్చు. రాలిపోయిన ఆకులనుచెట్ల మొదళ్లలో వేయటం వల్ల చెట్లకు పోసిన నీరు గాలిలో త్వరగా ఆవిరి కాకుండా చెట్లకు రక్షణగా ఉంటాయి.

- కె. వెంకట మూర్తి, సికింద్రాబాద్

### అధికారుల నిర్లక్ష్యం

**ఎస్సి**, ఎస్టీ దివ్యాంగులకు వికలాంగుల హక్కుల చట్టం ఉన్నాకుడా ఈవర్గాల ప్రజలకుఅన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం ఈ వర్గాల ప్రజలకు ఇండ్లస్థలాలుపంపిణీచేస్తే కొనుగోలు అమ్మకాలుఈఎస్సి, ఎస్టీ, వికలాంగులు మాత్రమే చేయాలి. కానీ బిసిఇతర కులాలవాళ్లు ఈ కాలనీలో కొనుగోలుచేసి ఎక్కువవిస్తీర్ణం రాసుకొని పక్క ఇంటి వారి స్థలం అక్రమంగా ఆక్రమించుకుంటున్నారు.

- కదురు శ్రీనివాస్, వరంగల్ జిల్లా

### రిటైర్మెంట్ తర్వాత కూడా పోరాటమేనా?

రిటైర్మెంట్ అనేదిఉద్యోగ జీవితానికి ముగింపుమాత్రమే కాదు ఆజీవితం మొత్తం చేసినకష్టానికి లభించేగౌరవప్రద మైనప్రతిఫలంకూడా. అయితే ఇటీవల వెలుగులోకి వస్తున్న సంఘటనలు ఈ భావనను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. సంవత్సరాలపాటు ప్రభుత్వ సేవలో తమ శక్తిని అర్పించిన ఉద్యోగులు, రిటైర్మెంట్ తర్వాత తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం కోర్టుల మెట్లు ఎక్కాల్సివస్తోంది. ఇంకా దారుణం ఏమిటంటే, ఈ బకాయిలకోసం ఎదురుచూస్తూనే కొందరు ప్రాణాలు కోల్పోతున్నారనే విషాదవార్తలువినిపిస్తున్నాయి. ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన రిటైర్డ్ ఉద్యోగుల పిటిషన్లపై కోర్టు చేసిన వ్యాఖ్యలు పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఏప్రిల్ 9వ తేదీలోగా పెండింగ్ బకాయిలను చెల్లించాలని హైకోర్టు ఆదేశించడం, అలాగే ఫైనాన్స్ సెక్రటరీ హాజరు కానందుకు కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రజల చూపు పెట్రోల్ వైపు

దేశ ప్రజలు చూపు మొత్తం పెట్రోల్, డీజిల్ బంకుల వైపే. సామాజిక మాధ్యమాలు సృష్టించే అపోహలు, కొరత పేరుతో మోటార్ బండ్లతో, క్యాన్లతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన ప్రజలు, సామాజికమాధ్యమాలు సృష్టించే తప్పుడు, అవాస్తవ ప్రచారం వలన నలిగిపోతున్న దేశ ప్రజలు, ఇలాంటి తప్పుడు వార్తలను ఎప్పటికప్పుడు అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన విలువైన అవసరాలు ఉన్న ఈ తరహా వార్తలతో ప్రజలు పెట్రోల్ వైపే మొగ్గు చూపుతుండడం గమన్హారం. ప్రజలారా ఆలోచించండి ముందుకు కదలండి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రైల్వే టర్మినల్ వినియోగంలోకి తేవాలి

**ఉత్తర**, దక్షిణ ప్రాంతాలలోని పట్టణాలను కలుపుతూ ఫామ్ చేయబోయే రైల్వే కారిడార్‌లు దేశాభివృద్ధికి ఒక గ్రోత్ కనెక్టర్స్‌లాగ మారబోతున్నాయి. ఈసారి బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్నది కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు. అందులో ముఖ్యంగా హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ పూణే ప్రాజెక్ట్స్ తెలంగాణకు పచ్చలా హారంలాగా ఉంటాయి అనడంలో సందేహం లేదు. ఇక శంషాబాద్ కేంద్రంగాఫామ్ అయ్యే రైల్వేటర్మినాల్ ఒక మహోజ్వల గట్టం పూర్తి స్థాయిలో కనుక వినియోగంలోకి ఈ ప్రాజెక్ట్ వస్తే సేవల రంగం పెద్ద మొత్తంలో అభివృద్ధి చెందుతుంది.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆకలి తీర్చడమూ 'అక్షరం' బాధ్యతే

**పుస్తకాలు పంపిణీ చేయడాన్ని తప్పు పట్టడం అంటే జ్ఞాన ప్రసారాన్ని నిరోధించడమే. నిరుపేద విద్యార్థులను బడివైపు ఆకర్షించడానికి, వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి మధ్యాహ్న భోజనం ఒక ప్రధాన ఆయుధం. ఈపథకం లేకపోతే బళ్లలో హాజరు శాతం పడిపోయి, పేదలు విద్యకు మరింత దూరమవుతారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలి తప్ప, ఆకలి తీర్చే అన్నం గిన్నెను అపహాస్యం చేయడం న్యాయం అనిపించుకోదు. ఆధ్యాత్మిక వేత్తలు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలి తప్ప, సామాజిక బాధ్యతను మరిచి అమానవీయ వ్యాఖ్యలు చేయడం శోచనీయం. పేద విద్యార్థుల ప్రాథమిక హక్కులను కించపరిచేలా చేసిన ఈవ్యాఖ్యలు, సమాజంలో ఆయన పట్ల ఉన్న గౌరవానికి తీరని నష్టాన్ని చేకూర్చాయి. అక్షరం అనేది హక్కు, అది ఎవరి దానం కాదు.**

మర్రాపు వసుంధరా దేవి

భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశంలో సమాజంపై ఆధ్యాత్మిక ప్రవచనకారుల ప్రభావం అపారం. వారు చెప్పే ప్రతి మాట వేలాది మంది ఆలోచనా ధోరణిని ప్రభావితం చేస్తుంది. అటువంటి గౌరవప్రదమైన స్థానంలో ఉండి, దేశ అత్యున్నత 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్న గరికపాటి నరసింహారావు గారు ఇటీవల ప్రభుత్వ పాఠశాల్లోని మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వ్యాఖ్యలునాగరిక సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. 'అన్నం కోసం, పుస్తకాల కోసం స్కూలుకు రావడమేంటి? చదివితే చదవమనండి, మానేస్తే మానేయమనండి' అన్న ఆయన మాటలు కేవలం అనుచితం మాత్రమే కాదు, అవి అత్యంత అమానవీయమైనవి, రాజ్యాంగ విరుద్ధమైనవి. నిజానికి చదువు అనేది ఎవరో పెట్టే భిక్షకాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ప్రకారం 6 నుండి 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత. ఇది ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు. 'మానేస్తే మానేయమనండి' అని అనడం ద్వారా మనం ఒక తరాన్ని అంధకారంలోకి నెట్టే ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నామని ఆయన గ్రహించలేకపోయారు. విద్య అనేది కేవలం అక్షరాలు నేర్చుకోవడం మాత్రమే కాదు, అది ఒక వ్యక్తి గౌరవప్రదంగా జీవించడానికి అవసరమైన జ్ఞానాన్ని పొందే మార్గం. మధ్యాహ్న భోజన పథకాన్ని కేవలం 'ఉచితం' అనే సంకుచిత పదంతో ముడిపెట్టడం అజ్ఞానమే అవుతుంది. 2001లో 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిస్తూ, దేశంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వండిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆదేశించింది. ఆకలితో ఉన్న కడుపు పాఠాన్ని వినలేదు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ 5 సర్వే ప్రకారం భారతదేశంలో 35 కంటే ఎక్కువ మంది పిల్లలు 'స్టంటింగ్' (వయస్సుకి తగ్గ ఎత్తు లేకపోవడం)తో బాధపడుతున్నారు. ఇలాంటి స్థితిలో పాఠశాలల్లో ఇచ్చే గుడ్డు, పౌష్టికాహారం ఒక విలాసం కాదు, అది వారి కనీస అవసరం. ఇది పిల్లల 'రైట్ టులైఫ్' (ఆర్టికల్ 21)లో భాగమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన బాలల హక్కుల ఒడంబడిక (యుఎన్‌సిఆర్‌సి) ప్రకారం కూడా ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, ఆహారం, రక్షణ పొందే హక్కు ఉంది. పిల్లలకు పుస్తకాలు ఇవ్వడం అనేది



ప్రభుత్వాలు చేస్తున్న 'దానం' కాదు, అది ప్రజాస్వామ్య దేశంలో రాజ్యపు విధి. వనరులు లేని పేద విద్యార్థులకు ఈ కనీస సౌకర్యాలు కల్పించకపోతే, విద్య కేవలం ధనికులకే పరిమితమై సామాజిక వివక్షకు దారితీస్తుంది. మధ్యాహ్న భోజనం వంటి పథకాలు కేవలం మన దేశానికే పరిమితం కాదు. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా విద్యార్థులకు పౌష్టికాహారం అందించే సంప్రదాయం ఉంది. అమెరికాలోని 'నేషనల్ స్కూల్ లంచ్ ప్రోగ్రామ్ (ఎన్ఎస్ఎల్‌పి)' ద్వారా ప్రతిరోజూ సుమారు 3 కోట్ల మంది విద్యార్థులకు ఉచిత లేదా రాయితీ ధరకే భోజనం అందుతోంది. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా వ్యవస్థ కలిగిన ఫిన్లాండ్లో 1948 నుండి అందరికీ ఉచితపాఠశాల భోజనాన్ని ఒక 'సోషల్‌ఇన్వెస్ట్మెంట్'గా భావిస్తున్నారు. మన కంటే ఆర్థికంగా ఎంతో బలంగా ఉన్న దేశాలే విద్యార్థుల ఆకలిని తీర్చడం ప్రభుత్వ విధిగా భావిస్తుంటే, మన దేశంలో అటువంటి పథకాలను హేళన చేయడం విచారకరం. గరికపాటి వారు గతంలో కూడా అనేక సందర్భాల్లో మహిళల పట్ల, వివిధ సామాజిక వర్గాల పట్ల వివాదాస్పద, వాస్తవ దూరమైన వ్యాఖ్యలు చేశారు. ఆధ్యాత్మికత పేరుతో పాతకాలపు ఛాందస భావాలను రుద్దడం, ఆధునిక సామాజిక మార్పులను కించపరచడం న్యాయం కాదు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు ఎవరికైనా ఉంటుంది, కానీ అది వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేలా ఉండాలి తప్ప, నిరుపేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదు. ప్రవచనకర్తగా గరికపాటి గారికి ఉపాధ్యాయులపై ఉన్న పని భారం పట్ల సానుభూతి ఉంటే, దానిని నేరుగా ప్రభుత్వానికే విన్నవించాలి. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని, వారి సమయం వృధా కాకుండా చూడాలని పాలకులను డిమాండ్ చేయవచ్చు. అంతేగానీ, ఉపాధ్యాయుల భుజంపై తుపాకీ పెట్టి అట్టడుగు వర్గాలకు చెందిన పేద విద్యార్థుల వైపు గురిపెట్టడం ఏమాత్రం సమర్థనీయం కాదు. పుస్తకాలు పంపిణీ చేయడాన్ని తప్పు పట్టడం అంటే జ్ఞాన ప్రసారాన్ని నిరోధించడమే. నిరుపేద విద్యార్థులను బడివైపు ఆకర్షించడానికి, వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి మధ్యాహ్న భోజనం ఒక ప్రధాన ఆయుధం. ఈపథకం లేకపోతే బళ్లలో హాజరు శాతం పడిపోయి, పేదలు విద్యకు మరింత దూరమవుతారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలి తప్ప, ఆకలి తీర్చే అన్నం గిన్నెను అపహాస్యం చేయడం న్యాయం అనిపించుకోదు. ఆధ్యాత్మిక వేత్తలు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలి తప్ప, సామాజిక బాధ్యతను మరిచి అమానవీయ వ్యాఖ్యలు చేయడం శోచనీయం. పేద విద్యార్థుల ప్రాథమిక హక్కులను కించపరిచేలా చేసిన ఈవ్యాఖ్యలు, సమాజంలో ఆయన పట్ల ఉన్న గౌరవానికి తీరని నష్టాన్ని చేకూర్చాయి. అక్షరం అనేది హక్కు, అది ఎవరి దానం కాదు. ●

# యుద్ధం ..గ్లోబల్ ఎకానమీకి మరణశాసనం

డా. చిట్యాల రవీందర్

మానవ చరిత్రలోయుద్ధం అనేది ఎప్పుడూ ఒక విషాదమే, కానీ 21వ శతాబ్దపు యుద్ధాలు కేవలం ప్రాణ నష్టానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మూలాల నుంచి కదిలించివేస్తున్నాయి. ముఖ్యంగా గత ఐదు సంవత్సరాలలో మనం చూస్తున్న పరిణామాలు గమనిస్తే, యుద్ధం అనేది దేశాల మధ్య సరిహద్దు వివాదం మాత్రమేకాదు, అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి సామాన్యుడి జేబుపై పడుతున్న భారమని స్పష్టమవుతోంది. ఇటీవల అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన దాడులు, అంతకుముందు రష్యా, ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు అన్నీ కలిసి ప్రపంచాన్ని ఒక అనిశ్చిత ఆర్థికస్థితిలోకి నెట్టేశాయి. అమెరికా ఇజ్రాయిల్ కూటమి వర్సెస్ ఇరాన్ యుద్ధం చమురు మార్కెట్‌లో పెనుప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇటీవల అమెరికా, ఇజ్రాయిల్ బలగాలు ఇరాన్ సైనిక స్థావరాలు, వ్యూహాత్మక ప్రాంతాలపై జరిపిన దాడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరికగా మారాయి. ఇరాన్ ప్రపంచంలోని అతిపెద్ద చమురు ఉత్పత్తిదారులలో ఒకటి మాత్రమే కాదు, ఇది 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' వంటి కీలకమైన సముద్ర మార్గాన్ని నియంత్రిస్తుంది. ఈ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రతిసారీ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతున్నాయి. అమెరికా జోక్యం ఈ యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేయడమే కాకుండా, పశ్చిమ దేశాలకు, మధ్యప్రాచ్య దేశాలకు మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలను దెబ్బతీసింది. ఇరాన్ తనపై జరిగిన దాడులకు ప్రతిస్పందనగా ప్రపంచ చమురు సరఫరాను అడ్డుకుంటే, పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, ప్రతి వస్తువు ధర సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతుంది. ఇది కేవలం ఒక యుద్ధం కాదు, గ్లోబల్ ఎనర్జీ సెక్యూరిటీపై జరిగిన దాడి. యుద్ధాల వల్ల గత ఐదేళ్ల విధ్వంసం, సప్లై చైన్, ఆహార భద్రతపై గొడ్డలి పెట్టులాంటిది. గత ఐదు సంవత్సరాలుగా ప్రపంచం కోలుకోలేని దెబ్బలు తింటూనే ఉంది. రష్యా



ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుండి ప్రపంచానికి ధాన్యపు గిన్నెలుగా ఉన్న ప్రాంతాలు రణక్షేత్రాలుగా మారాయి. ఉక్రెయిన్ నుండి ఎగుమతి అయ్యే గోధుమలు, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్ ఆయిల్ సరఫరా నిలిచిపోవడంతోఆఫ్రికా, ఆసియాలోని అనేక పేద దేశాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయి. ఒకవైపు రష్యాపై విదేశీ ఆంక్షలు, మరోవైపు ఉక్రెయిన్ పోర్టుల మూసివేత వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు మూసుకుపోయాయి. యుద్ధంవల్ల కలిగే ఆర్థిక నష్టం అంటే కేవలం బాంబుల ఖర్చు మాత్రమే కాదు, ఆగిపోయిన ఎగుమతులు, దిగుమతుల వల్ల కలిగే నష్టం కొన్ని లక్షల కోట్ల డాలర్లలో ఉంటుంది. ఆధునిక యుద్ధాలు కేవలం నేలపైనే కాదు, సైబర్ స్పేస్‌లో కూడా జరుగుతున్నాయి. అమెరికా ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య జరుగుతున్న ఘర్షణల్లో సైబర్ దాడులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు ప్రమాదంలో పడ్డాయి. ఒకచిన్న సైబర్ దాడి వల్ల కొన్ని నిమిషాల్లోనే వందల కోట్ల డాలర్ల లావాదేవీలు ఆగిపోవచ్చు. దీనివల్ల టెక్ కంపెనీల షేర్లు పడిపోవడం, మార్కెట్‌లో అనిశ్చితి నెలకొనడం వంటివి పెట్టుబడిదారులను భయపెడుతున్నాయి. ప్రపంచ దేశాలు తమ జీడీపీలో అధిక భాగాన్ని ఇప్పుడు రక్షణ రంగానికి కేటాయిస్తున్నాయి. అమెరికా తన అత్యాధునిక ఆయుధాలను ఇజ్రాయిల్‌కు సరఫరా చేయడం కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చుచేస్తోంది. అదే నిధులను పేదరిక నిర్మూలనకు లేదా పర్యావరణ పరిరక్షణకు వాడితే ప్రపంచంఎంతో బాగుండేది. యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్న యువత ఆయా దేశాల మానవ వనరుల ఉత్పాదకతను దెబ్బతీస్తోంది. ఒక ఇంజనీర్ లేదా ఒక డాక్టర్ యుద్ధంలో మరణిస్తే, అది ఆ సమాజానికి తీరని ఆర్థిక, మేధోపరమైన లోటు. శాంతి లేనిదే సంపద లేదు అనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ యుద్ధాల వల్ల కలిగే ఆర్థిక నష్టం అపరిమితం. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ వంటి దేశాల మధ్య ఘర్షణలు ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం వైపు నడిపిస్తున్నాయా అన్న భయం కలుగుతోంది. అభివృద్ధి చెందిన దేశాల ఆధిపత్య పోరులో అభివృద్ధి చెందుతున్న దేశాలు బలిపశువులవుతున్నాయి. యుద్ధం ముగిసినా, ఆదేశాలను పునర్నిర్మించడానికి అయ్యే ఖర్చు, దశాబ్దాల పాటు ప్రజలు అనుభవించే పేదరికం యుద్ధం కంటే భయంకరంగా ఉంటాయి. సంపద అనేది శాంతి ఉన్నప్పుడే వృద్ధి చెందుతుంది. ప్రపంచ దేశాలు ఇకనైనా విద్వేషాలను వీడి ఆర్థిక సహకారం వైపు మొగ్గు చూపకపోతే, భావితరాలకు మనం ఒక చితిమంటల ప్రపంచాన్నిమిగిల్చిన వారమవుతాము. ●

# గిరిజనులు లేని గ్రామాలు మైదాన ప్రాంతాలు!

మానిక్.డోంగ్రే

భారతదేశం వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయాలు, వర్గాలతో కూడిన గొప్ప దేశం. ఈ దేశంలో నివసించే గిరిజనులు తమ ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, సంప్రదాయ జ్ఞానంతో ప్రత్యేక గుర్తింపును కలిగి ఉన్నారు. చరిత్రలో చాలాకాలం పాటు గిరిజన సమాజం ప్రధాన అభివృద్ధి ధార నుండి దూరంగా ఉండిపోయింది. విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల వంటి ప్రాథమిక అవకాశాలు వారికి సరైన స్థాయిలో అందలేదు. ఈపరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో ముఖ్యంగా గిరిజనుల అధిక జనాభా ఉన్న ప్రాంతాలను ఏజెన్సీ ప్రాంతాలుగా ప్రకటించడం ఒకముఖ్యమైన చర్య. ఈ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను రక్షించేందుకు వారి అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రత్యేక చట్టాలు, నియమాలు అమలు చేయబడుతున్నాయి. ముఖ్యంగా1/70 భూ చట్టం ద్వారా గిరిజనుల భూమిని గిరిజనేతరులకు అమ్మడం లేదా బదిలీ చేయడం నిషేధం. అలాగే పేసా-1996 చట్టం ప్రకారం గ్రామ సభకు ప్రత్యేక అధికారాలు, భూమి వినియోగం, అడవి వనరులపై ప్రత్యేక అధికారాలు ఉంటాయి. ఈ చట్టాల ప్రధాన లక్ష్యం గిరిజనుల భూమి, సంస్కృతి, జీవన విధానాన్ని కాపాడటం. ఏజెన్సీప్రాంతాల ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం గిరిజన సమాజాన్ని రక్షించడం. వారికి సమాన అవకాశాలు కల్పించడం. ఈ ప్రాంతాల్లో గిరిజనుల భూమి హక్కులను కాపాడటానికి ప్రత్యేక చట్టాలు అమలు చేయబడుతున్నాయి. అడవులపై హక్కులు, భూముల పరిరక్షణ, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుంది. గిరిజనుల భూములు ఇతరులు ఆక్రమించకుండా ఉండేందుకు భూమి కొనుగోలు విక్రయాలపై కఠినమైన నియమాలు అమలు చేస్తారు. ఈ చర్యల ద్వారా గిరిజనుల ఆర్థిక, సామాజిక భద్రతను కాపాడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో షెడ్యూల్డ్ తెగలు లేకపోయినా కూడా ఆ గ్రామాలు ఇప్పటికీ ఏజెన్సీ గ్రామాలుగా కొనసాగుతున్నాయి. ఇది సరైన అధ్యయనం లేకుండా గతపాలకులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల ఫలితంగా గిరిజనులు లేని, అతి తక్కువ మంది గిరిజనులు ఉన్న కొన్ని గ్రామాలు కూడా ఏజెన్సీ ప్రాంతాల జాబితాలో చేర్చబడ్డాయి. అయితే చట్టపరమైన మార్పులు జరగకపోవడం వల్ల ఇప్పటికీ ఆ గ్రామాలు ఏజెన్సీ గ్రామాలుగానే కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితి వల్ల అక్కడ నివసిస్తున్న గిరిజనేతర ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భూమి హక్కులు, ప్రభుత్వ పథకాల లబ్ధి, పరిపాలనలో భాగస్వామ్యం వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాల ప్రకారం గిరిజనేతరులు భూమి కొనుగోలు చేయడం లేదా విక్రయించడం చాలా కష్టతరమైన విషయం. కొన్ని సందర్భాల్లో పూర్తిగా నిషేధం కూడా ఉంటుంది. దీనివల్ల గిరిజనేతర రైతులు తమ భూములను అమ్ముకోవడం లేదా కొత్త భూములు కొనుగోలు చేయడం కష్టమవుతోంది. అవసరాల సమయం



లో భూమిని విక్రయించాల్సిన పరిస్థితి వచ్చినప్పటికీ చట్టపరమైన పరిమితుల కారణంగా అది సాధ్యం కాక ఇబ్బందులు పడుతున్నారు. భూమిపై స్పష్టమైన యాజమాన్యాలు హక్కులు లేకపోవడంతో బ్యాంకులు సైతం రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. ఈ పరిస్థితి వారి ఆర్థిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇక అభివృద్ధి కార్యక్రమాల విషయానికి వస్తే కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని ప్రత్యేక విధానాలు అమలులో ఉంటాయి. ఈ కారణంగా సాధారణ గ్రామాల కంటే అభివృద్ధి కార్యక్రమాలు అమలు కావడంలో కొంత ఆలస్యం జరుగుతుంది. రహదారులు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో కొన్ని పరిమితులు ఉంటాయి. గిరిజనులు లేని గ్రామాల్లో ఈ పరిమితులు అవసరం లేకపోయినా కూడా చట్టపరంగా అవి అమలులో ఉండటం వల్ల అభివృద్ధి వేగం తగ్గిపోతుంది. దీనివల్ల గ్రామాల సామాజిక ఆర్థిక పురోగతి నెమ్మదిస్తుంది. అప్పటి పరిస్థితుల్లో సరైన సమాచారం లేకపోవడం లేదా పూర్తిస్థాయి సర్వేలు జరగకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడింది. కాలక్రమేణా గ్రామాల జనాభా నిర్మాణం మారిపోయింది. ఈ పరిస్థితి గిరిజనేతర ప్రజల్లో అన్యాయం జరుగుతున్నదనే భావనను కలిగిస్తోంది. అందువల్ల గిరిజనులు లేని గ్రామాలను పునఃపరిశీలించడం చాలా అవసరం. ప్రభుత్వం ఒక సమగ్ర సర్వే నిర్వహించి గ్రామాల వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయాలి. గ్రామాల్లో గిరిజన లేదా ఆదివాసీ జనాభా లేకపోతే లేదా చాలా తక్కువగా ఉంటే అలాంటి గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాల జాబితా నుండి తొలగించి మైదాన ప్రాంతాలుగా ప్రకటించడం అవసరం. అలా చేస్తే అక్కడి ప్రజలకు సమాన అవకాశాలు లభిస్తాయి. భూమి కొనుగోలు, విక్రయాల విషయంలో ఉన్న పరిమితులు తొలగిపోతాయి. అభివృద్ధి కార్యక్రమాలు కూడా వేగంగా అమలు కావడానికి అవకాశం ఉంటుంది. అలాగే గ్రామాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా సులభతరం అవుతుంది. దీనివల్ల గ్రామాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయి. అయితే ఈ ప్రక్రియలో గిరిజనుల హక్కులు ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదు. షెడ్యూల్డ్ తెగలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం ఏజెన్సీ చట్టాలు కొనసాగించాలి. ఎందుకంటే ఆ చట్టాలు గిరిజనుల భూమిహక్కులను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. గిరిజన సమాజం అభివృద్ధి కోసం ప్రత్యేక రక్షణలు చాలా అవసరం. కాబట్టి గిరిజనులు అధికంగా ఉన్నప్రాంతాల్లో ఆ రక్షణలు కొనసాగించాలి. కానీ గిరిజనులు లేని గ్రామాల్లో అదే విధమైన నియమాలు కొనసాగించడం అవసరం లేదని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఈ పరిస్థితి సమాజంలో అసమానతను పెంచే ప్రమాదం కూడా ఉంది. అందువల్ల ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైతే నిపుణుల కమిటీని ఏర్పాటుచేసి గ్రామాల స్థితిగతులను పరిశీలించాలి. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకుంటే గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంలభిస్తుంది. సమానత్వం, న్యాయం అనే రాజ్యాంగ సూత్రాలు ప్రతి పౌరుడికి సమానంగా వర్తించాలి. ఒకవర్గం అభివృద్ధి కోసం తీసుకునే చర్యలు, మరొక వర్గంహక్కులను దెబ్బతీయకుండా ఉండటం అవసరం. అందువల్ల గిరిజనులులేని, అతి తక్కువ గిరిజనులున్న గ్రామాల పరిస్థితిని ప్రభుత్వం సమగ్రంగాపరిశీలించి, అవసరమైన మార్పులు చేయాలి. సమాజంలో ప్రతివర్గం అభివృద్ధి చెందేలా, ఎవరికీ అన్యాయం జరగకుండా సమతుల్య విధానాలు అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. నిజమైన అభివృద్ధి అనేది ఒక వర్గానికి మాత్రమే కాకుండా, సమాజంలోని ప్రతి పౌరుడి హక్కులు రక్షించబడినప్పుడే నిజమైన అభివృద్ధిగా నిలుస్తుందని బుద్ధిజీవులు అభిప్రాయపడుతున్నారు. ●

# దేశంలో చమురు కొరతలేదు

## 60 రోజులకు సరిపడా నిల్వలు

### అసత్య ప్రచారంవల్లే ప్రజల్లో ఆందోళన

**న్యూఢిల్లీ, మార్చి 26:** దేశంలో చమురు కొరత లేదని కేంద్రం ప్రకటించింది. 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని, ప్రజల్లో ఆందోళన అవసరం లేదని కేంద్రం తెలిపింది. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ఎలాంటి కొరతా లేదని కేంద్ర పెట్రోలియం, చమురు మంత్రిత్వశాఖ గురువారం వెల్లడించింది. చమురు సరఫరా లేదంటూ జరుగుతున్నది ఉద్దేశపూర్వక ప్రచారమే అని, ఈ ప్రచారం వల్లే వినియోగదారులు ఆందోళనతో ఎక్కువ కొనుగోళ్లకు పాల్పడుతున్నారని తేల్చింది. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినంత చమురు ఉందని, సాధారణంగానే సరఫరా కొనసాగుతోందని కేంద్రం తెలిపింది. ఎక్కడా, ఎలాంటి ఇబ్బంది లేదని, ధరలు కూడా ఎప్పట్లాగే ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వినియోగదారులు పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం క్యూ కడుతున్న సంగతి తెలిసిందే. పెట్రోల్ సరఫరా లేదని జరుగుతున్న ప్రచారంతో జనాలు బంకుల వ్దద బారులు తీరుతున్నారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎలాంటి చమురు కొరత లేదని కేంద్రం తెలిపింది. పెట్రో ఉత్పత్తుల్లో ఇండియా ఐదో స్థానంలో ఉంది. అలాగే, ఆయిల్ రిఫైనరీలో ఇండియా నాలుగో స్థానంలో ఉంది. దేశంలో చమురు తగినంత ఉందని, అలాగే పెట్రో ఉత్పత్తుల్ని 150 దేశాలకు ఎగుమతి చేస్తున్నామని కూడా కేంద్రం తెలిపింది. దేశంలోని ప్రతి రిఫైనరీ 100శాతం పని చేస్తోందని, ఇండియాలోని కంపెనీలు 60రోజులకు సరిపడా క్రూడాయిల్ నిల్వలతో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. సరఫరాలో ఎలాంటి లోటూ లేదని, వ్యూహాత్మకనిల్వలతో కలిపి 74రోజులకు సరిపడా చమురు నిల్వలున్నట్లు ప్రకటించింది. 60 రోజులకు సరిపడా నిల్వలుండగా, యుద్ధం ప్రారంభమై 27 రోజులు మాత్రమే అవుతుందని తెలిపింది. ప్రపంచంలో ఎలాంటి పరిణామం ఎదురైనా ప్రతి పౌరుడికి రెండునెలలకు సరిపడా చమురు దేశంలో అందుబాటులో ఉంటుందని చెప్పింది. దేశీయంగా ఎల్పీజీనిల్వలు కూడా తగినంత ఉన్నాయని, ఇక్కడికంపెనీల్లో ఉత్పత్తి కూడా పెంచామని పేర్కొంది.ఇప్పటికే అనేక దేశాల నుంచి కార్గోలద్వారా చమురుదేశానికి రానున్నట్లు తెలిపింది.

**'ఎల్పీజీ ఛార్జీలు వసూలుచేస్తే కఠిన చర్యలు'**

హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగదారుల నుంచి ఎల్పీజీ ఛార్జెస్ లేదా గ్యాస్ ఛార్జెస్ పేరిట అదనంగా వసూలు చేసే చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రస్తుతం దేశంలో ఎల్పీజీ కొరత వేధిస్తున్న సంగతి తెలిసిందే. బహిరంగ మార్కెట్లో ఎల్పీజీ సిలిండర్ దొరకడం లేదు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లకు తీవ్ర కొరత ఏర్పడింది. అందులోనూ హోటళ్లు, రెస్టారెంట్లు వ్యాపారానికి ఇబ్బందిగా మారింది. దీంతో చాలా మంది ఎక్కువ ధర పెట్టి బ్లాక్లో సిలిండర్లు కొంటున్నారు. ఈ ధరను ఇప్పుడు హోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారులపై మోపుతున్నాయి. ఫుడ్ బిల్లులో ఐటమ్స్ ధరలు,



జీఎస్టీతోపాటు ఎల్పీజీ ఛార్జెస్ కూడా వసూలు చేస్తున్నాయి. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో ఎల్పీజీ ఛార్జెస్, గ్యాస్ ఛార్జెస్, ఫ్యుయెల్ కాస్ట్ రికవరీ అంటూ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. దీంతో ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇకపై ఇలా ఎల్పీజీ




ఛార్జీలు, ఫ్యుయెల్ ఛార్జీలు వసూలు చేయకూడదని రెస్టారెంట్లు, హోటళ్లకు సీసీపీఏ (సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ) హెచ్చరించింది. వీటికి చట్టబద్ధమైన అనుమతి లేదని, అలా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. మెనూలో ఆహార పదార్థాలకు ఏ ధర ఉంటుందో అది మాత్రమే చెల్లించాలి. ట్యాక్సులు మాత్రం అదనం. ఒకవేళ వేరే ఛార్జీలు వసూలు చేస్తే వాటికి జరిమానా విధించే వీలుంది.

## పశ్చిమాసియా సంక్షోభంపై

# నేడు సిఎంలతో ప్రధాని మోడీ భేటీ

### గ్యాస్, చమురు సరఫరాపై చర్చించే అవకాశం



**న్యూఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో ప్రపంచ దేశాలు గ్యాస్, చమురు సరఫరా నిలిచిపోయింది. భారత్తో సహా పలు దేశాల్లో తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. భారత్లో సైతం గ్యాస్, పెట్రోల్, డీజెల్ కొరత కనిపిస్తోంది. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం కానున్నారు. పశ్చిమాసియా పరిస్థితుల తోపాటు దేశంలో నెలకొన్న తాజా పరిస్థితుల పైనా సిఎంలతో నేరుగా ప్రధాని మోడీ మాట్లాడనున్నారు. రాష్ట్రాల స్థాయి సన్నద్ధత, ప్రతిస్పందన వ్యూహాలను సమీక్షించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రులతో సమావేశంకానున్నారు. 'టీమ్ ఇండియా' విధానం కింద సమన్వయం, ఉభయతారక అంశాలపై ఈ చర్చలో ప్రధానంగా దృష్టి సారించే అవకాశ ముంది.

అయితే ఈ సమావేశంలో ప్రధాని మోడీ ఏం మాట్లాడనున్నారనేది ఉత్కంఠగా మారింది. కాగా. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులతో దేశంలో ఇంధన కొరత నెలకొందని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని, దేశ ప్రజలు ఏ సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

# పెట్రోల్ ధరలు పెంచిన 'నయారా'

## లీటర్పై రూ.5, డీజిల్పై రూ.3 పెంపు

### ప్రైవేటు చమురు సంస్థపై సోషల్ మీడియాలో విమర్శలు




**న్యూఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాల్లో చమురు మంట రగులుతోంది. దేశీయంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా కొరత నెలకొంది. దీంతో ప్రపంచ దేశాలతోపాటు దేశీయంగా కొన్ని రకాల పెట్రోల్ ధరలను ఇటీవల ప్రభుత్వరంగ చమురు సంస్థలు ధరలు పెంచాయి. తాజాగా, ప్రైవేటు చమురు సంస్థ 'నయారా ఎనర్జీ' పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటర్ పెట్రోల్పై రూ.5లు, డీజిల్పై రూ.3 పెంచింది. తక్షణమే కొత్త ధరలు అమల్లోకి వచ్చాయని నయారా ఎనర్జీ వర్గాలు వెల్లడించాయి. నయారా సంవత్సరానికి 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో భారతదేశపు రెండవ అతిపెద్ద సింగిల్- సైట్ రిఫైనరీ అయిన వడినార్ ఆయిల్ రిఫైనరీని నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 6,500కు పైగా పెట్రోల్ పంపులు ఉన్నాయి. గత యేడాది 4,50,000 టన్నుల పాలీప్రొపీలిన్ప్లాంట్తో పెట్రోకెమికల్స్ రంగంలోకి ప్రవేశించింది. అంతర్జాతీయ మార్కెట్లో యుద్ధానికి ముందుబ్యారెల్కు 90 డాలర్లకు లభించిన ముడిచమురు, ఇప్పుడు 160 డాలర్లకు చేరింది. ఈ పరిణామాల క్రమంలో భారత్లోనూ పెట్రోల్, డీజెల్ ధరలు పెరిగాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఆహార నాణ్యతపై ప్రయాణికుడి ఫిర్యాదు

# ఐఆర్సిటిసికి రూ.10 లక్షల జరిమానా



**పాట్నా, మార్చి 26:** ఒక ప్రయాణికుడి ఫిర్యాదు నేపథ్యంలో, రైల్వే మంత్రిత్వ శాఖ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్సీటీసీ)పై రూ. 10 లక్షల జరిమానా విధించింది. ఈనెల 15న పాట్నా టాటానగర్ వందేభారత్ ఎక్స్ప్రెస్ రైలులో అందించిన ఆహార నాణ్యతపై ఒక ప్రయాణికుడు చేసిన ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన ఇండియన్ రైల్వేస్ ఐఆర్సీటీసీపై భారీ జరిమానా విధించింది. రితేశ్ కుమార్ ఈనెల 15న పాట్నా టాటానగర్ వందేభారత్ ఎక్స్ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఆ సమయంలో తమకు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు రావడంతో ఆయన మేనేజర్ను పిలిచి ఫిర్యాదు చేశారు. రైలు సిబ్బంది ఆ భోజనాన్ని పరిశీలించారు. రితేశ్ ఈ ఉదంతాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీనిపై రైల్వే మంత్రిత్వ శాఖ స్పందించింది. ఐఆర్సీటీసికి రూ.10 లక్షల జరిమానా విధించడంతో పాటు, సంబంధిత కేటరింగ్ సర్వీస్ ప్రొవైడర్పై రూ.50 లక్షల జరిమానా విధించింది. అలాగే కాంట్రాక్టును రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, నాణ్యతే తమ ప్రధాన ప్రాధాన్యతలని ఇండియన్ రైల్వేస్ స్పష్టం చేసింది. కాగా, ఇండియన్ రైల్వేస్ తన రైళ్లలో ప్రతి సంవత్సరం దాదాపు 58 కోట్ల భోజనాలను అందిస్తోందని, అధిక ఛార్జీలకు సంబంధించిన ఫిర్యాదులతో సహా, ఫిర్యాదులు సగటున 0.0008 శాతం మాత్రమే ఉన్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.

# రాజ్బరి జిల్లా పద్మానదిలో పడిన బస్సు

## 16 మంది మృతి, 20 మంది ఆచూకీ గల్లంతు



**ఢాకా, మార్చి 26:** బంగ్లాదేశ్లోని రాజ్బరి జిల్లాలో బస్సు ప్రమాదం జరిగింది. పద్మా నదిలో బస్సు పడిన ఘటనలో 16 మంది మృతిచెందారు. సుమారు 20 మంది వరకు ఆచూకీ లేరని తెలుస్తోంది. ట్రాన్స్పోర్ట్ ఫెరీ ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అదుపు తప్పి బస్సు ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం 5.15 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. క్రేన్లసహాయంతో బస్సును నది నుంచి బయటకు తీశారు. ఆ బస్సులో సుమారు 14 మృతదేహాలు ఉన్నట్లు గుర్తించారు. గజ ఈతగాళ్లు ఓ ఇద్దరు మహిళలను రక్షించారు. ప్రతికూల వాతావరణంలో దాదాపు ఆరు గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. మిలిటరీ, పోలీసు సహకారంతో అగ్నిమాపక, కోస్టుగార్డు డైవర్లు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఢాకాకు వెళ్తున్న ఆ బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నట్లు భావిస్తున్నారు. దీంట్లో చాలా మంది పిల్లలు ఉన్నారు. ఈద్ సెలవులు ముగిసిన తర్వాత పిల్లలు మళ్లీరాజధానికి వెళ్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటన పట్ల విచారణ చేపట్టాలని ప్రధాని తారిక్ రెహ్మాన్ ఆదేశించారు. సుమారు 11 మంది ప్రయాణికులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారని పోలీసులు చెప్పారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ నేవీ కమాండర్ మృతి



**టెహ్రాన్, మార్చి 26:** ఇజ్రాయెల్తో యుద్ధంలో వరుసగా అగ్రనాయకత్వాన్ని కోల్పోతున్న ఇరాన్కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ ఎలైట్ నావెల్ ఫోర్స్ (నావికా దళం) చీఫ్ అలీరెజా తాంగ్సిరి మరణించాడు. తాము జరిపిన వైమానిక దాడుల్లో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్ నావికా దళానికి నాయకత్వం వహిస్తున్న టాప్ కమాండర్ అలీరెజాను పోర్ట్ సిటీ అయిన బందర్ అబ్బాస్ వద్ద హతమార్చినట్లు ప్రకటించింది. అలీరెజా ఇరాన్కు చెందిన ఐఆర్జీసీలోని నావికా దళ విభాగానికి నాయకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి మూసి ఉన్న సంగతి తెలిసిందే. అసలు ఇరాన్ జలసంధి మూసివేత నిర్ణయం తీసుకోవడానికి గల కారణం అలీరెజానే. అతడు మరణించాడని ఇజ్రాయెల్ ప్రకటించినప్పటికీ, ఇరాన్ మాత్రం దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. 2018 నుంచి అలీరెజా నావికాదళానికి నేతృత్వం వహిస్తున్నాడు. ఆయనను సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ నియమించాడు. ఇరాన్ నావికా దళ సామర్థం పెంచడంలో అతడు కీలక పాత్ర పోషించాడు.

## ఇరాన్ వాసులకు ఆస్ట్రేలియాలో నో ఎంట్రీ!

**కాన్బెర్రా, మార్చి 26:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రధాన నిర్ణయం తీసుకుంది. ఇరాన్ నుంచి తమ దేశానికి వచ్చే సందర్శకులపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు ఆస్ట్రేలియా ప్రకటించింది. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఆస్ట్రేలియా హోంమంత్రిత్వ వ్యవహారాల శాఖ ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఇరాన్ పాస్పోర్ట్ కలిగిన వారు ఆస్ట్రేలియాలోకి ప్రవేశించడానికి అనుమతి లేదని అక్కడి



ప్రభుత్వం తెలిపింది. అంతేకాకుండా ఇప్పటికే జారీచేసిన వీసాలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ తన సైనిక కార్యకలాపాలను పెంచుతూ ప్రాంతీయ అస్థిరతకు కారణమవుతోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆస్ట్రేలియా ప్రధాని పేర్కొన్నారు. అమెరికా, ఇతర మిత్రదేశాలతో కలిసి ఇరాన్పై అంతర్జాతీయ ఒత్తిడిని పెంచే వ్యూహంలో భాగంగానే ఆస్ట్రేలియా ఈ అడుగు వేసిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఆస్ట్రేలియా ప్రభుత్వం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయంతో అక్కడికి వెళ్లాలనుకుంటున్న ఇరాన్ విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్ట్రేలియా చర్యపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఇరాన్కు రష్యా డ్రోన్లు, మానవతాసాయం..

**టెహ్రాన్, మార్చి 26:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో భీకర యుద్ధం చేస్తున్న ఇరాన్కు రష్యా అండగా నిలుస్తోంది. కేవలం మాటలకే పరిమితం కాకుండా. రష్యా ఇప్పుడు ఇరాన్కు సైనిక, నిఘా సహాయాన్ని భారీగా పెంచినట్లు పాశ్చాత్య దేశాల ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డ్రోన్లు, నిత్యావసరాలు రష్యా తన వద్ద ఉన్న డ్రోన్లను (ముఖ్యంగా ఇరాన్ డిజైన్లతో రష్యాలో తయారైన గెరాన్2వంటివి) దశలవారీగా ఇరాన్కు పంపిస్తోంది. ఈ నెలాఖరుకు ఈ రవాణా ప్రక్రియ పూర్తికానుంది. యుద్ధం కారణంగా ఇరాన్లో ఏర్పడిన ఆహారం, ఔషధాల కొరతను తీర్చడానికి కూడా రష్యా తన వంతుసాయం చేస్తోంది. ఇరాన్లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సమీపంలో మంగళవారం క్షిపణి పడటంతో రష్యా అప్రమత్తమైంది. అక్కడ పనిచేస్తున్న 163 మంది రష్యా సిబ్బందిని (రోసాటమ్ ఉద్యోగులు) సురక్షితంగా ఇరాన్ఆర్మేనియా సరిహద్దుకు తరలించింది. ప్రస్తుతం అక్కడకేవలం పరికరాలను పర్యవేక్షించేందుకు కొంతమంది మాత్రమే మిగిలి ఉన్నారు. ఇరాన్ నాయకత్వంతో తమ సంప్రదింపులు నిరంతరం కొనసాగుతున్నాయని, రక్షణ రంగంలోసహకారముంటుందని స్పష్టం చేసింది.

# మెటా, యూట్యూబ్ సంస్థలకు అమెరికా కోర్టు భారీ జరిమానా



**లాస్ ఏంజిల్స్, మార్చి 26:** సోషల్ మీడియాకు యువత బానిసలు అవుతున్నట్లు నమోదు అయిన కేసులో మెటా, యూట్యూబ్ సంస్థలకు అమెరికా కోర్టు భారీ జరిమానా వేసింది. చిన్నతనం నుంచి సోషల్ మీడియాకు బానిసైనట్లు ఓ మహిళ దాఖలు చేసిన కేసులో లాస్ ఏంజిల్స్ జ్యూరీ అసాధారణ తీర్పును వెలువరించింది. ఆ అమ్మాయికి రెండు కంపెనీలు కలిసి సుమారు 6 మిలియన్ల డాలర్ల నష్టపరిహారాన్ని చెల్లించాలని జ్యూరీ తన ఆదేశాల్లో పేర్కొన్నది. సోషల్ మీడియా కంటెంట్ సిగరెట్ల తరహాలో యువతను బానిసలుగా మారుస్తున్నట్లు జ్యూరీ ఆరోపించింది. పిల్లలు, యువకులు సోషల్ మీడియా తప్ప మరో ప్రపంచాన్ని గ్రహించలేకపోతున్నట్లు జ్యూరీ చెప్పింది. సోషల్ మీడియా వల్ల వ్యక్తిగతంగా మనుషులు నష్టపోతున్నారని పేర్కొన్నది. ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ కంపెనీ యజమానులు.. పిల్లల సంరక్షణ మరిచి తమ సోషల్మీడియా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జ్యూరీ వెల్లడించింది. ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సాప్లు మాతృసంస్థ మెటా పరిధిలో ఉన్నాయి, యూట్యూబ్ మాత్రం గూగుల్ ఆధీనంలో ఉన్నది. ఈ సోషల్ మీడియా ప్లాట్ఫామ్లు అన్నీ యువతను ఆకర్షించే రీతిలో తమ ప్రోగ్రామింగ్ను తయారు చేసుకున్నట్లు జ్యూరీ పేర్కొన్నది. అడిక్షన్ కేసులో 20 ఏళ్ల అమ్మాయి మానసిక ఆరోగ్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీసినట్లు జ్యూరీ వెల్లడించింది. కాలే అనే అమ్మాయికి 6 మిలియన్ల డాలర్లు చెల్లించాలని జ్యూరీ సభ్యులు ఆదేశించారు. ఇలాంటి మీడియా అడిక్షన్ కేసులు ప్రస్తుతం అమెరికా కోర్టుల్లో కొన్ని వందల సంఖ్యల్లో ఉన్నాయి. తాజా తీర్పుతో ఆ కేసులకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని నిపుణులు అంటున్నారు. జ్యూరీ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు మెటా, గూగుల్ సంస్థలు పేర్కొన్నాయి. టీనేజ్ యువత మానసిక ఆరోగ్యం చాలా సంక్లిష్టంగా ఉంటుందని, ఒకే ఒక్క యాప్తో అవన్నీ లింకు పెట్టడం సరికాదు అని ఆ సంస్థలు వాదించాయి. గూగుల్ ప్రతినిధి మాట్లాడుతూ యూట్యూబ్ గురించి తప్పుగా అర్థం చేసుకున్నారని, యూట్యూబ్ అనేది స్ట్రీమింగ్ ఫ్లాట్ఫామ్ అని, అదేమీ సోషల్ మీడియా సైట్ కాదు అని పేర్కొన్నారు. కాలే అమ్మాయి కేసులో మెటా సంస్థ 70 శాతం, గూగుల్ సంస్థ 30 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

# పేట్రియాట్ క్షిపణులతో అమెరికా దాడులు



**పారిస్, మార్చి 26:** ఇరాన్పై అమెరికాఇజ్రాయెల్ దళాలు దాడులకు కౌంటర్గా ఇరాన్ ప్రతిదాడులు ముమ్మరంచేసింది. ఆ దాడులను తిప్పికొట్టేందుకు అమెరికాతో పాటు గల్ఫ్ దేశాలు పాట్రియాట్ క్షిపణులను వాడుతున్నాయి. అయితే ఇరాన్తో యుద్ధం మొదలైన మొదటి అయిదు రోజుల్లోనే అమెరికాతో పాటు గల్ఫ్ దేశాలు సుమారు 800 పాట్రియాట్ ఇంటర్సెప్టార్ క్షిపణులను వాడినట్లు యురోపియన్ యూనియన్ రక్షణశాఖ మంత్రి ఆండ్రియస్ కుబిలియస్ తెలిపారు. ఇంటర్సెప్టార్లను అంతగా వాడారంటే ఆ సంఖ్యను ఉత్పత్తి చేయాలంటే అమెరికాకు ఒక్క ఏడాది కాలం పడుతుందని ఆయన అన్నారు. గణాంకాలను పరిశీలిస్తే ఈ అంశం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. అమెరికా ప్రతి ఏడాది సగటును కేవలం 750 పాట్రియాట్ ఇంటర్సెప్టార్ క్షిపణులను మాత్రమే ఉత్పత్తి చేయగలదన్నారు.

# గాలిలోనే 7 గంటలు విమానం చక్కర్లు

**న్యూఢిల్లీ, మార్చి 26:** లండన్కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం మార్గమధ్యలో




యూటర్న్ తీసుకున్నది. సాంకేతిక లోపం కారణంగా సౌదీ గగనతలంలో వెనక్కి మళ్లింది. ఏడు గంటలు ప్రయాణించిన ఆ విమానం తిరిగి ఢిల్లీకి చేరుకున్నది. ఎయిర్ ఇండియాకు చెందిన ఏ350 విమానం (ఏఐ 111) లండన్లోని హీత్రూ విమానాశ్రయానికి వెళ్లేందుకు గురువారం ఉదయం 6.13 గంటలకు ఢిల్లీ ఎయిర్పోర్ట్ నుంచి టేకాఫ్ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు 3,300 కిలోమీటర్లు గాలిలో ప్రయాణించింది. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రభావితమైన సౌదీ అరేబియా గగనతలంపై ఉన్న ఎయిర్ ఇండియా విమానం మరో ఏడు గంటలు ప్రయాణించి లండన్ చేరుకోవాల్సి ఉన్నది. అయితే అనూహ్యంగా అది వెనక్కి మళ్లింది. విమానంలో సాంకేతిక సమస్యల కారణంగా గాలిలో యూ టర్న్ తీసుకున్నది. మరో మూడున్నర నుంచి నాలుగు గంటలపాటు వెనక్కి ప్రయాణించింది. మొత్తం ఏడు గంటల ప్రయాణం తర్వాత గురువారం మధ్యాహ్నం 1.20 గంటలకు ఢిల్లీ ఎయిర్పోర్టులో తిరిగి ల్యాండ్ అయింది. మరోవైపు సౌదీ అరేబియా గగనతలంపై ప్రయాణిస్తున్న సమయంలో విమానంలో పెద్ద శబ్దాలు వినిపించినట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. దీంతో యూ టర్న్ తీసుకుని వెనక్కి వచ్చినట్లు పేర్కొంది. అనుకోని పరిస్థితి కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసింది. వీలైనంత త్వరలో ప్రయాణికులు లండన్ చేరుకునేలా అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు వెల్లడించింది. అయితే ఢిల్లీకి తిరిగి రావడానికి ఎయిర్ ఇండియా విమానం సుదీర్ఘ మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నదో అన్నది తెలియలేదు.



# శీష్మహల్కోసం కోట్లాది ప్రజాధనం దుబారా

### కేజ్రీవాల్పై డిప్యూటి సిఎం ధ్వజం

**న్యూఢిల్లీ, మార్చి 26:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రెహమాన్ డకైత్లా ప్రజల సొమ్మును దోచుకున్నారంటూ బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారిక నివాసం (శీష్ మహల్) పునరుద్ధరణ పనుల కోసం భారీగా ఖర్చు చేశారని ఆరోపించింది. తనను తాను ఓ మహారాజులా భావించుకుంటూ కేజ్రీవాల్ శీష్ మహల్ను విలాసవంతంగా తీర్చిదిద్దుకున్నారని మండిపడింది. ఈ మేరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి పర్వేశ్ వర్మ మాట్లాడుతూ ఆప్ నేషనల్ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ పై సంచలన ఆరోపణలుచేశారు. ఇటీవల వచ్చిన ధురంధర్ సినిమాలోని విలన్ రెహమాన్ డకైత్ ప్రజలను ఎలా దోచుకుంటాడో, కేజ్రీవాల్ కూడా తన విలాసవంతమైన భవనం కోసం ప్రజాధనాన్ని దోచుకున్నారని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో ప్రజలు ఆక్సిజన్, ఆసుపత్రి బెడ్ల కోసం ఇబ్బందులుపడుతుంటే కేజ్రీవాల్ మాత్రం కోట్ల రూపాయలతో తన ఇంటిని ఆధునికీకరించుకున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా, శీష్ మహల్ కోసం చేసిన ఖర్చుల వివరాలతో ఉన్న ఓ భారీ రసీదుల రోల్ను ఆయన సభలో ప్రదర్శించారు. రూ.36 లక్షల సోఫాలు, రూ.1.05 కోట్ల విలువైన టేబుళ్లు కొన్నారంటూ వివరాలు చదివి వినిపిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కేవలం ఢిల్లీలోనేకాకుండా పంజాబ్లోకూడా మరో శీష్మహల్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. సీఎం నివాస నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని, అంచనా వ్యయంకన్నా 342 శాతం అధికంగా ఖర్చు చేశారని కాగ్ నివేదికపై ఈ చర్చ జరగడం గమనార్హం.

# రాహుల్ కంటే ప్రియాంక బెటర్: రిజిజు

**న్యూఢిల్లీ, మార్చి 26:** లోక్సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కంటే ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా మెరుగైన ఎంపిక అయి ఉండేవారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి ఇంకా రాజకీయ పరిణతి రాలేదని ఆయన విమర్శించారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'టైమ్స్ నౌ సమ్మిట్ 2026'లో మాట్లాడుతూ రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్సభలో రాహుల్ గాంధీ వ్యవహరించే తీరు, అంశాలను లేవనెత్తే విధానంలో విపక్ష నేతకు ఉండాల్సిన గంభీరత కనిపించడం లేదని రిజిజు అన్నారు. రాహుల్ గాంధీలో రాజకీయ పరిపక్వత లోపించిందని నేను భావిస్తున్నానని ఆయన అన్నారు. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడమే కాకుండా, నిర్మాణాత్మక సూచనలు ఇవ్వడంలో విపక్ష నేత పాత్ర కీలకమని, కానీ రాహుల్ గాంధీలో అది కొరవడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాహుల్తో పోలిస్తే ప్రియాంక గాంధీకి రాజకీయాలపై మంచి




అవగాహన ఉందని, ప్రజలతో కలిసిపోయే నైపుణ్యం ఆమెకు ఎక్కువగా ఉందని రిజిజు అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఆమె విపక్ష నేతగా ఉండి ఉంటే, సభలో చర్చలు మరింత అర్థవంతంగా సాగి ఉండేవని అన్నారు. అయితే, రిజిజు వ్యాఖ్యల వెనుక రాజకీయ వ్యూహం ఉందని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇమేజ్ను దెబ్బతీయడంతో పాటు, గాంధీ కుటుంబంలో విభేదాలు సృష్టించేందుకే బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రియాంక పేరును తెరపైకి తెస్తున్నారని విమర్శిస్తున్నాయి. విపక్ష నేత విషయంలో రిజిజు చేసిన ఈ పోలిక జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

# యుద్ధవిమానంపై ఇరాన్ దాడి..అంతాఫేక్: అమెరికా


**టెహ్రాన్,మార్చి 26:** అమెరికాకు చెందిన యుద్ధ విమానంపై దాడి చేశామని ఇరాన్ ప్రకటించి ఇందుకు సంబంధించి ఒక వీడియో విడుదల చేసింది. అదంతా ఫేక్ అని అమెరికా చెబుతోంది. తమ విమానం ఏదీ కూలలేదని అమెరికా అంటోంది. ఇరాన్ మీడియా కథనం ప్రకారం గల్ఫ్ దేశమైన ఒమన్ తీరంలో, చాబహార్ పోర్టు వద్ద అమెరికాకు చెందిన ఎఫ్18 యుద్ధ విమానంపై దాడి జరిగింది. ఇరాన్కు చెందిన ఐఆర్జీసీ ఈ దాడి చేసింది. తాము విజయవంతంగా అమెరికా యుద్ధ విమానాన్ని పేల్చేసామని ఇరాన్ ప్రకటించింది. తమ సోషల్ మీడియా ఖాతాలో ఒక వీడియోను కూడా విడుదల చేసింది. ఈ వీడియోలో ఒక యుద్ధ విమానం గాల్లో ఎగురుతుండగా, ఏవో మిస్సైల్స్ వచ్చి విమానాన్ని ఢీకొన్నాయి. ఈ సమయంలో విమానంలోంచి పైలట్ ప్యారాచూట్ సాయంతో కిందకు దూకేశాడు. అయితే, అమెరికా యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ నెలలోనే అమెరికాకు చెందిన ఎఫ్15 యుద్ధ విమానంతోపాటు, ఎఫ్35 అనే మరో స్టీల్త్ జెట్ను కూడా పేల్చేసింది. అయితే, ఈ పేలుళ్లను అమెరికా కొట్టిపారేసింది.

# తుర్కియే చమురు ట్యాంకర్పై డ్రోన్ దాడి



**ఇస్తాంబుల్, మార్చి 26:** తుర్కియేకి చెందిన భారీ చమురు ట్యాంకర్పై నల్ల సముద్రంలో డ్రోన్ దాడి జరగడం కలకలం రేపింది. ఇస్తాంబుల్ సమీపంలోని అత్యంత కీలకమైన బాస్ఫరస్ జలసంధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు 10 లక్షల బ్యారెళ్ల ముడి చమురుతో ప్రయాణిస్తున్న ఎం/టి ఆల్టురా అనే నౌకను ఓ గుర్తుతెలియని డ్రోన్ ఢీకొట్టింది. డ్రోన్ ఢీకొన్న వెంటనే నౌకలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన తుర్కియే రక్షణ దళాలు వేగంగా స్పందించి మంటలను ఆర్పివేశాయి. ఈ ఘటనలో ఎలాంటి చమురు లీకేజీ జరగలేదని అధికారులు తెలిపారు. ప్రపంచ వాణిజ్యం, చమురు రవాణాలో బాస్ఫరస్ జలసంధి అత్యంత వ్యూహాత్మకమైన మార్గం. ఇక్కడ దాడి జరగడం అంతర్జాతీయ నౌకా యాన వర్గాల్లో ఆందోళన నింపింది. ఈ దాడికి ఇప్పటివరకు ఏ సంస్థా బాధ్యత ప్రకటించుకోలేదు.

# ఇరాన్ సుప్రీం లీడర్ పదవి ఆఫర్ చేస్తే వద్దన్నా: ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ దేశ సుప్రీం లీడర్ పదవిని తనకు ఆఫర్ చేశారని, అయితే తాను తిరస్కరించానని అన్నారు. దాదాపు నెల రోజులుగా ఇరాన్తో జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు చర్చలు జరుగుతున్నాయని మరోసారి పునరుద్ఘాటించారు. ట్రంప్ వాదనలను టెహ్రాన్ ఇదివరకే ఖండించిన విషయం తెలిసిందే. రిపబ్లికన్ పార్టీ నిధుల సేకరణ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వింత వాదనను తెరపైకి తెచ్చారు. 'ఇరాన్ దేశానికి అధిపతిగా ఉండే ఉద్యోగం కన్నా తక్కువగా కోరుకునే పదవి మరొకటి లేదు. వారు నన్ను తదుపరి సుప్రీం లీడర్గా చేయాలనుకుంటున్నారు. కానీ నేను వద్దు, ధన్యవాదాలు అని చెప్పేశాను అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత నెలలో జరిగిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు గురయ్యారు.ఆ తర్వాత ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త నాయకుడిగా ప్రకటించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి మొజ్తబా బహిరంగంగా కనిపించలేదు. దాడుల్లో ఆయన గాయపడి ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి.ఇరాన్పై చేపట్టిన ఆపరేషన్ను సైనిక విధ్వంసంగా అభివర్ణించిన ట్రంప్, యుద్ధంలో అమెరికా ఘనవిజయం సాధించిందని మరోసారి ప్రకటించారు. మేము ఇరాన్ విషయంలో భారీ విజయం సాధిస్తున్నాం. వారు మాతో చర్చలు జరుపుతున్నారు. ఒప్పందం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ ఆ విషయాన్ని బయటకు చెప్పడానికి భయపడుతున్నారు. సొంత ప్రజల చేతిలో లేదా మా చేతిలో చనిపోతామనే భయంతో వారున్నారని ట్రంప్ పేర్కొన్నారు.



### ఆరోగ్యశ్రీ బిల్లులు ఇవ్వకపోవడంతో
# మూతపడుతున్న ఆసుపత్రులు
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు

**హైదరాబాద్, మార్చి26 ప్రభాతవార్త:** ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం దూరమవడమే కాకుండా ఆసుపత్రులు మూతపడుతున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు ఆవేదన చెందారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. మీరు పది లక్షలకు ఆరోగ్యశ్రీని పరిమితం చేసి కేవలం 496 మందికే ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని నోటీసులు ఇచ్చినా బిల్లులు రిలీజ్ రావడం లేదని ఆరోపించారు. చిన్న చిన్న దవాఖానలు మూతపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదనీ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి.

# దావోస్ పెట్టుబడులపై శ్వేతపత్రం ఇస్తాం

- బిజెపి, బిఆర్ఎస్ విమర్శలను తిప్పి కొట్టిన మంత్రి శ్రీధర్ బాబు
- కాటెపల్లి వెంకటరమణారెడ్డి వ్యాఖ్యలు ఖండించిన యెన్నం శ్రీనివాస్, మంత్రి



**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** దావోస్ పర్యటనలో ప్రభుత్వం 44 ఎంఒయులు కుదుర్చుకోగా 2.19లక్షల కోట్లు పెట్టుబడుల వ్యాల్యూ 68158 మందికి ఉపాధి లభించిందని పరిశ్రమలు ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. స్వార్థరాజకీయాల కోసం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవద్దని అంటూ,దావోస్ పర్యటనలు పెట్టుబడులపై బిజెపి, బిఆర్ఎస్ ప్రశ్నోత్తరాల సందర్భంగా చేసిన విమర్శలను శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. మహారాష్ట్ర సిఎం కూడా ఎంఒయు చేసుకున్న కంపెనీలలో 30శాతంకు మించి పెట్టుబడులు వస్తే అది తమ గొప్ప సక్సెస్ అని చెప్తున్నారని మన వద్ద అవగాహన ఉండి కూడా ప్రజలకు తప్పుడు సమాచారం ప్రచారం చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి అడ్డు పడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు.రాష్ట్రానికి పెట్టుబడులు తేవడానికి మేం కృషిచేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వడంలేదని ఆయన ఆవేదన చెందారు. స్వార్థ రాజకీయాల కోసం చేసే ఈ తప్పుడు ప్రచారం రాష్ట్ర ప్రగతికి అడ్డంకులు సృష్టిస్తుందని అన్నారు. ఎంఒయులు, వచ్చిన కంపెనీలపై శ్వేతపత్రం విడుదలకు సిద్ధమని శ్రీధర్‌బాబు సవాల్ చేశారు. ఎంఓయూలు కుదుర్చుకోవడం మాత్రమే కాకుండా, అవి గ్రౌండింగ్ కావడానికి సమయం పడుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ విషయంపై అవగాహన లేకుండా కొందరు సభ్యులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రతి ఎంవోయూను భూమిపై అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, తమ నిబద్ధతపై ఎలాంటి సందేహం అవసరం లేదని స్పష్టం చేశారు. టైర్2, టైర్3 పట్టణాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి చెప్పారు. పదేళ్ల తర్వాత ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. టీఫైబర్‌తో లాస్ట్ మైల్ కనెక్టివిటీని దేశానికి ఆదర్శంగా నిలిపామని, రాష్ట్రంలోని రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని వివరించారు. బిజెపి ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ "మాటలు వేరు ఇంప్లిమెంటేషన్ జరగడం వేరు అవుతున్నవేదీ ముఖ్యంగా గమనించాల్సిన అవసరం ఉంది. నిజానిజాలు ఖచ్చితంగా చెప్పాలి. మీరన్న మాటకు ఇక్కడ పేపర్లలో ఉన్నమాటకి తేడా ఉంది అన్నిలక్షల యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేట్లు చూడండి భూములు కేటాయించండి శంకుస్థాపనలు చేయండి కంపెనీలను స్టార్ట్ చేయండి. మనం దిగిపోయే లోగా ఉద్యోగాలు ఇచ్చేపరిస్థితికి తీసుకొని రండి. ముఖ్యమంత్రి ,ఐటి మంత్రి ఏదైతే చెప్తారో అది ఒక సంవత్సరంలో పూర్తికావాలని కోరారు". ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పెట్టుబడి పెట్టేవారు హైదరాబాద్ మాత్రమే ఎంచుకొనకుండా అన్ని ప్రాంతాలను ఎంచుకొనేలా చేయండని కోరారు. ఆదిలాబాద్ సిమెంట్ కంపెనీ రాష్ట్రం హ్యాండోవర్ చేసుకోవాలని కోరారు. ఐటి టవర్ పూర్తిచేయాలని కోరారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట ఐటికి ఇంటర్ నెట్ కట్ చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మరో మూడు ఏండ్ల రెంట్ ఫ్రీ అవకాశం అందులోని కంపెనీలకు ఇవ్వాలని హరీష్ కోరారు. ఐతే దావోస్‌కు ముఖ్యమంత్రి ఐటి మంత్రి ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ కార్యదర్శి ఇతర ఐఎఎస్‌లు పోయారని కామారెడ్డి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను సభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తప్పుపట్టారు. మేం మా సొంత ఖర్చులతో పోయామని అన్నారు. స్పీకర్ కూడా ఈ విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని కామారెడ్డి ఎమ్మెల్యేకు సూచించారు. శ్రీధర్‌బాబు కూడా ఇలాంటి వ్యాఖ్యలు మంచిది కాదని రికార్డునుంచి తొలగించాలని కోరారు. వరల్డ్ ఎకానమిక్ ఫోరం వంటి వేదికల రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడానికి వెళ్లితే అధికారం సభ్యులు సొంత ఖర్చులతో వస్తే విమర్శలు చేయడం తగదని అన్నారు. ఈసభలో ఉన్న సభ్యులు నైపుణ్యం ఉన్న నిష్ణాతులు వారు ప్రపంచంతో అనుసంధానం లేకుండా ఐసోలేషన్‌లో ఉంటే పెట్టుబడులు రావని, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వివరించినప్పుడే పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారని శ్రీధర్‌బాబు హితవు చెప్పారు.




### జీవన్‌రెడ్డి అన్న మాటలకు
## సమాధానం చెప్పండి: పైడి రాకేష్‌రెడ్డి



**హైదరాబాద్,మార్చి 26 ప్రభాతవార్త:** 'ఉత్తర తెలంగాణలో ఆల్ఫ్రా జోలం కల్తీ కల్లు వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కల్తీ కల్లు లేని ఉత్తర తెలంగాణను ఏ విధంగా తయారు చేసుకోవాలో సూచించాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పథకానికి ఇందిరమ్మ పేరు పెడుతున్నారు! మాజీ ప్రధాన మంత్రి పేరు పెట్టి అవమానించొద్దని నిన్న ఆ మాట అన్నాను. సోషల్ మీడియాలో మాజీ ప్రధానిపై అభ్యంతరకరమైన వీడియోలు వస్తున్నాయి. వీటిని ఖండించిన ఏకైక ఎమ్మెల్యేను నేనే. ఇప్పసారాకు సూటైన పేరు పెట్టాలని సూచిస్తున్నాను. కరీంనగర్ మంత్రులకు జీవన్ రెడ్డి షాక్ తగిలినట్టు కనిపిస్తుంది. 40 ఏళ్ల పాటు మీ పార్టీకి సేవ చేసిన వారిని పార్టీ నుంచి వెళ్లగొడుతున్నారు. కౌలుదారులు వచ్చి కాంగ్రెస్‌ను నాశనం చేస్తున్నారని జీవన్‌రెడ్డి అన్న మాటలకు ముందు సమాధానం చెప్పండి? కల్తీకల్లు వ్యాపారాలతో సంబంధం ఉన్నవారు ఉన్నారు. 120 చనిపోయిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఎందుకు ఇంకా పరిహారం డబ్బులు ఇవ్వడం లేదు. వారి సంక్షేమానికి 1000 కోట్లు బడ్జెట్‌లో పెట్టండి. ఉత్తర తెలంగాణ కోటాలో శ్రీధర్‌బాబు, పొన్నం మంత్రి పదవులు కొట్టేశారు నిజామాబాద్ జిల్లాకు దావోస్ వెళ్ళి శ్రీధర్‌బాబు ఏం తెచ్చారు?" అని పైడి రాకేష్‌రెడ్డి నిలదీశారు.

### తలకిందులు తపస్సు చేసినా హరీష్‌రావును సిద్ధిపేటలో
## మా అభ్యర్థి ఓడగొడతాడు
### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

"హరీష్ రావు చిట్ చాట్ పేరిట బడాయి కబుర్లు, సొల్లు కబుర్లు చెబుతున్నారు. దమ్ముంటే రేవంత్ రెడ్డిని సిద్దిపేటకు వచ్చి పోటీ చేయమని మాట్లాడుతున్నారు. సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి కాదు, బిఫాం ఇచ్చిన అభ్యర్థి రాబోయే ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొడుతారు. సిద్దిపేటలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం. తలకిందులు తపస్సు చేసిన మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాదు, కేసిఆర్ ముఖ్యమంత్రి కారు. టిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్‌గా మారిన రోజే ప్రజలు మీ పార్టీని ఫాం హౌస్‌కు పరిమితం చేశారు. బీసీలపైన బిఆర్ఎస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తున్నది. బీసీ కుల గణనలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు బీసీలపై కపటప్రేమ చూపిస్తున్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ కోసం ప్రభుత్వం బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపితే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ఇంతవరకు తీసుకోలేదు' అని నిలదీశారు.

## హరీష్‌రావు పిచ్చిపిచ్చి కామెంట్లు మానుకోవాలి
### ప్రభుత్వ విప్ వేముల వీరేశం

'నిన్న హరీష్‌రావు చిట్‌చాట్ పేరిట ఏవేవేవో మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డి మిమ్మల్ని గద్దె దించుతాం అని.. పార్లమెంటు ఎన్నికల్లో మిమ్మల్ని సున్నాకి పరిమితం చేస్తాం అని చేసిన దమ్మున్న నాయకుడు రేవంత్‌రెడ్డి. మీ పార్టీ అధ్యక్షుడు ఏడి? ముఖ్య మంత్రికి వస్తున్న ఆదరణ చూసి, ఎదుగుతున్న తీరు జీర్ణించుకోలేక అక్కసుతో మాట్లాడుతున్నారు హరీష్ రావు. పిచ్చిపిచ్చి కామెంట్లు మానుకో' అని వేముల వీరేశం హెచ్చరించారు.

### పెండింగ్ బిల్లులు చెల్లించని పక్షంలో
## 30న అసెంబ్లీ ముట్టడి
### తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జెఏసి

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త :** దాదాపు 30 నెలలుగా మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జెఏసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ అన్నారు. అసెంబ్లి బడ్జెట్ సమావేశాల్లో మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 30న బకాయి బిల్లులు రావాల్సిన మాజీ సర్పంచులంతా కలిసి అసెంబ్లిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## బిసి సబ్‌ప్లాన్‌ను అమలు చేయాల్సిందే
### మాజి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జనాభాలో 56 శాతం ఉన్న వెనకబడిన వర్గాల సంక్షేమం కోసం బిసి సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. తమ బడ్జెట్ అంకెల గారడి కాదని చెబుతున్న భట్టి విక్రమార్క అమలులో మాత్రం ఆ చిత్తశుద్ధిని చూపడం లేదని మండి పడ్డారు. బిసి విద్యార్థులకు ఫిజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, హామి మేరకు బిసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని, అసెంబ్లీ ఎన్నికల్లో విడుదల చేసిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కూరగాయల రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
### ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** కూరగాయ రైతులను ప్రోత్సహించేందుకు కూరగాయల కిసాన్ ఐడి కార్డులు ఇస్తామని, తద్వారా వారికి లోన్లు, ప్రత్యేక మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్‌భాష తెలిపారు. ప్రతీ సంవత్సరం 50 వేల ఎకరాల్లో కూరగాయలు విస్తీర్ణం పెంచేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూరగాయ సాగును భారీగా ప్రోత్సహించడానికి రూ. 215 కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. 50 శాతం సబ్సిడీతో కూరగాయలు పందిర్లు, ఇతర ప్రధాన పనిముట్లు ఆర్‌కెవివై, ఎమ్ఐడిహెచ్ పథకాల కింద ఇస్తున్నట్లు తెలిపారు. యాంత్రికరణ కింద మినీ ట్రాక్టర్లు, పసుపు తవ్వే యంత్రాలు, బాయిలర్లు కలిపి మొత్తం 17 రకాల పరికరాలకు సబ్సిడిలు ఉన్నట్లు తెలిపారు. పంట మార్పిడి క్రింద కూరగాయలు, పప్పు దినుసులు సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులు నమ్మకమైన రిజిస్టర్డ్ నర్సరీ నుంచి కూరగాయల నారు తీసుకోవాలని, అలాగే నిబంధనలు పాటించని నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## కనీస వేతనాన్ని పెంచండి: గోపాలమిత్రల విన్నపం

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అన్న పదాన్ని తొలగించి కనీస వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ నూతన కార్యనిర్వహణాధికారి సుబ్బారాయుడును గోపాలమిత్రల అసోసియేషన్ కోరింది. హైదరాబాద్‌లో గురువారం సిఇవోను గోపాల మిత్రలు కలిశారు. గోపాల మిత్రలకు మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీని రూ.10 లక్షలకు పెంచాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారికి ప్రమాద భీమా రూ.10 లక్షలను ప్రభుత్వ పరంగా వర్తింపు చేయాలని కోరారు. పశుసంవర్ధకశాఖ ద్వారా డిపార్ట్మెంట్ పరీక్ష నిర్వహించి శాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని వినతి పత్రం అందజేశారు.

## వికారాబాద్ మార్కెట్‌లో రైతుల నిలువుదోపిడి
### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు రైతు కమిషన్ ఫిర్యాదు

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులు నిలువుదోపిడికి గురవుతున్నారని స్థానిక ఎమ్మెల్యే, స్పికర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి వివరించారు. వ్యవసాయ మార్కెట్‌లో తూకాల్లో మోసాలు, అధిక కటింగ్‌లు, మార్కెట్ ఫీజుల పేరిట అధిక వసూళ్లు, వ్యాపారుల సిండికేట్ ఏర్పాట్లు వంటి సమస్యల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఈ విషయమై గురువారం అసెంబ్లిలో స్పికర్‌ను కలిశారు. ఈ విషయమై కమిషన్‌కు ఈనెల 25న భారతీయ కిసాన్ సంఘ్ పిర్యాదు చేయగా ఈనెల 30న వికారాబాద్ వ్యవసాయ మార్కెట్లను సందర్శించనున్నట్లు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ మార్కెట్లలో రైతులకు కనీస సౌకర్యాలు కూడా లభించడం లేదని తెలిపారు. కమిషన్ పర్యటనపై స్పీకర్‌తో మాట్లాడినట్లు ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

### ఆర్ఐఎంసీలో 8వ తరగతి
## అడ్మిషన్లకు గడువు పెంపు
### ఏప్రిల్ 15 వరకు పొడిగింపు, జూన్ 7న పరీక్ష

**హైదరాబాద్, ప్రభాతవార్త మార్చి 26:** 2026-27 విద్యా సంవత్సరానికి గాను, డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో 8వ తరగతిలో విద్యార్థుల ప్రవేశం కోసం నిర్వహించే "ప్రవేశ పరీక్ష"కు దరఖాస్తు గడువు పెంచారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఏప్రిల్ 15 వరకు స్వీకరించనున్నట్టు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష రాష్ట్రంలో కేవలం హైదరాబాద్‌లో మాత్రమే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తులను సమర్పించడానికి తుది గడువుగా మొదట ప్రకటించినట్టు ఏప్రిల్ 5 కాదని, దానిని పొడిగించామని ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులను స్వీకరించ నున్నట్టు ప్రకటలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అభ్యర్థులు ఎస్‌సీఈఆర్‌టీ అధికారిక వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. ఇతర సందేహాల నివృత్తి కోసం తెలంగాణ అభ్యర్థులు 8520866771 హెల్ప్ లైన్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షను జూన్ 7న నిర్వహించనున్నారు.

# ఆరోగ్యశ్రీతో 9.45 లక్షల మందికి వైద్యం

### ఆరోగ్యశ్రీ బకాయిలు రూ. 727.75కోట్లు
### పథకాన్ని పదిలక్షలకు పెంచాక 496 మంది వైద్యంకు రూ.37కోట్లు వ్యయం: రాజనర్సింహా



**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 9.45లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందాయని ఐదులక్షల నుంచి పదిలక్షలకు ఖర్చుమొత్తం పెంచాక 496 మందికి వైద్య సేవలు అందిచారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం కల్వకుంట్ల సంజయ్ వేసిన ప్రశ్నంకు మంత్రి దామోదర రాజనర్సింహా సమాధానం ఇస్తూ కోరుట్ల ఎమ్మెల్యే విలువైన సూచనలు ఇస్తారని ముఖ్యంగా ఆర్థో,హార్ట్ సర్జరీ అంశంలో ఆయన సూచనలు పరిగణలోకి తీసుకొని విధాన పరమైన మార్పులు చేస్తామని అన్నారు. మార్చి 2026నాటికి ఆరోగ్యశ్రీ సంబంధించిన బకాయిలు రూ. 727.75కోట్లు ఉన్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షలరూపాయల నుంచి పదిలక్షలకు పెంచిన తరువాత 496 మంది రోగులకు రూ.37కోట్ల విలువకలిగిన వైద్యసేవలు అందిచామని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు నుంచి ఏడాదికి సగటున 2.5లక్షల మంది ఆరోగ్యశ్రీ సేవలు అందించేవారని ప్రస్తుత సంవత్సరం ఆ సంఖ్య నాలుగు లక్షలకు చేరుకొందని సభకు వివరించారు. ఆరోగ్య శ్రీ డబ్బులు గత ప్రభుత్వం సగటున నెలకు 52 కోట్ల రూపాయలు చెల్లిస్తే మేం సగటున నెలకు 89 కోట్లు చెల్లిస్తున్నా మని తెలిపారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన ఇఎహెచ్ఎస్ బకాయిలు రూ.130 కోట్లను క్రమంగా తగ్గిస్తున్నామని అదేవిధంగా రూ.600 కోట్లు ఆరోగ్యశ్రీబకాయిలు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. 2023 డిసెంబర్ 8 నుంచి మార్చి 26 వరకు 2400 కోట్లు చెల్లించామని ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 250 కోట్లు బాయిలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ సేవలు నిరాకరిస్తున్నాయని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలు ఆయన ఖండించారు. మేం అధికారంలోకి వచ్చే నాటి 330 ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో ఉంటే నేడు 537 ఆసుపత్రులు పెరగడమే కాంగ్రెస్ హయాంలోని నిర్వహణకు నిదర్శనం అన్నారు. ములుగు, నారాయణపేట వంటి జిల్లాలో ప్రజలకు మెరుగైన వైదనయం అందించేలా చర్యలు తీసుకొన్నామని ఆయన స్పష్టం చేశారు. ఏదైతే హార్ట్, కిడ్నీ,ఆర్థో వంటి విభాగాలను మరింత బలోపేతం చేసి ప్రభుత్వ టిచింగ్ ఆసుపత్రిలోకి రోగులను తీసుకొని రావాల్సిన అవసరం ఉందని చర్యలు చేపడుతున్నా మని తెలిపారు. డి-అడిక్షన్ సెంటర్ జిల్లా ఆసుపత్రులలో పెడుతామని తెలిపారు.

### వెల్‌నెస్ సెంటర్లను బలోపేతం
## చేయాలి: శ్రీపాల్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వెలనెస్ సెంటర్లను బలోపేతం చేయాలని నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యో, ఉపాధ్యా, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న 12 వెల్నెస్ సెంటర్లలో మందుల కొరత ఉన్నందున వెంటనే ఇందుకు సంబంధించి తగు చర్యలు తీసుకొని సరఫరా పెంచాలని కోరారు. పెన్షనర్లకు ప్రధానంగా షుగర్, బిపికి సంబంధించిన మందుల కొరత ఉందన్నారు. స్పందించిన వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారని నాయకులు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న వెల్‌నెస్ సెంటర్లు అన్నింటినీ మెడికల్ కాలేజీలకు అనుబంధ ఆస్పత్రులతో అనుసంధానం చేశామని, గత రెండు మాసాలుగా అన్నిరకాల వ్యాధులకు సంబంధించి ప్రొఫెసర్లు, వైద్యులు అందుబాటులో ఉండి చికిత్స అందిస్తున్నారని వైద్య శాఖ కార్యదర్శి చెప్పారన్నారు.

# మే మొదటి వారం ఉచిత పుస్తకాల పంపిణీ!

- పాఠశాలలు ప్రారంభం నాటికే అందరికీ పాఠ్య, నోట్‌బుక్‌లు
- 10వ తరగతి వరకు ఉచిత నోట్‌బుక్‌ల సరఫరా



**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26:** రానున్న 2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను మే మొదటి వారంలోనే ఆయా జిల్లాలకు పంపిణీ చేయనున్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి మండలపాయింట్ వరకు రాష్ట్ర కేంద్రం నుంచే రవాణా చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రాల వరకు ఉచిత పాఠ్యపుస్తకాలను రాష్ట్ర ప్రింటింగ్ ప్రెస్ నుంచి సరఫరా చేసేవారు. ఆ తరువాత జిల్లా కేంద్రం నుంచి మడల కేంద్రం, అక్కడి నుంచి స్కూల్స్‌కి పాఠ్యపుస్తకాలను సరిఫరా చేసేవారు అయితే రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి టెక్స్ట్‌బుక్స్ ప్రెస్ గోడౌన్ నుంచి నేరుగా మండల పాయింట్ వరకు ఉచిత పాఠ్యపుస్తకాలను రాష్ట్ర కేంద్రం నుంచే రవాణా చేయించాలని నిర్ణయించారు. మండల కేంద్రం నుంచి స్కూల్స్‌కి మండల విద్యాధికారులు సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటి వరకు జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఎంఈవోలకు లేకుండా.. నేరుగా మండల కేంద్రాలకు సరఫరా చేయాలని నిర్ణయించినట్టు పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారి తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రారంభమై నెలాఖరు నాటికి రవాణాకు సిద్ధమయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. తెలంగాణ పాఠశాల విద్యా శాఖ అంచనాల మేరకు రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థుల కోసం సుమారు 2.10 కోట్ల కొత్త పాఠ్యపుస్తకాలు అవసరముంటాయని అంచనా వేసింది. వాటిల్లో సుమారు 1.65 కోట్ల వరకు ఉచిత కాంపోనెంట్ పాఠ్యపుస్తకాలు ఉంటాయని తెలుస్తోంది. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థులకు సుమారు 2.20 కోట్ల నోట్ పుస్తకాలను ఉచితంగా సరఫరా చేయనుంది. వీటికి సంబంధించిన ముద్రణ కూడా చివరి దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. అయితే రానున్న 2026-27 విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా నోట్‌బుక్స్ సరఫరా చేయాలని భావించిన పాఠశాల విద్య శాఖ నోట్‌బుక్‌లను మాత్రం నేరుగా పాఠశాల వరకు చేర్చాలని నిర్ణయించింది. రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికే ఉచిత పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్‌లను, యూనిఫామ్‌లను, వెల్‌కమ్ కిట్‌ను ఇవ్వనుంది.

### ప్రభుత్వ విద్యాలయాలను, ఆసుపత్రులను అభివృద్ధి
## చేయడమే లక్ష్యం: కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ విద్యాలయాలను, ఆసుపత్రులను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముషీరాబాద్, కవాడిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 7లో ఉన్న యూపీహెచ్ సెంటర్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ప్రధానంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో వివిధ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పేషెంట్లకు అవసరమైన మెడికల్ ఎక్విప్మెంట్స్ సుమారు రెండు కోట్ల రూపాయల విలువైనవి ఇవ్వటం జరిగిందని తెలిపారు. నేడు ప్రజలు ఆధునిక వైద్యం కోరుకుంటున్నారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆసుపత్రులను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఎన్‌టిపిసీ సహకారంతో గతంలో అన్ని ఆసుత్రులకు నూతన సౌకర్యాలు కల్పించామని, ఇప్పుడు రెండవ విడతగా ఈ ఎక్విప్మెంట్స్ ఇవ్వటం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లో సైతం విద్యార్థులకు అవసరమైన టాయ్‌లెట్స్ క్లీనింగ్స్, ఫర్నిచర్, మంచినీటి మిషన్‌లు వంటి అనేక మౌళిక వసతులను కల్పించటం జరుగుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో ప్రభుత్వం చేయవలసిన పనులు చేయటం లేదు కాబట్టి, మేమే ప్రత్యేక చొరవ తీసుకుని ఆ సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.

### జిఎస్‌టి సవరణ బిల్లుకు
## శాసనసభ ఆమోదం
### సేల్స్ టాక్స్ కమిషనర్ పోస్టు పేరును చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్‌గా మార్పు

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** జిఎస్టి సవరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ అమోదం తెలిపింది. ఈ బిల్లును మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశపెట్టారు. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే పరిగి రాంమోహన్‌రెడ్డి బలపరిచారు. బిజెపి, ఎంఐఎం, బిఆర్ఎస్ పక్షాల నుండి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. సభలో చర్చ జరిగిన అనంతరం జిఎస్‌టి సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది. సేల్స్ టాక్స్ కమిషనర్ పోస్టును చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్‌గా మార్పు చేశారు. అలాగే అదనపు కమిషనర్ (గ్రేడ్-1) పోస్టును స్టేట్ టాక్స్ కమిషనర్‌గా మార్చుతూ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఒకే దేశం, ఒకే చట్టం నినాదంతో జిఎస్టి చట్టాన్ని చేసినప్పటికీ కేంద్రం, రాష్ట్రంలోని శాఖాధిపతుల మధ్య హోదాలో తేడాలు ఉండటం వల్ల వీటన్నింటిని యూనిఫామ్ చేసేందుకు ఈ చట్ట సవరణ చేస్తున్నామని సభలో ప్రభుత్వం వెల్లడించింది. జిఎస్టి చట్టం లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అవసరమైన కమ్యూనికేషన్, కో ఆర్డినేషన్ కోసం సులభతరం కావాలనే ఉద్దేశ్యంతోనే ఈ సవరణ బిల్లును చేపట్టామని మంత్రి జూపల్లి సభకు వివరించారు.

# అసెంబ్లీని ముట్టడించిన డివైఎఫ్ఐ

- అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు
- అక్రమ అరెస్టులను ఖండించిన డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26:** వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తలపెట్టిన చలో అసెంబ్లీ ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ.. వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించి డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలను అసెంబ్లీ గేటు దగ్గరే పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు సందర్భంగా పోలీసులకు, డివైఎఫ్ఐ నాయకుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. అక్రమ అరెస్టులను డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పోలీసుల దాడులు, అక్రమ అరెస్ట్‌లను ఖండిసూ నేడు(శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం దిష్టిబొమ్మల దగ్ధంచేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై అసెంబ్లీ సమావేశాల్లో నోటిఫికెషన్స్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, జాబ్ క్యాలెండరు అమలు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో అసెంబ్లీ విజయవంతం అయిందని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి తెలిపారు. పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి నుండి అన్ని జిల్లాల్లో ముందస్తు అక్రమ అరెస్టులు చేశారని అయినప్పటికీ అసెంబ్లీని ముట్టడించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలండర్, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 29 నెలలు అవుతున్నా ఇప్పటికీ హామీలు అమలు చేయడం లేదని, ఈ బడ్జెట్లో నైనా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే వరకు ప్రతి నిరుద్యోగికి రూ. 4వేల నిరుద్యోగ భృతికి నిధులు కేటాయిస్తారేమోనని ఆశలు పెట్టుకున్నారన్నారు. కానీ బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా నిరుద్యోగ భృతి ఊసెత్తకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. గత బడ్జెట్లో ప్రకటించిన జాబ్ క్యాలండర్ గురించి ప్రస్తావించకపోవడం జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ ను అమలు చేయకపోవడం, ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్స్ వేయకుండా నిరుద్యోగ యువతను నిరక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 2 లక్షల ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నా నోటిఫికెషన్స్ వేయకుండా నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు.

### దేశ వ్యాప్తంగా యూరియా యాప్..
## తెలంగాణలో అమలు భేష్
### కేంద్రమంత్రి జెపి నడ్డా
### మంత్రి తుమ్మలకు కేంద్ర మంత్రి ఫోన్

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** రానున్న ఖరీఫ్‌లో తెలంగాణకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు కేంద్ర రసాయనాల శాఖ మంత్రి జెపి నడ్డా హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. యూరియా యాప్‌ను త్వరలోనే దేశవ్యాప్తంగా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామి ఇచ్చారు. ఈ విషయమై గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కేంద్ర మంత్రి ఫోన్ చేశారు. తెలంగాణలో ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించిన యూరియా అవసరాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవసరాలను కేంద్ర మంత్రికి వివరించిన తుమ్మల.. ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించిన యూరియా కేటాయింపులను 10.00 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 11.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. రైతులు పత్తి నుండి మక్క సాగు వైపు మొగ్గుచూపడం, ప్రారంభ నిల్వలు తక్కువగా ఉండటం వల్ల రాష్ట్రానికి మొత్తం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని తెలిపారు.

## ఫ్యూచర్ సిటీతో గ్లోబల్ డెస్టినేషన్‌గా హైదరాబాద్

### కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** ప్రజా పాలనను కొంత పుంతలు తొక్కించేందుకు సిఎం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను ఒడిసి పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు అన్యాయం చేసిందని మండిపడ్డారు. బడ్జెట్ పద్దులపై చర్చలో భాగంగా గురువారం శాసనసభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఐటి పరిశ్రమ అభివృద్ధిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. ఫ్యూచర్ సిటి పేరుతో సిఎం రేవంత్ చేస్తున్న ఆలోచన ఆలోచన అద్భుతంగా ఉందన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో పాలనా సాగుతోందన్నారు. తెలంగాణ రైజింగ్ పేరుతో హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి, లక్షల కోట్ల పెట్టుబడులను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయతననాలు జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో గ్లోబల్ డెస్టినేషన్‌గా మారే అవకాశాలు హైదరా బాద్ నగరానికి విస్తృతంగా ఉన్నాయని, దేశం లోనే హైదరాబాద్ నగరం కీలకంగా మారబోతోందన్నారు.

# పేదల వైద్యానికి రూ. 4,500 కోట్లు

## గత ప్రభుత్వ బకాయిలు రూ. 600 కోట్లు: సిఎం

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ 27 నెలల పాలనలో పేదల వైద్యం కోసం రూ.4500కోట్లు వ్యయం చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ డిప్యూటీ లీడర్ హరీష్‌రావు మాట్లాడుతూ గ్రీన్‌ఛానల్ ద్వారా ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పింది కానీ విడుదల చేయలేదని విమర్శించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆరువందల కోట్ల బకాయిలో రూ.360కోట్లు ప్రైవేటు ఆసుపత్రులకైతే రూ.240 ప్రభుత్వ ఆసుపత్రులకు చెందినవని వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయనీ,



విద్య,వైద్యం మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశం అన ఆయన వివరించారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని రేవంత్ ఖరాఖండిగా చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ గత ప్రభుత్వంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పిఎలు సిఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సిఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. మేం అధికారంలోకి వచ్చాక రూ.2046 కోట్ల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని చెప్పారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలను పెండింగ్‌లో ఉంచిందని ఐతనా మేం ఇప్పటి వరకు 2408కోట్లు చెల్లించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు 1480 చెల్లించామని సభకు ముఖ్యమంత్రి వివరించారు.గత పాలకులు ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమేననీ కొట్టిపారేశారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టంచేశారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువస్తున్నట్లు సిఎం రేవంత్ తెలిపారు.విదేశాలలో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని గోషామహల్‌లో 30 ఎకరాలలో మూడువేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తున్నామని వైద్యరంగంకు నిధులు భారీగా కేటాయించి దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతూమని ఆశాభావం వ్యక్తంచేశారు.



### నిమ్స్‌లో గద్దర్ సతీమణి విమలను పరామర్శించిన

## డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం

**జూబ్లీహిల్స్, మార్చి 26, ప్రభాతవార్త:** నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతున్న విమల మూడు రోజుల క్రితం నిమ్స్‌లో చేరగా, నేడు ఆమెకు శస్త్రచికిత్స జరగనుంది. ఈ నేపథ్యంలో భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ ఆసుపత్రికి వెళ్లి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కలిసి విమలకు అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. విమలతో పాటు ఆమె కుమారుడు సూర్యం, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారు. వైద్యులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఆమె ఆరోగ్య పరిస్థితి పట్ల పూర్తి పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. విమలను పరామర్శించిన వారిలో సాంస్కృతిక కళా సారథి ఛైర్మన్ వెన్నెల ఉన్నారు.

## జిల్లాలకు 350 కొత్త ఆర్టీసీ బస్సులు

### కొత్త రూట్లు, బస్ స్టేషన్‌ల అభివృద్ధిపై కార్యాచరణ

### ప్రయాణికులకు మౌలిక సదుపాయాలపై యాక్షన్ ప్లాన్: మంత్రి పొన్నం

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26: రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు త్వరలోనే కొత్త ఆర్టీసీ బస్సులను మంజూరు చేయనున్నారు. నియోజకవర్గాల వారిగా బస్సుల అవసరాలు, కొత్త రూట్లు, బస్ స్టేషన్‌ల అభివృద్ధిపై ఆర్టీసీ అధికారులతోపాటు ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం అసెంబ్లీ మీటింగ్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. మహబూబ్ నగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం సమావేశం నిర్వహించారు. మహబూబ్ నగర్ జిల్లాపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జిల్లాల్లో కొత్త రూట్‌లలో బస్సులు కావాలని, విద్యార్థుల కాలేజీ సమయానికి బస్సులు నడపాలని సూచించారు. మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయం వద్ద శాశ్వత పరిష్కారంగా బస్ స్టేషన్ నిర్మించాలని కోరారు. వచ్చే వారం రోజుల్లో మహిళా సమైక్య సంఘాల నుండి 350 బస్సులు ప్రారంభం అవుతున్నాయని, మహబూబ్ నగర్ జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున బస్సులు కేటాయిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

### బిసి పద్దుపై బిఆర్ఎస్ ఆరోపణలకు

# మంత్రుల కౌంటర్

- **బిజెపికి భయపడే బిఆర్ఎస్ బిసి పోరాటంలో కలిసిరాలేదు: మంత్రి శ్రీధర్‌బాబు**
- **దేశానికే ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలు: మంత్రి వాకిటి**

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** శాసనసభలో బిసి పద్దుపై చర్చ సందర్భంగా మాజి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రులు ధీటుగా కౌంటర్ ఇచ్చారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఢిల్లి జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేసినా రాహుల్ గాంధి ఎందుకు హాజరుకాలేదని తలసాని పదే పదే అధికార పక్షాన్ని ప్రశ్నించడంతో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, వాకిటి శ్రీహరి తమదైన శైలిలో స్పందిస్తూ ధీటుగా జవాబిచ్చారు.

**తప్పును సరిచేయాలని ధైర్యంగా ముందు కొచ్చిన నేత రాహుల్‌గాంధీ: శ్రీధర్‌బాబు**

బలహీనవర్గాల పక్షాన నిలడ్డ వ్యక్తి, తప్పును సరిచేయాలని ధైర్యంతో ముందుకొచ్చిన నేత రాహుల్‌గాంధీ అని శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శాసనసభలో గురువారం బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకు కలిసి పోరాటం చేయాలనుకుంటే ప్రభుత్వంతో కలిసి రావాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ల విషయంలో తాము ఢిల్లీలో పోరాటం చేస్తుంటే బిజిపికి భయపడే బిఆర్ఎస్ కలిసి రాలేదని విమర్శించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేశాం.. ఇంకా చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. డెడికేషన్ కమిటీని ఏర్పాటు చేసి కోర్టు తీర్పుకు అనుగుణంగా ఒక ప్రయత్నం చేశామన్నారు. గతంలో రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా బిసి రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తామని చెప్పారని, అందుకనుగుణంగా అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని, ఇకపైనా చేస్తూనే ఉంటుందన్నారు. తెలంగాణ అసెంబ్లి బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం చేసిన తీర్మాణంతో ఎన్డియె కూటమి సభ్యులు సైతం రాష్ట్రపతి వద్దకు వెళ్లి బిసి రిడర్వేషన్ల అంశంపై ప్రయత్నం చేసేలా చేశామన్నారు. బిసిల రిజర్వేషన్లపై తమ చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని బిఆర్ఎస్ పక్షానికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు.

**దేశానికే ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలు: మంత్రి వాకిటి శ్రీహరి**

బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎస్సి ఎస్టిలతోపాటు బిసిల హక్కులను కాపాడాల్సి ఉండేదని, ఈ విషయంలో కొంత నిర్లక్ష్యం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ధైర్యం చెప్పారని, దాంతో బిసిలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లి తీర్మాణం చేసి ఓ అడుగు ముందుకు వేసిందన్నారు. జిత్నా హావాదీ రహెతో ఉత్నా ఇస్సా మిల్‌నా అని రాహుల్‌గాంధి బిసి రిజర్వేషన్ల కోసం పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఈ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చదని తెలిసి కూడా ఓ ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. బిఆర్ఎస్ కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విషయంలో కలిసిరావాలని పిలుపునిచ్చారు.

**బిసిల కోసం చేసి ప్రయత్నాన్ని తిట్టడం సరికాదు: మంత్రి సీతక్క**

జిత్నా హావాది.. ఇత్నా ఇస్సేదారి అని పిలుపు నివ్వడం ద్వారా బిసిల రిజర్వేషన్ల కోసం 75ఏళ్లలో ఏ రాజకీయ నేత చేయని పనిని రాహుల్ గాంధి చేశారని మంత్రి సీతక్క కొనియాడారు. కేంద్రంలో బిసి నేత మోది ప్రధానిగా ఉన్న నేపథ్యంలో ఆయన బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై సానుకూలంగా స్పందిస్తారని భావించి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బడుగులకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లి తీర్మాణం చేసిందన్నారు. అంతేకాని బిసిలను మోసం చేయాలని కాదని మాజి మంత్రి తలసానికి కౌంటర్ ఇచ్చారు. ప్రాంతీయ పార్టీ అయిన బిఆర్ఎస్ మాత్రం మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తీర్మాణం చేసి కేంద్రానికి పంపించి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన పనిని కూడా తిట్టడం సరికాదని మాజి మంత్రి తలసానిని ఉద్దేశించి అన్నారు.

## చిన్నారులకు నాణ్యమైన విద్య.. పోషకాహారం

### ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సిఎం రేవంత్ రెడ్డి సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష

**హైదరాబాద్, మార్చి26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం భేటీ అయ్యారు. రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0-10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం.. విద్యాభ్యాసన స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను ఆయన సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సెర్ప్ సీఈవో దివ్య, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు

### డబుల్ బెడ్ రూం నివాసాలలో షాపుల అమ్మకాలను

## ఉపసంహరించుకోవాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ధర్నాచౌక్, మార్చి 26, ప్రభాతవార్త:** పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం సముదాయాల్లోని వాణిజ్య షాపుల అమ్మకాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో డబుల్ బెడ్ రూం వాసులతో కలసి సీపీఎం నేతలు ధర్నా నిర్వహించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో నిర్మించిన 16 డబుల్ బెడ్ రూం కాలనీలలో 992 వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయిం చటానికి మార్చి నెలాఖరు వరకు తగు ఏర్పాట్లు చేయాలని మార్చి 17వ తేదీ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారని, సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. షాపులను వేలం ద్వారా కిరాయికి ఇవ్వాలని, రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి వేలం వ్యవధిని నిర్ణయించాలని, కిరాయి ఇవ్వనివారిని ఖాళీ చేయించవచ్చునని, దీని నిర్వహణ అంతా ప్రజలు ఎన్నుకున్న కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. కిరాయిలు తక్కువ వస్తాయి, షాపులు అమ్మితే ఎక్కువ డబ్బు వస్తుందనే వాదన సరికాదని అన్నారు. డబుల్‌బెడ్‌రూంలలో నివసించే పేదలకు ప్రతినెల లిఫ్ట్, ఇతర మెయింటెనెన్స్ భారం కాకుండా ఉండాలంటే వాణిజ్య దుకాణాలను అమ్మకుండా అద్దెలకు ఇవ్వాలని సూచించారు.

## గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండండి

### కెసిఆర్‌ను కోరిన బిజెపి అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కోరిన బిజెపి అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు కోరారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గజ్వేల్ ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వీడి, అసెంబ్లీ సమావేశాలకు హాజరై పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నా, మీరు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనుల ఒత్తిడి ఉందని భావించాం. కానీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగడం గజ్వేల్ ప్రజలను నిరాశలోకి నెట్టిందన్నారు. అసెంబ్లీలో ప్రజల గొంతుకగా ఉండాల్సిన మీరు సభకు హాజరు కాకపోవడం, బడ్జెట్ సమావేశాలను సైతం పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు.

## మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతికి ఘన నివాళి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26:** మాజీ పార్లమెంట్ సభ్యులు, సీపీఐ జాతీయ నాయకులు బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర సమర యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రజా నాయకుడు, పార్టీలకతీతంగా గౌరవించే గొప్ప వ్యక్తి బొమ్మగాని ధర్మ బిక్షమని జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ధర్మభిక్షం 15వ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముగ్దుంభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మ బిక్షం అన్ని వర్గాల ప్రజలకు ఆత్మీయుడు, ఆయన పెట్టని సంఘాలంటూ లేవని కార్మిక సంఘాలు, గీత కార్మిక సంఘం అనేక సంఘాల ఏర్పాటు చేసి పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చాటి చెప్పిన గొప్ప నాయకుడన్నారు. ఆయన జీవితం ఆదర్శం, వారి ఆశయాల సాధన కోసం అందరం కలిసికట్టుగా ఆయన మార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

**హైదరాబాద్, మార్చి26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడు, జగన్మాత సీతాదేవిని వివాహమాడే పర్వదినముగా శ్రీరామనవమిని జరుపుకుంటారని కేసీఆర్ తెలిపారు.భారతీయ సాంస్కృతిక సామాజిక కుటుంబ జీవన గమనంలో, సంప్రదాయాలు విలువలకు, ధర్మానికి ప్రాధాన్యతనిస్తూ సాగిన శ్రీ సీతారాముల భార్యాభర్తల బంధానికి, హిందూ మత సాంప్రదాయంలో పవిత్రమైన స్థానం ఉన్నదని కేసీఆర్ అన్నారు.పలు కష్టాలు త్యాగాలతో కాలపరీక్షలను నెగ్గి నిలిచిన సీతారాముల ప్రేమ బంధం అజరామరం, ఆదర్శనీయం అని కేసీఆర్ తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లేలా, ప్రజలంతా సుఖ శాంతులతో జీవించేలా, శ్రీ సీతారాముల చల్లని దీవెనలు రాష్ట్ర ప్రజలకు అందాలని కేసీఆర్ ప్రార్థించారు.

## కాళేశ్వరంలో భాగంగా గోదావరి జలాల ఎత్తిపోతలు

### నీటిపారుదలశాఖ ఉన్నతాధికారుల సమీక్ష

**హైదరాబాద్, మార్చి 26:** కాళేశ్వరం లింక్-2 కు అనుబంధంగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్ హౌస్‌లో 2,3 మోటార్లను ఆన్‌చేసి అధికారులు నీటిని విడుదల చేశారు. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 6,300 క్యూసెక్కుల నీరు నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నా రు. అదే పరిమాణంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్ హౌస్‌కు జంట సొరంగాల ద్వారా జలాలు తరలి వెళ్తున్నాయి. గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు నీటిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



### 28, 29 తేదీల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల

# క్రీడా పోటీలు

### రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి చాటి చెప్పడానికే శాసనసభ్యుల క్రీడా పోటీలు

### మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026: మంత్రులు జూపల్లి, శ్రీహరి

**హైదరాబాద్, మార్చి 26 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరిలు తెలిపారు. ఈనెల 28,29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు నిర్వహించేందుకు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు సన్నాహక సమావేశం గురువారం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్, యశస్విని రెడ్డి, పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు, భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్‌లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

# బిసి సబ్ ప్లాన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

### ఫీజురీయంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి • సిఎం రేవంత్ రెడ్డికి బీసీ సంఘాల విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 26:** కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేస్తు రాష్ట్ర అసెంబ్లీలో బిల్లుపెట్టి సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజుల రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ సంఘాలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీలో బీసీ ప్రతినిధుల బృందం రేవంత్ రెడ్డిని కలిసి బీసీ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా తాము అధికారంలోకి రాగానే మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ చట్టం చేస్తామని, ప్రతి ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించి ఐదు సంవత్సరాలకుగాను లక్ష కోట్లు బీసీల అభివృద్ధికి ఖర్చు చేస్తామని, ఎసీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా ర్యాంకుతో నిమిత్తం లేకుండా పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టంగా హామీ ఇచ్చారని ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ సీఎంకు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడవసారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బీసీలకు ఇచ్చిన హామీ అమలు కావడం లేదని, బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కనీసం కసరత్తు చేయడం లేదన్నారు. బీసీ సంక్షేమానికి మొదటి సంవత్సరం రూ. 9200 కోట్లు, రెండవ సంవత్సరం రూ.11405 కోట్లు, ప్రస్తుత బడ్జెట్లో రూ.12511 కోట్లు కేటాయించారన్నారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్లో 3.8 శాతం మాత్రమే నిధులు కేటాయించి ఇందులో ఖర్చు చేసింది కేవలం 1 శాతం లోపు మాత్రమేనన్నారు. బీసీ, ఎంబీసీ, సంచార జాతుల ఫెడరేషన్, బీసీ కులాల ఫెడరేషన్‌లకు అడపదడపా నిధులు కేటాయించినప్ప టికీ వాటిని ఖర్చు చేయకుండా బీసీ కులాల అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగడం లేదన్నారు. బీసీ కులవృత్తుల ఆధునికరణ కోసం స్వయం ఉపాధి పథకాలను అమలు చేయాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు గత ప్రభుత్వం పెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో రెండు సంవత్సరాలుగా ఫీజులు విడుదల చేయకపోవడతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో రాష్ట్రంలోని 22 లక్షల మంది పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, తక్షణమే ఫీజుల బకాయిలను చెల్లించాలన్నారు. ఎస్సీ ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా సబ్ ప్లాన్ తీసుకువస్తూ ఈ అసెంబ్లీ సమావేశాలలోనే చట్టం చేయాలన్నారు. బీసీల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం రూ.20000 కోట్లకు పెంచి కేటాయించిన మొత్తం ఖర్చు చేయాలన్నారు. ర్యాంకులతో నిమిత్తం లేకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలన్నారు.

### ఎన్ఐఎను ఉపసంహరించుకుని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

# గాదె ఇన్నయ్యను తక్షణమే విడుదల చేయాలి

### పౌర హక్కుల సంఘాల నాయకులు డిమాండ్

**సైఫాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** ఎన్ఐఎ (జాతీయ దర్యాప్తు సంస్థ) తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ దర్యాప్తు పేరిట మేధావులను, కవులు, రచయితలను, ప్రజా సంఘాల నాయకులను వేధింపులకు గురిచేస్తున్నదని, తక్షణమే దీన్ని ఉపసంహరించుకుని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 2018 నుంచి మొదలు పెట్టిన ఈ వేదింపుల పరంపర దేశవ్యాప్తంగా నిరాటంకంగా కొనసాగుతున్నదని, ఇది రాజకీయ కక్ష సాధింపుగా కొనసాగుతున్నదని నాయకులు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు తదితరులతో కలిసి మాట్లాడుతూ గత ఏడాది మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి, ఖాతా రామచంద్రారెడ్డిని ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో కాల్చిచంవడం జరిగిందని ఆరోపించారు. ఖాతా రామచంద్రారెడ్డి సొంత ఊరైన పెద్దపల్లి జిల్లా తీగల కుంటుపల్లిలో అంత్యక్రియలు గత ఏడాది అక్టోబరు 18న జరిగాయని, ఈ అంత్యక్రియలకు వేలాది మంది గ్రామస్తులతో పాటు కవులు, కళాకారులు, మేధావులు, మిత్రులు, బంధువులు, రచయితలు హైజరైనార ని చెప్పారు. అలాగే సామాజిక వేత్త గాదె ఇన్నయ్య కూడా హాజరైనారని రామచంద్రారెడ్డి పురుగుల పడిన భౌతికకాయాన్ని చూసి భావోద్రేకంగా ప్రసంగించడం జరిగిందని వారు వివరించారు. దీంతో ఇన్నయ్య ప్రసంగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, మావోస్టు పార్టీకి అనుకూలంగా ఉందని, ఆయనపై ఎన్ఐఎ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఉపా కేసు నమోదు చేసి జైలులో నిర్బంధించారని ఆరోపించారు. అలాగే ఎన్ఐఎ రాష్ట్రంలోని అనేక మంది మేధావులకు నోటీస్‌లు పంపిందని ఆరోపించారు. తక్షణమే గాదె ఇన్నయ్యను విడుదల చేయాలని, ఇన్నయ్యకు పంపిన నోటీస్‌ను ఉపసంహరించుకోవాలని, భావ వ్యక్తీకరణ, వ్యక్తి స్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛను కాపాడాలని, తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, ఢిల్లీలో విద్యార్థులపైన పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# తిరుమల సమాచారం

## నేడు శ్రీరామ నవమి ఆస్థానం



తిరుమల, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో శ్రీరామ నవమి ఆస్థానం నేడు వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా నేటి సాయంత్రం హనుమంత వాహన సేవ, రాత్రి 9-10 గంటల మధ్య బంగారు వాకిలిలో ఆస్థానం నిర్వహిస్తారు. మరుసటి రోజు సీతారాముల పట్టాభిషేక ఆస్థానం ఉంటుంది. ఇది చైత్ర శుద్ధ నవమి నాడు జరుపుకునే ప్రధాన ఉత్సవం. దీనికి ముందు సాయంత్రం 6.30 నుండి 8 గంటల వరకు హనుమంత వాహన సేవ తిరుమలలో నిర్వహిస్తారు. ఆస్థానం సందర్భంగా వేదపండితులు శ్రీమద్రామాయణంలోని శ్రీరామ జనన ఘట్టాన్ని స్వామివారి సన్నిధిలో పఠిస్తారు.
పట్టాభిషేక ఆస్థానం: శ్రీరామనవమి మరుసటిరోజు శనివారం రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు తిరుమల ఆలయంలో పట్టాభిషేక ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీమద్రామాయణంలోని శ్రీరామచంద్రుని పట్టాభిషేక ఘట్టాన్ని స్వామివారి సన్నిధిలో పఠిస్తారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగసుందరంగా ఫల, పుష్పాలతో, వివిధ రకాల కూరగాయలతో అలంకరిస్తారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



తిరుమల, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. భూరీ విరాళాలిస్తున్న దాతలు పలు ట్రస్ట్‌లకు ఇస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ది చెన్నై షాపింగ్ మాల్ అధినేత మర్రి వెంకటరెడ్డి, మర్రి రిటైల్ లిమిటెడ్ సంస్థ పేరిట టిటిడి శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడుకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు.





## టిటిడి ట్రస్ట్‌లకు రూ.60 లక్షలు విరాళం

తిరుమల, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పథకాలకు పలువురు దాతలు విరాళాలిచ్చారు. గురువారం ఉదయం పలువురు దాతలు తమవంతుగా విరాళాలను వివిధ పథకాలకు అందించారు. వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు పలువురు దాతలు రూ.60 లక్షలు విరాళంగా అందజేశారు. చెన్నైకు చెందిన రేవతి విశ్వనాథ్ రూ.40 లక్షలు విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన వి.శ్రీ భవేశ్ చౌదరి రూ.10,07,777 విరాళంగా అందించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పొనకల నాగేంద్ర రావు రూ.10 లక్షలు విరాళం డిడిలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.



## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

తిరుమల, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి తెలియకుండా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాత విరాళమిచ్చారు. గురువారం ఉదయంటిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి హైదరాబాద్‌కు చెందిన లియాన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత కంది ఆశోక్ కుమార్ విరాళం అందజేశారు.



## తిరుమలలో 30 నుండి శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

తిరుమల, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుండి ఏప్రిల్ 1 తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. మార్చి 30వ తేదీన ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు.
రెండవరోజు మార్చి 31న శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు.
చివరిరోజు ఏప్రిల్ 01న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి "వసంతోత్సవ"మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో మార్చి 30 నుండి ఏప్రిల్ 01వ తేదీ వరకు మూడురోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను, మార్చి 31న అష్టదళ పాద పద్మారాధన సేవను టిటిడి రద్దు చేసింది.

# బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

● బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష అందజేత ● వైకాపా జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మార్కాపురం ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జెడ్పీ ఛైర్మన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్, మార్చి 25, ప్రభాతవార్త: మార్కాపురం వద్ద గురువారం తెల్లవారుఝామున జరిగిన రోడ్డు ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వైకాపా జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాదం సంఘటన తెలుసుకున్న వెంటనే ఆయన మార్కాపురం చేరుకుని ప్రమాద ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. మృతులకు సంతాపం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. కర్నూలులో, మార్కాపురంలో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఈ ప్రమాదాల్లో గాయపడి కోలుకోలేని కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. మార్కాపురం వైద్యశాలలో సరియైన సౌకర్యాలు లేకపోవడంతో 20 మందికి పైగా క్షతగాత్రులను ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు. అదే మార్కాపురంలో మెడికల్ కళాశాల ఉంటే ఇటువంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. దూరదృష్టితోనే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వం వాటిని పట్టించుకోలేదన్నారు. మార్కాపురం వైద్యశాలలో అన్ని సౌకర్యా లుంటే క్షతగాత్రులను తరలించే పరిస్థితి ఉండేది కాదని ఆయన స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షల చొప్పున పరిహారం అందజేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. గాయ పడిన వారికి కూడా మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ప్రభుత్వం సహాయమందించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం గట్టిచర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, మైనార్టీ నాయకులు షంషీర్ అలీబేగ్ పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి



విజయవాడ, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో టిప్పర్, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదకరమని వైయస్ జగన్ అన్నారు. ఈ దారుణ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదం అత్యంత విషాదకరమైందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన అన్ని విధాల సహాయం అందించాలని కోరారు. గాయపడిన వారిని సమీపంలోని మెరుగైన ఆసుపత్రులకు తరలించి, ప్రత్యేక వైద్య బృందాలతో చికిత్స అందించాలన్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటన రాష్ట్రాన్ని కలిచివేసిందని, ఇలాంటి దుర్ఘటనలు ఇకపై జరగకుండా చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని వైయస్ జగన్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# రాజధాని అమరావతిపై సమగ్ర విధానం రూపొందించాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్



విజయవాడ, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేయటం కోసం ఈనెల 28వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశం జరుగుతున్న సందర్భంగా రాజధానిపై సమగ్ర విధానం రూపొందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని రాజధానికి చట్టబద్ధత కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆలస్యమైంది. కేంద్రం ఇప్పటికే 12 సంవత్సరాలు జాప్యం చేసింది. ఇప్పుడైనా తీర్మానం అవసరమే. 2014లో రాజధానిపై ప్రత్యేకంగా కేంద్రీకరించినా ఒక్క అడుగు కూడా ముందుకు కదలని కారణంగా చివరకు దాని అస్తిత్వమే ప్రమాదంలో పడిన అనుభవం నుండి రాష్ట్ర ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలి. ఆచరణ సాధ్యం కాని మెగా ప్రాజెక్టులు, మాస్టర్ ప్లాన్లు చేపట్టి చివరికి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడం, ఆ భారాన్నంతా ప్రజలపై మోపటం సమ్మతం కాదు. రాష్ట్ర విభజన అనంతరం రాజధానిని నిర్మించే బాధ్యత కేంద్రంపై ఉన్నది. కానీ కేంద్రం ఆ బాధ్యత నుండి తప్పుకొని అప్పులు ఇప్పించేందుకు మాత్రమే పరిమితమవుతున్నది. అందువల్ల అసెంబ్లీలో ప్రత్యేక నిధుల కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. అలాగే గతంలో అసెంబ్లీ ఆమోదించిన 29 గ్రామాలనే క్యాపిటల్‌గా వేగంగా ఒకే దశలో రాజధానిని నిర్మించాలి. దాన్నే రాజధానిగా చట్టబద్ధం చేయాలి. అమరావతి చుట్టూ అభివృద్ధి అయ్యే మిగతా ప్రాజెక్టులన్నీ రాజధాని చట్ట పరిధి నుంచి విడగొట్టాలి. ఇప్పటికే భూ సమీకరణ కింద రైతుల నుండి తీసుకున్న భూములన్నిటికీ చట్ట ప్రకారం ప్లాట్లు, పెన్షన్లు, ఇతర వాగ్దానాలు అమలు చేయడంపై కేంద్రీకరించాలి. ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ శాసనసభ్యులు కూడా ఈ అసెంబ్లీ సమావేశాలకు హాజరై గతంలో తాము చేసిన పొరపాటును దిద్దుకొని ఈ తీర్మానాన్ని బలపరచాలని సిపిఎం కోరుతున్నదన్నారు. అమరావతి అభివృద్ధితోపాటు రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యతగా నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలి. విభజన చట్టంలోని హామీలన్నీ త్వరితగతిన అమలు చేయాలి. అందుకు అవసరమైన నిధులన్నీ కేంద్ర ప్రభుత్వం భరించాలని అనే అంశాలను అమరావతికి చట్టబద్ధత కోసం చేసే తీర్మానంలో పరిగణనలోనికి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి చేసింది.

# ఇంటర్ సెకండియర్ కొత్త సిలబస్ లీక్ కేసు నమోదు

విజయవాడ, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్ సెకండ్ ఇయర్ కొత్త సిలబస్ లీక్ వ్యవహారంలో కేసు నమోదైంది. తెలుగు సంస్కృత అకాడమీ డిప్యూటీ డైరక్టర్ కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్‌లో ప్రభుత్వం కొత్త సిలబస్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. తెలుగు అకాడమీ, ఇంటర్ బోర్డు నుంచి సిలబస్ విడుదల చేయకముందే సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులో న్యూ సిలబస్ పిడిఎఫ్ క్లిప్పింగ్స్ ప్రత్యక్షమయ్యాయి. కొత్తగా ప్రవేశపెడుతున్న సెకండ్ ఇయర్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ సిలబస్ లీక్ అవడంపై విజిఎస్ పబ్లిషర్స్‌కు తెలుగు అకాడమీ నోటీసులు ఇచ్చింది. కొత్త సిలబస్ బుక్స్ ప్రింటింగ్‌కు ముందే కెమిస్ట్రీ, ఫిజిక్స్ సిలబస్ పిడిఎఫ్‌లు లీకయినట్లు గుర్తించింది. దీంతో తెలుగు, సంస్కృత అకాడమీ డిప్యూటి డైరక్టర్ కంప్లైంట్ చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పాఠ్యపుస్తకాలు ముద్రించకముందే పిడిఎఫ్‌లు సామాజిక మాధ్యమాల్లో రావడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. విజిఎస్‌కు ఇచ్చిన వర్క్ఆర్డర్‌ను రద్దు చేయాలని తెలుగు, సంస్కృత అకాడమీ డైరెక్టర్ రంజిత్ బాషాను ఆదేశించింది. విజిఎస్ వద్ద నుంచే పిడిఎఫ్‌లు లీకైనట్లు తేలడంతో ఆ సంస్థపై క్రిమినల్ కేసు పెట్టాలని పేర్కొంది.



ఒంగోలుకు తరలించిన క్షతగాత్రులను పరామర్శించి భరోసా ఇస్తున్న జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం

## ఒంగోలు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి

ఒంగోలు, మార్చి 25, ప్రభాతవార్త ప్రతినిధి: మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని ఒంగోలు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి భరోసా ఇచ్చారు. మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల నుంచి మెరుగైన వైద్య సేవల కోసం ఒంగోలు జిల్లా వైద్యశాలకు తరలించిన క్షతగాత్రులను జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు పూర్తిగా కోలుకునేవరకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలందిస్తుందన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ దుర్ఘటన బాధాకరమని మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు చేపట్టిందన్నారు. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునేవరకు ప్రభుత్వం సహాయమందిస్తుందన్నారు. బాధితులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అందరూ త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మి ప్రసన్న, జిల్లా అధికారులు ఉన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముమ్మర వాహన తనిఖీలు

విజయవాడ, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నివారించడం, అక్రమ రవాణాను అడ్డుకోవడం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఆదేశాల మేరకు జరుగుతున్న తనిఖీల సందర్భంగా అన్ని రకాల వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్.సి, పొల్యూషన్ మరియు ఇన్సూరెన్స్ వంటి కీలక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై, ముఖ్యంగా హెల్మెట్ ధరించని వాహనదారులపై భారీగా చలాన్లు విధించారు.
మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, వారి వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన కేసులు నమోదు చేశారు. గంజాయి, మద్యం మరియు ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా జరగకుండా వాహనాల డిక్కీలను, అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేశారు. ప్రజల రక్షణే పోలీసుల ప్రాధాన్యత అని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ గారు కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# వేసవి సెలవుల్లోనే ప్రణాళికలు!

● తక్కువ సమయంలోనే గోవిందుని దర్శనభాగ్యం ● ఏఐ అమలులో వేగంగా అడుగులు





తిరుమల, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: "ఏడుకొండల వాడా గోవిందా... ఆపదమొక్కులవాడా గోవిందా.. నామంతో తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది సామాన్యభక్తులకు తక్కువ సమయంలో సంతృప్తికరంగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ విషయంగా ఇప్పటికే భక్తుల నుండి ముఖాముఖిగా సిఎం చంద్రబాబునాయుడుకు విన్నవించిన మేరకు త్వరలోనే ఈ దిశగా అడుగులేయనున్నారు . టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సారథ్యంలోని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, పాలకమండలి ఏఐ(కృత్రిమ మేధ) టెక్నాలజీ అమలు చేస్తున్నారు. ఈవిధానంలో తొలుత భక్తుడి ముఖగుర్తింపు రికార్డు చేసిన తరువాత ఓ కియోస్క్ నుండి బార్‌కోడ్ రశీదు టోకెన్ వస్తుంది. అందులో భక్తుడి వివరాలు, దర్శనం సమయం ఉంటుంది. నిర్దేశిత సమయానికి భక్తులు క్యూలైన్‌లో ప్రవేశిస్తే ముఖ గుర్తింపు ఆధారంగా స్వయంచాలికమైన (ఆటోమేటిక్‌గా) గేటు తెరచుకుంటుంది. ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలన చేసిన టిటిడి ఇప్పుడు సిఎం సూచనలతో మరింత త్వరగా అమలుచేయనుంది. సామాన్యభక్తులకు వీలైనంత వరకు ఐదారుగంటల్లోనే ఆ దేవదేవుని దర్శనం చేయించాలని అధికారుల ఆలోచన. సాధారణ రోజుల్లోనే తిరుమలకు 90వేలమంది వరకు భక్తులు వస్తున్నారు. వీరిలో 40వేల మందిపైగా భక్తులు ఆన్‌లైన్‌లో దర్శనాలు, ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు, కాలినడక భక్తులు ఇలా ఉన్నారు. వీరంతా నిర్దేశిత సమయానికి క్యూలైన్లోకి ప్రవేశిస్తే నాలుగుగంటల్లోపే ఆనందనిలయంలోనికి చేరుకుని ఏ దివ్యమంగళరూపాన్ని దర్శించుకుంటున్నారు. భక్తులు మహాలఘులో ఆ శ్రీవారిని సంతృప్తికరంగా దర్శనం చేసుకుంటుండటం విశేషం. ఆలయంలోపల కూడా భక్తులను లాగడం గానీ, ముందుకు తోయడంగానీ అలాంటి రగడ లేదు. రోజువారీగా మరింత సంతోషంగా స్వామివారిని చూసుకునేలా తిరుమల తిరుపతి దేవస్థానమ్ పాలకమండలి చూస్తోంది. ఆలయంలోపల టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. సామాన్యభక్తులకు మెరుగైన సౌకర్యాలు, సంతోషకర దర్శనం చేయించడంలో పాలకమండలి, అధఇకారులు సఫలీకృతులయ్యారు. భక్తులు సంతోషంగా, తృప్తిగా అన్నప్రసాదాలు స్వీకరించేలా తయారీ విధానంలో నాణ్యతకు ప్రాధాన్యతనిచ్చారు.
ఇక రానున్న రోజుల్లో ఇష్టదైవమ్ శ్రీవారిని సామాన్యభక్తులు వీలైనంత సులభంగా, సంతోషంగా చేసుకునేలా చూడాలనేది అధికారుల యాక్షన్ ప్లాన్. క్యూలైన్లలో సామాన్యభక్తులకు కనీస సౌకర్యాలు మెరుగుపరచి, క్యూలైన్లలో నిరంతరాయంగా నాణ్యతతో కూడిన అన్నప్రసాదాలు, పాలు, టీ, తాగునీరు అందించేలా చూస్తున్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ దేశం నలుమూలల రాష్ట్రాల నుండి వచ్చే స్వామివారి సేవకులకు ఏమేరకు సంతోష దర్శనమ్ చేయించగలుగుతామనే దిశగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలోచన చేస్తున్నారు. భక్తుల్లో తాను సేవకుడిగా పనిచేస్తానని ఆయన పనితీరు మారింది.

### ప్రేమ వివాహం... భర్తతో ఇష్టపూర్వకంగా జీవించడం

# అక్రమ నిర్బంధం కిందకు రాదు

## హైకోర్టు విస్పష్ట తీర్పు




విజయవాడ, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రేమ వివాహం చేసుకుని భర్తతో ఇష్ట పూర్వకంగా జీవించడం అక్రమ నిర్బంధం కిందకు రాదని హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మేజరయిన యువతికి ఎవరితో ఉండాలో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి విషయాల్లో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసినా వర్తించదని తేల్చిచెప్పింది. తమ కుమార్తెను ఓ వ్యక్తి అక్రమంగా నిర్బంధించారని తల్లిదండ్రులు కోర్టులో నివేదించారు. ఆ యువతిని కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఎవరితో ఉండాలో నిర్ణయం తీసుకునే హక్కు ఆ యువతికి ఉంటుందని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తుహిన్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన బి.ఆనందబాబు కూలి పనులు చెసుకునే వారు. ఆయనకు ఇంజనీరింగ్ రెండో ఏడాది చదువుతున్న ఓ కుమార్తె ఉంది. తమ కుమార్తెను అక్రమంగా తమ అనుమతి లేకుండా నిర్బంధించాడంటూ పల్నాడు జిల్లా యడ్లపాడు మండలానికి చెందిన ఓ యువతి తల్లిదండ్రులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఆ యువతిని కోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించింది. దీంతో పోలీసులు ఆ యువతిని కోర్టులో హాజరుపరిచారు. ఈ విషయంపై యువతిని వివరాలు అడగగా తాను మేజర్ అని తెలిపింది. తన తల్లిదండ్రులు కోర్డులో వేసిన పిటిషన్ ఆధారంగా న్యాయవాదులు పలు ప్రశ్నలు వేశారు ఆనంద్‌బాబు అనే వ్యక్తి తనను బలవంతంగా తీసుకువెళ్లిపోయారా అని ప్రశ్నించారు. దానికి ఆ యువతి లేదని సమాధానం ఇచ్చింది. ఆనందబాబుతో తాను ప్రేమలో ఉన్నందున కలిసి జీవించాలి నిర్ణయించుకున్నానని యువతి స్పష్టం చేసింది. అందుకోసం అతన్ని పెళ్లి చేసుకోడానికి ఇష్టపూర్వకంగా తానే వెళ్లానన్నారు. ఇద్దరమూ చర్చిలో పెళ్లి చేసుకున్నామన్నారు. తాను పూర్తిగా ఇష్టపడే ఆనందబాబుతో జీవిస్తున్నానని తెలిపింది. యువతి సమాధానాలు విన్న తల్లిదండ్రులు కుమార్తెతో మాట్లాడాలని భావించారు. దాంతో కోర్డు అనుమతి తీసుకుని కుమార్తెతో మాట్లాడారు. అయినా యువతి తన భర్తతో జీవించాలనే నిర్ణయం తీసుకున్నట్లు కోర్డుకు నివేదించింది. అయితే యువతి మైనర్‌గా ఉన్నప్పుడు ఆనందబాబు గర్భవతిని చేశాడని, అలా జరిగిన వెంటనే ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇరువురి నుంచి వాదనలు విన్న ధర్మాసనం తన తుది నిర్ణయాన్ని వెల్లడించింది. ఎవరితో కలిసి ఉండాలనే నిర్ణయం మేజర్ అయిన యువతికి తీసుకునే హక్కు ఉంటుందని, దానిని ఎవరూ తప్పుబట్టేందుకు లేదని కోర్టు తన నిర్ణయాన్ని వెల్లడించింది. అలానే ఇలాంటి విషయాల్లో హెబియస్ కార్పస్ పిటిషన్ పని చేయదని తేల్చి చెప్పింది. యువతి మైనర్‌గా ఉన్నప్పుడు జరిగిన విషయంపై అభ్యంతరం ఉంటే చట్టప్రకారం ఇతర మార్గాలను అనుసరించాలని సూచించింది. అలాగే యువతి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది.

## సద్గుణ సంపన్నుడు 'శ్రీరాముడు'



సకల గుణాభిరాముడు
సద్గుణ సంపన్నుడు
సత్యధర్మ పరాయణుడు
పితృ వాక్య పరిపాలకుడు
నేటి తరానికి ఆదర్శనీయుడు
శ్రీ రామచంద్రుడు !
ఆయన జన్మదినం
లోకానికి పర్వదినం
సీతారాముల కళ్యాణం
కమనీయం , రమణీయం
సర్వ జనులకు ఆనందదాయకం !
శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకల్లో
మనం భాగస్వాములవుదాం
సకల శుభాలను పొందుదాం !

- కాయల నాగేంద్ర.

## నవమి రుచులు

### పానకం



కావలసిన పదార్థాలు : ..
బెల్లం–3 కప్పులు, మిరియాల పొడి–3 టీ స్పూన్లు ఉప్పు–చిటికెడు, శొంఠిపొడి–టీ స్పూన్, నిమ్మరసం– మూడు టీ స్పూన్లు, నీరు : 9 కప్పులు.

తయారీ విధానం : ముందు బెల్లాన్ని మెత్తగా కొట్టుకుని, నీళ్లలో కలుపుకోవాలి. బెల్లం మొత్తం కరిగాక పలుచని క్లాత్‌లో వడ కట్టాలి. ఇందులో మిరియాల పొడి, శొంఠి పొడి, ఉప్పు, యాలకుల పొడి, నిమ్మరసం వేసి బాగా కలపాలి. అంతే పానకం సిద్ధమైనట్లే.

### వడ పప్పు



కావలసిన పదార్థాలు :
పెసరపప్పు– కప్పు కీరా– ఒక ముక్క, పచ్చిమిర్చి–1 (తరగాలి), కొత్తిమీర తరుగు –టీ స్పూన్, కొబ్బరి తురుము– టేబుల్ స్పూన్ ఉప్పు–తగినంత.

తయారీ విధానం : పెసరపప్పును నాలుగు గంటలు నీళ్లలో నానబెట్టాలి. నీటిని వడకట్టేసి, పప్పు ఒక గిన్నెలో వేయాలి. దాంట్లో కీరా తరుగు, పచ్చిమిర్చి కొత్తిమీర, కొబ్బరి, ఉప్పు వేసి కలిపితే వడపప్పు రెడీ అయినట్లే ఈ ప్రసాదాలను స్వామి వారికి నివేదన చేసి భక్తులకు వితరణ చేయాలి.

### మామిడికాయ పులిహోర ..



కావలసినవి : బియ్యం–రెండు కప్పులు, పచ్చిమామిడికాయ–ఒకటి, నూనె–రెండు టేబుల్ స్పూన్లు, ఆవాలు– ఒక టీస్పూన్, ఇంగువ– చిటికెడు, ఎండుమిర్చి–ఒకటి, మిన పప్పు–ఒక టీస్పూన్, శనగ పప్పు–ఒక టేబుల్‌స్పూన్, పచ్చిమిర్చి–రెండు, ఉప్పు–రుచికి తగినంత, పసుపు–చిటికెడు, కరివేపాకు– రెండు రెమ్మలు, వేరుశనగలు– ఒక టేబుల్‌స్పూన్.

తయారీ విధానం : ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అన్నం వండుకోవాలి. తరువాత ఒక వెడల్పాటి ప్లేట్‌లోకి తీసుకుని చల్లార బెట్టుకోవాలి. ఒక బౌల్‌లో మామిడికాయ తురుము తీసుకుని కొద్దిగా పసుపు, కొద్దిగా ఉప్పు కలిపి పక్కన పెట్టు కోవాలి. స్టవ్‌పై పాన్ పెట్టి కొద్దిగా నూనె పోసి వేడి అయ్యాక ఆవాలు. ఎండు మిర్చి వేయాలి. తరువాత ఇంగువ, మినపప్పు, శనగపప్పు, వేరుశనగలు, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఈ పోపు అన్నంలో కలుపుకోవలి. తరువాత మామిడికాయ తురుము వేసి కలియబెట్టుకోవాలి. రుచికి తగిన ఉప్పు వేసుకుని వడ్డించుకోవాలి. □

## శ్రీ సీతారాముల కళ్యాణం

మన భారతీయ సంప్రదాయంలో పండుగలకు పెట్టింది పేరు. మనం చేసుకునే ప్రతి పండుగ ఎంతో విశిష్టతను, వైవిధ్యాన్ని సంతరించుకొని అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. మనం ఈ పండుగల్ని వందలు వేల ఏళ్ల తరబడిగా జరుపుకుంటున్నా కూడా ఈ రోజుకి ఏదో ఒక కొత్తదనాన్ని సంతరించుకుంటున్నాయి. కొన్ని పండగలయితే ఊరు వాడ ఏకమై ఒకటిగా కలిసి మెలిసి చేసుకుంటారు. అటువంటి గొప్ప పండుగలో 'శ్రీరామనవమి' అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

శ్రీరామనవమిని రాములు వారి పుట్టినరోజుగా, కళ్యాణం జరిగిన రోజుగా, అలాగే పట్టాభిషేకం జరిగిన రోజుగా ఈ రోజు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. అయోధ్య రాజైన దశరథుడు, రాణి కౌసల్యలు జరిపిన పుత్రకామేష్ఠి యజ్ఞ ఫలితంగా శ్రీరాముడు జన్మించాడు. 'వేదవేద్య పరేపుంసి దశరదరాత్మజే!/ వేదఃప్రాచేత ప్రాదా సీత్ సాక్షాత్ రామాయణాత్మనాః!/ వేదములచే తెలుపబడినవాడు ఉత్తమ పురుషుడు అయినటువంటి దశావతారంలో ఏడవ అవతారమైన సాక్షాత్ శ్రీ మహా విష్ణువే వసంత ఋతువులో చైత్ర శుద్ధ నవమి గురువారంనాడు పునర్వసు నక్షత్ర కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ మూహూర్తంలో త్రేతా యుగంలో విళంబి నామ సంవత్సరంలో ఈ పుణ్య పుడమిలో జన్మించాడు. వేదం వాల్మీకి నోట రామాయణంగా వెలుబడింది. రామాయణము అంటే సాక్షాత్తు పై శ్లోకం యొక్క అర్థం. ఈ నవమి రోజే శ్రీరామనవమిగా, శ్రీరామ అవతార పుణ్య దినంగా జరుపుకుంటారు. ఇప్పుడు 28వ మహాయుగంలో కలియుగం జరుగుతుంది. అంటే ఇప్పటికి సుమారుగా ఒక కోటి 81 లక్షల 47 వేల సంవత్సరాలకు పూర్వం శ్రీరామ అవతారం జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ శ్రీరామనవమి రాముడు పుట్టినరోజు అయితే ఆ రోజునే సీతారాముల కళ్యాణం ఎందుకు చేస్తారు అంటే వాల్మీకి రామాయణంలో చైత్ర శుక్ల నవమినాడు రాముడు జన్మించాడు అని చెప్పారే తప్ప ఆ రోజు కళ్యాణం జరిగిందని చెప్పలేదు. ఉత్తర పాల్గుణి నక్షత్రంలో కళ్యాణం జరిగినట్లు వాల్మీకి పేర్కొన్నారు. అయితే శ్రీరాముని పుట్టిన రోజున సీతారాముల కళ్యాణం చేయడానికి ఒక కారణం ఉంది. సీతాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి అవతారం. నారాయణుడితోనే లక్ష్మీ అని ఆయనతో పాటే సీతాదేవిగా ఈ భూమి యందు జన్మించి రఘుకుల నందనుడిని పెళ్లి చేసుకుంది. మొదట ఎన్ని కష్టాలు వచ్చినా పతి భక్తే పరమావధిగా ఆయన వెంట అడవులకు నడిచింది. రావణుడి చెరలో కూడా మలినం అంటని జ్వాలాగ్నిలా వెలిగి అపర పతివ్రతగా కీర్తి గడిచింది. తన స్వామి పేరు కోసం నిండు గర్భిణీ అయి కూడా మళ్లీ అరణ్యవాసం చేసిన మహాసాధ్వి ఈ సీతమ్మ తల్లి. అందుకే ఈ లోకంలో రాముని మించిన రాజు లేడు, సీతమ్మను మించిన మహాసాధ్వి లేదు. నేటికీ ఆ దశరథ తనయుని సీతారామునిగా, జానకి రామునిగా వారిరువురిని కలిపి పిలుస్తారు. అందుకే ఈ రోజు రాముల వారి పుట్టినరోజు అయినాకూడా సీతరాముని కలిపే పూజిస్తాము. అందువల్లనే వారికి కల్యాణ వైభవం అంగరంగ వైభవంగా తరాలు మారిన యుగాలు మారిన నేటికీ చేస్తున్నారు. మంచి మానవత్వం అన్నిం టినీ కలగలిపి ఎంతో ఆత్మవిశ్వాసంతో కూడి మానవుడు ఎలా ఉండాలి.



ఉత్తమోత్తమమైన మహా పురుషుడు. ఈ రోజు రాముడి పుట్టినరోజు అయినా మనం సీతారామ కళ్యాణం చేసి లోకకళ్యాణం జరగాలని చెప్పి ఆకాంక్షిస్తుంటాం. ఈ కళ్యాణాన్ని గుళ్ళల్లోనూ, ఇళ్లల్లోనే కాకుండా, వీధుల్లోనూ, నాలుగు రోడ్ల కూడళ్ల లోనూ అన్ని చోట్ల సీతారామ కళ్యాణం చేస్తారు. దీనిని శ్రీరామ నవమి పందిళ్లు అని కూడా అంటారు. ఈ రోజు అందరూ వేకువ జామునే నిద్రలేచి ఇళ్ళు, వాకిళ్ల శుభ్రం చేసుకుని ఆపై తలస్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు.



బంధాలను ఎలా గౌరవించాలి. ఎలా కాపాడుకోవాలి అని ఆచరించి చూపించిన మహనీయుడు. ఇంకా 'సుఖ దుఃఖే సమీకృత్వ లాభా లాభే జయా, జయా' అని సూక్తిని ఆచారణాత్మకంగా నిరూపించిన లోకోత్తర పురుషుడు. దుష్ట శిక్షణ–శిష్ట రక్షణ చెయ్యడానికే కాకుండా తన జీవితాన్ని భావితరాలకు ఆదర్శప్రాయంగా చూపిన యుగపురుషుడు ఈ రఘురాముడు. అయోధ్య రాజ్యానికి రాజుగా పట్టాభిషేకానికి సిద్ధమైన సమయంలో ఎంత సంతోషంగా ఉన్నాడో అదే ముహూర్తంలో అరణ్యానికి వెళ్లాల్సి వచ్చినా అంతే సంతోషంగా ఉన్నాడు ఈ కోదండ రాముడు. తన ధర్మపత్నిని ఎత్తుకెళ్లిన దశకంఠుడైన రావణుడితో ధర్మబద్ధమైన యుద్ధం చేసి తన సతిని తిరిగి తెచ్చుకొని లోక కళ్యాణం చేసిన

సీతారాముల పటాలు లేదా విగ్రహాలని శుభ్రం చేసుకుని పసుపు, కుంకుమ, చందనంతో అలంకరిస్తారు. రాములవారికి జాజిపూలంటే ఎంతో ప్రీతకరం. జాజిపూలతో, మాలతో అలంకరణ చేయాలి. రాములు వారితోపాటూ ఆంజనేయ స్వామి వారి పటాన్ని కూడా అలం కరించి తమలపాకుకి గంధం రాసి పటం దగ్గర పెడితే చాలా మంచిది. ఆపై పిండివంటలు చేస్తారు. ముఖ్యంగా వడపప్పు (పెసరపప్పు), పానకం, చలివిడి చేస్తారు. మన పండుగలు అన్నింటికి కాలాన్ని బట్టి నైవేద్యాలు ఉంటాయి. ఈ నైవేద్యాలన్ని ఆరోగ్యానికి చాలా మంచిది. నైవేద్యాలు తయారు చేసుకున్నాక దీపారాధన చేయాలి. ముందుగా పసుపు వినాయకునికి పూజ చెయ్యాలి. పసుపు గణపతికి చిన్న పుష్పం, అక్షింతలతో పూజ చేసి చిన్న బెల్లం ముక్క నివేదించాలి. ఆపై శ్రీరామ అష్టోత్తరాన్ని, రామరక్షా స్తోత్రాన్ని, శ్రీరామ అష్టకాన్ని చదువు కోవాలి. అలాగే శ్రీరామునికి సంబంధించిన కల్యాణ కథని కూడా చదువు కోవాలి. ఇలా కథ చదువుతూ అక్షింతల్ని వేస్తూ పూజ చెయ్యాలి. ఆపై దేవుడి దగ్గర వేసిన అక్షింతల్ని తలపై వేసుకోవాలి. ఆ తర్వాత నైవేద్యాలు సమర్పిం చాలి. పిల్లలతో 'శ్రీరామ రామ రామేతి/రమే రామే మనోరమే/ సహస్ర నామ తత్తుల్యం/ రామ నామ వరాననే/ అనే మంత్రాన్ని చదివించాలి. చలువ పందిళ్ళలో జరిగే కళ్యాణాన్ని తిలకిస్తే సకల శుభాలు కలుగుతాయి.

- లక్ష్మీ

## వంట–ఫన్‌ట

అరె పాయసంలో కాస్త ఎక్కువైంది. అంతేకదా! దానికే అన్ని మాటలు అనే స్తారా? ఏంటో ఈ ఇంట్లో వాళ్లు. మొన్న కూడా అలాగే, జ్యూస్లో జాపత్రి వేశానని ఒక్కటే గోల. ఏదైతే ఏం, గుటక వేస్తే అదే లోపలికి పోతుందంటే వినరు. అయినా వంట ఎప్పు డూ ఒకేలా ఎందుకు చేయాలి? ఇప్పుడూ... చారులో కరివేపాకు లేదను కోండి, పెరట్లో ఉన్న వేపాకు రెబ్బలు రెండు దూసి వేసేయడమే. కూరలో కారం ఎక్కు వైందను కోండి, దానికి పోటీ పడేలా ఉప్పు కూడా తట్టెడు తగి లిస్తే సరి పోతుంది కదా, దానికి ఎందుకు బెం? అయినా వంట చేయడం కూడా ఒక కళ అంటారు కదా.. అందుకే మొన్న పక్కింటి శశికళను కలిశా. తనేమో.. బెండకాయ ఫ్రైలో బంగాళదుంప కుర్మా కలిపి బెంబా ఫ్రై అనే ఓ కొత్త వంట కాన్ని కొలంబస్ అంత గొప్పగా కనిపెట్టింది. ఆ అపు రూప సృష్టికి ఆశ్చర్యపోయి ఆమెనే ఆదర్శంగా తీసుకుని పక్కనున్న ఆదర్శ్ నగర్ కాలనీలో ఆరుకిలోల ఆలు అర్జెంటుగా కొని తెచ్చేశా తెలుసా! ఇలాంటి మేటి ప్రయో గాలు ప్రతి కిచెన్‌లోనూ జరిగినప్పుడే కదా భవిష్యత్తు తరాలకు బంగాళా బౌబౌ వంటి అద్భుతమైన రెసిపీలు దొరికితే అందరూ నమ్మరే. □

## ఎంత సహజమైనా జాగ్రత్త !



ఖరీదైన బ్యూటీ చికిత్సల వెంట పరు గెత్తలేం అనుకున్నవాళ్లు చూసేది వంటగది వైపే! అక్కడ వాడే ఎన్నో పదార్థాలు మన సౌందర్యాన్ని పెంచే స్తాయి మరి. వంటింటి చిట్కాలు వాడటం మేలే కానీ... సరిగానే వాడుతున్నారా? కొన్ని మేలు చేయకపోగా హానికరం కావొచ్చు మరి.

నిమ్మ: విటమిన్ సి చర్మానికి మేలు చేస్తుందని చాలామంది నిమ్మని ముఖానికి రాస్తుంటారు. కానీ నిమ్మచెక్కను ముఖానికి రుద్దడం, నేరుగా నిమ్మరసాన్ని రాయడం మంచిది కాదు. చర్మం పొడిబారి... దద్దుర్లు, దురదలకు కారణమవుతుంది. కొన్ని చుక్కలు అది కూడా దేనిలోనైనా కలిపి రాసుకుంటేనే ప్రయోజనం.

✦ దాల్చిన చెక్క. దీన్ని ఎక్కువగా మొటిమలు ఉన్నవాళ్లు రాస్తుంటారు. ఇదీ దద్దుర్లు, రంగు మారిపోవడం కొన్నిసార్లు చర్మం మీద మంటకీ కారణమవుతుంది. ఈ నూనె కూడా కొందరిలో ఇరిటేషన్కి. కాబట్టి, గమనించాల్సిందే.

✦ చక్కెర. స్క్రాబింగ్లో దీన్ని నిమ్మకాయ లేదా టొమాటో మీద వేసి, కాఫీలో కలిపి రాస్తుంటారు. మృతకణాలు పోగొట్టడానికి మేలు చేస్తుందన్న మాట వాస్తవమే కానీ... గాయాలకు గాయం. చర్మం ఎంత సున్నితంగా ఉంటుందో తెలుసా! పంచదార గుళికల ఉపరి తం కాస్త పదునుగా ఉంటుంది. ఇవి చర్మ కణజాలానికి గాయం చేస్తాయి. యాక్నే, మొటిమలు ఉంటే సమస్య మరింత జఠిలం చేస్తుంది. కాబట్టి, కరిగే దాకా ఆగడం మేలు. లేదంటే ప్రత్యామ్నాయాలనైనా ఎచుకోవాలి.

✦ యాపిల్ సిడార్ వినెగర్ : దీనిలో ఆమ్ల గుణాలెక్కువ. ఇదీ చర్మంపై కాలిన గాయాలకు కారణమవగలదు. కాబట్టి, నేరుగా వాడొద్దు. నీటిలో గానీ వేరే ఇతర వాటిలోగానీ కలిపి రాయాలి. సున్నిత చర్మతత్వం ఉన్నవాళ్లు వీలైనంత దూరంగా ఉంటే మంచిది. □

## అపార్థాలకు తావివ్వకూడదంటే..



ఒకటిగా అడుగేసినప్పుడే ఆ దాంపత్యం కలకాలం నిలుస్తుంది. అందుకు ఇద్దరూ ఒకరి మాటను ఒకరు విని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాకుండా తమ భాగ స్వామి మాట్లాడేటప్పుడు ఎప్పుడూ, ఎదో ఒక ఫిర్యాదు చేస్తూనే ఉంటుంది అంటూ తీసిపడేసినా, వినీవినట్లు ఉన్నా అపోహలు తప్పవు. అపా ర్థాలకు తావివ్వకూడదంటే ఇలా చేసి చూడండి. మీ భాగస్వామి వ్యక్తి గత, వృత్తి కుటుంబ విషయమై ఏదైనా మీకు ఫిర్యాదు చేసినప్పుడు దాన్ని తారీ ఖుతో సహా వారిముందే డైరీలో రాసుకోండి. దీనివల్ల మూడు ఉపయోగలు ఉన్నాయి. సమస్యపై మీరు స్పందించడం లేదనో, పట్టించుకోవడం లేదనో భావన వారిలో పోతుంది. తప్పు మీలో ఉంటే దాన్ని సరిచేసుకుని మళ్లీ పున రావృతం కాకుండా జాగ్రత్తపడచ్చు. వ. మీరు సమస్య వింటున్నారు, దాన్ని సరిచేసుకునేందుకు ప్రయత్నిస్తారని వాళ్లకు తెలుస్తుంది. దాంతో గంభీ రంగా ప్రారంభమైన వారి సంభాషణ చల్లబడుతుంది. వాదోపవాదాలు లేకుండా పరి స్థితి గట్టెక్కుతుంది. తీరిక సమయాల్లో ఆ డైరీని తిరగవేయమని చెప్పండి. □

## తెర

## 'కార్మేని సెల్వం' ట్రైలర్ లాంచ్



చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవు తున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష 'కార్మేని సెల్వం' సినిమా చూసి ఈఎమ్ఐలను తగ్గించు కోవాలను కుంటారు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విలక్షణ నటుడు సముద్రఖని. మధ్య తరగతి కుటుంబ కథే 'కార్మేని సెల్వం'మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ కు కనెక్ట్ అయ్యే చిత్రం 'కార్మేని సెల్వం' పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శ కత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం˝కార్మేని సెల్వం. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ కీలక పాత్రలు పోషిం చారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సముద్రఖనితో వర్క్ చేసిన తెలుగు డైరెక్టర్స్˝విమానం ఫేమ్ శివ ప్రసాద్, రామం రాఘవం ఫేమ్ ధనరాజ్,˝సేవ్ ద టైగర్స్ ఫేమ్ తేజ కాకుమాను అతిథులుగా హాజరయ్యారు. విమానం దర్శకుడు శివ ప్రసాద్ మాట్లాడుతూ..˝మిడిల్ క్లాస్ ఫాదర్ క్యారెక్టర్ అనగానే మొదట గుర్తొచ్చేది సముద్రఖని గారి పేరే. ఈ కథ చూస్తుంటే డబ్బు చుట్టూ తిరుగుతుందనిపిస్తోంది. ప్రతి మధ్యతరగతి కుటుంబానికి కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రం ఉంటుంద్ది అని అన్నారు. తేజ కాకుమాను మాట్లాడుతూ .˝భూమి సూర్యుని చుట్టూ తిరగడం ఎప్పుడో ఆగిపోయింది. ఇప్పుడు అంతా డబ్బు చుట్టూనే తిరుగుతుంది. మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ అందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుంది అని అన్నారు.

## బాలకృష్ణకు 'లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు'



ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఢిల్లీ 2026 లో శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి ˝లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు" ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఢిల్లీ 2026 లో శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి ˝లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు" (జీవన సాఫల్య పురస్కారం) లభించడం, ఆ పురస్కారాన్ని ఢిల్లీ గౌరవ ముఖ్యమంత్రి శ్రీమతి గుప్తా రేఖ గారి చేతుల మీదుగా వారు అందుకోవడం మాకు ఎంతో సంతో షాన్ని కలిగిం చింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో శ్రీ నందమూరి బాలకృష్ణ గారి ప్రస్థానంలో ఇది మరొక మైలురాయి మాత్రమే కాదు, తెలుగు సినీ పరిశ్రమకే ఇది గర్వకారణం. ఈ సంద ర్భంగా, శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి మా హృదయ పూర్వక అభినందనలు తెలియ జేస్తు న్నాము. భవి ష్యత్తులో శ్రీ నందమూరి బాలకృష్ణ గారు మరిన్ని అవార్డులు అందుకో వాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

## 'పెద్ది' ర్యాంపేజ్ 'గేమ్' గ్లింప్స్ రిలీజ్



రామ్ చరణ్ గారు క్షేమంగా ఉన్నారు రేపటి నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు పెద్ది టీం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది. బుచ్చి బాబు సనా దర్శకత్వం లో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. పెద్ది ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం క్రియేట్ చేస్తోంది. పెద్ది ఫస్ట్ షాట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఎఆర్ రెహమాన్ అందించిన సౌండ్‌ట్రాక్స్ మెగా చార్ట్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. చికిరి చికిరి, రైరై రా రా పాటలు వరల్డ్ వైడ్ వైరల్ అయ్యాయి. తాజాగా మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. 'పెద్ది' గేమ్ గ్లింప్స్ మార్చి 27 ఉదయం 11 గంటల 7 నిమిషాలకు రిలీజ్ కానుంది. ఈ గ్లింప్స్ మాస్ ర్యాంపేజ్ గా ఉండబోతుంది. అలాగే˝పెద్ది సినిమా సెట్స్‌లో రామ్‌చరణ్ గాయపడ్డారన్న వార్తలపై టీమ్ స్పందించింది. పెద్ది సినిమా సెట్స్‌లో నిన్న జరిగిన చిన్న ఘటన గురించి వచ్చిన వార్తలపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాం. రామ్ చరణ్ గారు పూర్తిగా క్షేమంగా ఉన్నారు. షూటింగ్ సమయంలో ఎడమ కంటికి చిన్న గాయం కావడంతో ఒక చిన్న ప్రొసీజర్ చేశారు. ఆయన రేపటినుంచి తిరిగి షూటింగ్‌లో పాల్గొంటారు. షూటింగ్ షెడ్యూల్‌కు ఎలాంటి అంతరాయం లేదు. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. అన్నీ కంట్రోల్ వున్నాయి ఉన్నాయి. సినిమా పనులు సజావుగా కొనసాగుతున్నాయి.

## 'సుయోధన' వరల్డ్ వైడ్‌గా విడుదల



నెక్ట్స్ ఏం జరుగుతుంది అనే ఆసక్తి కలిగించే చిత్రం సుయోధన..సాయి కుమార్.. ప్రజ్వాలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం "సుయోధన". వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి మాట్లాడుతూ నేను ఈ సినిమాలోకి రావడానికి కారణం ఎడిటర్ ఛోటా కె ప్రసాద్. ఆయన ఈ సినిమాకు ఎడిటింగ్ తో పాటు అనేక విషయాల్లో సపోర్ట్ చేస్తూ అండగా నిలిచారుమ్యూజిక్ డైరెక్టర్ జై క్రిష్ మాట్లాడుతూ "సుయోధన" సినిమా ఒక సౌండింగ్ నేపథ్యంగా ఉంటుంది అని తెలియగానే మ్యూజిక్ డైరెక్టర్ గా హ్యాపీగా ఫీలయ్యాను. అన్నారు. నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ మా సినిమాకు మా టెక్నీషియన్స్ ప్రధాన బలంగా నిలిచారు. హీరోయిన్ ద్రిషిక చందర్ మాట్లాడుతూ ఈ చిత్రంలో సుమిత అనే క్యారెక్టర్ లో నటిస్తున్నాను. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ సుయోధనుడి పాత్రలో నటించాలంటే అప్పట్లో ఎస్వీ రంగారావు గారు ఉండేవారు. సాయి కుమార్ గారు ఆయనను గుర్తుకు తెచ్చేలా ఈ చిత్రంలో ఆ పాత్ర పోషించారు. యాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ నేను 1972లో ధుర్యోధనుడి పాత్రను నాటికలో అభినయించాను. అప్పటికి నా వయసు 11 ఏళ్లు. ఇప్పుడు ఈ చిత్రంలో సుయోధనుడిగా నటిస్తుంటే ఆ రోజులు గుర్తుకువచ్చాయి.

## 'నాగబంధం' జూలై 3న గ్రాండ్ రిలీజ్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియన్ మైథలాజికల్ ఎపిక్ చిత్రం 'నాగబంధం'. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూలై 3న విడుదల చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. వర్షాకాలం ప్రారంభంలోనే విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించుకుంది. ఈ మేరకు విడుదల తేదీ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రెండు రకాల గెటప్స్‌లో హీరో కనిపిస్తున్నారు. పై భాగంలో శివుడిగా హీరోగా పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తు న్నారు. ఇక కింది భాగంలో మోడ్రన్ లుక్‌లో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ ఆడియెన్స్‌లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తోంది. శివుడిగా విరాట్ లుక్‌కి ఇప్పటికే అదిరిపోయే రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ పోస్టర్ అయితే నెక్ట్స్ లెవెల్లో ఉంది. ఈ చిత్రం ఇప్పటికే ఆడియెన్స్‌లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, భక్తి గీతం నమోరే ఇప్పటికీ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతూనే ఉంది.

## 'బర్బరీకుడు' చిత్ర పూజా కార్యక్రమం



పీపీ మూవీ మేకర్స్, రేణుక ఎల్లమ్మ క్రియేషన్స్ బ్యానర్లపై టి. మల్లేశ్వ రుడు, అంతటి నరేష్ కుమార్, అంతటి రాజేష్ కుమార్ నిర్మాతలుగా శివఝాన్సీ రేగాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం బర్బరీకుడు. అత్యంత ప్రతిష్టాత్మ కంగా తెరకెక్కుతున్న బర్బరీకుడు చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమం జరుపుకుంది. మహా భారత కురుక్షేత్ర యుద్ధంలోని ఒక యోధుడి కథతో ఈ చిత్రం తెరక్కబోతున్నట్టు తెలుస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి తండ్రి శివ శక్తి దత్త శిష్యుడిగా తెలుగు సినిమా పరిశ్రమలో ఎన్నో సినిమాలకు అసి స్టెంట్ డైరెక్టర్ గా, అలాగే పాటల రచయితగా పనిచేసిన శివఝాన్సి రేగాల ఈ చిత్రంతో దర్శకుడుగా అరంగేట్రం చేస్తున్నారు. సినిమా అంటే అభిమానం, ప్రేమ ఉంటే తప్ప ఇలాంటి కథలను నిర్మించరు. ఈ విషయంలో చిత్ర నిర్మాతలు టి. మల్లేశ్వరుడు, అంతటి నరేష్ కుమార్, అంతటి రాజేష్ కుమార్ లు ఆదిలోనే విజయం సాధించారు. తాము రూపొందిస్తున్న బర్బరీకుడు చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుందని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. చాలామందికి బర్బరీకుడు చరిత్ర గురించి తక్కువగా తెలుసని.. ఈ చిత్రంతో ఆయన ఎంతటి గొప్పయోధుడో అందరికీ తెలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు ఫైట్స్ కొరియోగ్రఫీ చేసిన రామ్ లక్ష్మణ్‌ల శిష్యుడు, స్టంట్ మాస్టర్ బద్రి మాస్టర్ అల్లుడు అయినా కృష్ణ భారత ఈ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు.

# అపుడు కలిసికట్టుగా ఇపుడు విడివిడిగా

# ఐపిఎల్ ట్రోఫీ ఎత్తేదెవరు?

ఆట

**కాసులు క్రికెట్ ఐపీఎల్ జాతరకు మరో 36 గంటల్లో తెరలేవనుంది. పది జట్లు పోటీపడుతున్న ఐపీఎల్ 2026 క్రికెట్ అభిమానులకు పండగే.ఆటగాళ్లు క్రికెట్ ఫ్యాన్స్‌ను ఊర్రూతలూగించడానికి సిద్ధమయ్యారు. ఈ వేసవంతా సిక్స్‌లు, ఫోర్ల వర్షంలో తడిసి ముద్దవనున్నారు.ఈ ఐపీఎల్‌ను వేదికగా చేసుకుని ఎవరికి వారు టీమిండియాలోకి దూసుకురావాలని ఉవ్విళ్లూరుతున్నారు. అయితే టీమిండియాకు టీ20 ప్రపంచకప్ అందించిన వీరులు ఇక్క చెప్పక్కర్లేదు. ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో మెరుపులతో క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించిన టీమిండియా వీరులు... ఈ ఐపీఎల్‌లో మరోమారు కనువిందు చేసేందుకు రెడీ అయ్యారు. అయితే ఒక్క జట్టుగా ఉన్న ఆటగాళ్లు... ఈ ఐపీఎల్‌లో తలా ఓ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఏ జట్టుకు ఎడ్జ్ ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది.**

(వార్త క్రీడా విభాగం)

టీమిండియాను ప్రపంచ విజేతగా నిలిపిన 15 మంది ఆటగాళ్లు ఐపీఎల్‌లోనూ అదే జోరు కొనసాగించడానికి రెడీయ్యారు. ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి భారత్‌ను మరోసారి విశ్వవిజేతగా నిలిపారు. ఆ విజయోత్సాహం ఇంకా తగ్గకముందే, సరిగ్గా మూడు వారాల వ్యవధిలోనే ఐపీఎల్ సందడి మొదలుకాబోతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య పోరుతో ఐపీఎల్ 2026కు తెరలేవనుంది.

**ముంబై జట్టులో నలుగురు**

భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపిన మన ప్రపంచ విజేతలు ఈసారి ఐపీఎల్‌లో ఏ జట్టు తరపున ఆడుతున్నారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. భారత ఆటగాళ్లలో దాదాపు అందరూ తమ పాత జట్లకే పరిమితమయ్యారు. ముంబై ఇండియన్స్ తరపున కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, జస్ప్రీత్ బుమ్రా తమ సత్తా చాటనున్నారు. టీమిండియాకు కెప్టెన్‌గా గ్రాండ్ విక్టరీ అందించిన సూర్యకుమార్ యాదవ్ ఈసారి ప్లేయర్‌గా, అందునా హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్నాడు. ఈ విధంగా తుది జట్టులోని 11 మందిలో నలుగురు ముంబై ఇండియన్స్‌లోనే ఉన్నారు. మిడిల్ ఆర్డర్‌లో మెరుపులు మెరిపించిన తిలక్ వర్మ, సూపర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, యార్కర్ల కింగ్ జస్ప్రీత్ బుమ్రా ముంబై ఇండియన్స్ జట్టులో కీలక ఆటగాళ్లు. టీమిండియా తరహాలో ముంబై ఇండియన్స్‌కు ఆరో ఐపీఎల్ ట్రోఫీ అందించాలని ఉవ్విళ్లూరుతున్నారు.

**సీఎస్‌కేలో సంజూ ప్లస్**

మరో హాట్ ఫెవరేట్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో సంజూ శాంసన్‌తో పాటు శివం దూబే ఉన్నారు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓపెనర్‌గా దుమ్ము రేపిన సంజూ శామ్సన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. అతని నుంచి మెరుపు ఆరంభాలను సీఎస్‌కే అభిమానులు ఆశిస్తున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న సంజూ శాంసన్‌ను కట్టడి చేయడానికి అన్ని జట్లు ఇప్పటికే ప్లాన్స్‌లో తలమునకలయ్యాయి. ఇక మ్యాచ్ ఫినిషర్ శివందూబే అదే జోరు ఐపీఎల్‌లో కొనసాగిస్తే చెన్నైకు తిరుగుండదు. డెత్ ఓవర్లలో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలే.

**అభిషేక్, ఇషాన్ రైజింగ్**

ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే టీమిండియా డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఆజట్టుకు ప్రధాన బలంగా మారనున్నారు. ఫైనల్ మ్యాచ్‌తో అభిషేక్ శర్మ టచ్‌లోకి రావడం సన్ రైజర్స్‌కు బూస్టింగ్. తొలి బంతి నుంచే బ్యాట్ ఝుళిపించ గలిగే అభిషేక్ క్రీజ్‌లో ఉన్నంతసేపు పరుగుల తుఫానే. ఇక ఇషాన్ కూడా సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఈ ఇద్దరితో సన్ రైజర్స్ టాప్ ఆర్డర్ మిగతా జట్లకంటే చాలా పటిష్టంగా ఉంది. సన్ రైజర్స్ టాప్ లేపితేనే మిగతా జట్లకు అవకాశం అనేలాగా ఉంది.

**కేకేఆర్, గుజరాత్‌లో ఇద్దరు**

కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగుతున్నారు. కేకేఆర్‌కు వైస్ కెప్టెన్‌గానూ ఉన్న రింకూ సింగ్ స్లాగ్ ఓవర్లలో వేగంగా పరుగులు సాధించగల దిట్ట. టాప్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయగలుగుతారు. ఇక గుజరాత్ టైటాన్స్ జట్టులో వాషింగ్టన్ సుందర్, మొహమ్మద్ సిరాజ్ ఉన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తమ స్పిన్ మ్యాజిక్ చూపించనుండగా, పంజాబ్ కింగ్స్ జట్టులో అర్షదీప్ సింగ్ ఏకైక వరల్డ్ కప్ విజేతగా నిలిచారు.

**టీమ్ మారిన ఒకే ఒక్కడు**

టీమిండియాలోని 15 మంది ఆటగాళ్లలో 14 మంది పాత జట్టలోనే కొనసాగుతుండగా... సంజూ సంజూ శాంసన్ మాత్రమే జట్టును మార్చాడు. గత సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన సంజూ ఈసారి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం ఈ సీజన్ లోనే పెద్ద సెన్సేషన్. ఆయన స్థానంలో రవీంద్ర జడేజా, సామ్ కరన్ రాజస్థాన్ రాయల్స్ జట్టులోకి వచ్చారు.

**కెప్టెన్లుగా ముగ్గురు**

ఇక టీమిండియాను విజేతగా నిలిపిన జట్టులోని ముగ్గురు వివిధ ఐపీఎల్ జట్లను ముందుండి నడపనున్నారు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్ ఈసారి ఐపీఎల్‌లో కెప్టెన్లుగా కనిపించనున్నారు. హార్దిక్ పాండ్యా ముంబైఇండియన్స్‌ను నడిపిస్తుండగా, అక్షర్ పటేల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు సారథ్యం వహిస్తున్నారు. ఇక ఇషాన్ కిషన్ విషయానికొస్తే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయం కారణంగా తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరం కావడంతో, తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ముగ్గురు ప్రపంచ విజేతలు సారథులుగా వ్యవహరించడం ఈ సీజన్ కు మరింత వన్నె తెచ్చింది.

ఐపీఎల్ 2026 తొలి మ్యాచ్‌లోనే ఇద్దరు వరల్డ్ కప్ హీరోలు తలపడబోతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ మైదానంలోకి దిగనున్నారు. మరో వైపు ఆర్సీబీ తరపున విరాట్ కోహ్లి కూడా మైదానంలో ఉండటంతో తొలి రోజే ఫ్యాన్స్‌కు ఫుల్ ఎంటర్ టైన్‌మెంట్ ఖాయం. ప్రపంచ ఛాంపియన్ల మధ్య జరిగే ఈ లీగ్ పోరుపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



## పూర్తి షెడ్యూల్ ఆగయా

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. ఇంతకుముందు తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేయగా... ఇప్పుడు రెండో దశలో 50 మ్యాచులకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకూ షెడ్యూల్ ప్రకటించినట్లైంది. అయితే, ప్లే ఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. మార్చి 28 నుంచి మే 24 వరకూ జరగనున్న లీగ్ స్టేజ్ మ్యాచ్‌ల వివరాలను ప్రకటించింది. బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌తో 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. లీగ్ స్టేజ్ కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ముగియనుంది. ఈ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలను దృష్టిలో ఉంచుకొని ఐపీఎల్ షెడ్యూల్‌ను రెండు దశల్లో విడుదల చేశారు. కాగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండో విడత ప్రకటించిన షెడ్యూల్‌లో 10 మ్యాచ్‌లు ఆడనుంది. తొలి విడత నాలుగు మ్యాచ్‌లతో కలుపుకొని సన్‌రైజర్స్ ఈ సీజన్ లీగ్ దశ మొత్తంలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది.

క్యాచుల విషయంపై ఇప్పటికే పది జట్ల సారథులకు బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది. క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్‌లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించింది.



## టీమిండియా హోం షెడ్యూల్ ఖరారు

**ముంబై:** 202627 సీజన్‌కు సంబంధించి టీమిండియా హోం షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. ఈ సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి.17వేదికల్లో మొత్తం 9 వన్డేలు, 8టీ20లు, 5టెస్ట్‌లు జరుగుతాయి. ఈ సీజన్ సెప్టెంబర్ 27న వెస్టిండీస్ పర్యటనతో మొదలవుతుంది. మూడు వన్డేలు త్రివేంద్రం, గౌహతి, న్యూ చండీగఢ్‌లో...5 టీ20లు లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరులో జరుగుతాయి. డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటలో మూడు వన్డేలు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లో జరుగనుండగా.. మూడు టీ20లు రాజ్‌కోట్, కటక్, పూణేలో షెడ్యూల్ అయ్యాయి. వచ్చే ఏడాది (2027) జనవరిలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో మూడు వన్డేలు ఉంటాయి. ఇవి కోల్‌కతా, హైదరాబాద్, ముంబైలో జరగుతాయి. ఈ హోం సీజన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన భాగం ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ. ఐదు టెస్టుల ఈ సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టు జనవరిలో భారత్‌లో పర్యటించనుంది. ఈ సిరీస్‌లో తొలి టెస్ట్ మ్యాచ్ 21వ తేదీ నుంచి నాగ్‌పూర్ వేదికగా జరుగుతుంది. తరువాతి మ్యాచ్‌లు చెన్నై, గౌహతి, రాంచీ, అహ్మదాబాద్‌లో జరుగుతాయి.

నెలరోజులకు పైగా టీ20 నప్రపంచకప్ క్రికెట్ అభిమానులను అలరించగా, ఇపుడు రెండు నెలలకు పైగా ఐపీఎల్ క్రికెట్ ఫీవర్ నెలకొంది. ఆతర్వాత హోం సీజన్‌తో టీమిండియా బిజీగా ఉండనుంది.

## భారత్ షూటింగ్‌జట్టులో కైనన్ చెనాయ్

**టాంజియర్ :** మొరాకోలోని టాంజియర్‌లో ప్రారంభమైన షాట్‌గన్ ప్రపంచకప్‌లలో నేడు. స్కీట్ ఈవెంట్‌లో పోటీలు ఆరంభమవుతాయి. భారత్ నుంచి 12 మంది షూటర్లు బరిలోకి దిగుతున్నారు. ఈ టోర్నీతో అంతర్జాతీయ షూటింగ్ సీజన్ ప్రారంభమైనట్లయింది. హైదరాబాద్ షూటర్, రియో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన కైనన్ చెనాయ్, అతని భార్య రాజేశ్వరి కుమారి వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కలిసి బరిలోకి దిగుతున్నారు. ఈ షూటింగ్ జోడీకి ఇటీవలే వివాహమైంది. 35 ఏళ్ల కైనన్ 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో టీమ్ ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలిచాడు. 34 ఏళ్ల రాజేశ్వరి 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో టీమ్ ట్రాప్ ఈవెంట్‌లో రజత పతకం సాధించింది.


**భారత షూటింగ్ జట్టు:** పృథ్వీరాజ్ తొండైమన్, కైనన్ చెనాయ్, భౌనీశ్ మెందిరత్తా, కీర్తి గుప్తా, రాజేశ్వరి,అహ్లావత్ (ట్రాప్). మాన్ సింగ్, జ్యోతిరాదిత్య సింగ్, పరంపాల్ సింగ్, యశస్వి రాథోడ్, దర్శన రాథోడ్, మహేశ్వరి(స్కీట్). కైనన్ చెనాయ్–రాజేశ్వరి కుమారి, పృథ్వీరాజ్ తొండైమన్–కీర్తి గుప్తా (మిక్స్‌డ్ టీమ్).

## బాస్మతి ఎగుమతులకు వార్ ఎఫెక్ట్



**న్యూఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భారత్ బాస్మతీ రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటా దేశానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టే సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ఈ పరిశ్రమ, ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు వెళ్లే సముద్ర మార్గాలు అత్యంత ప్రమాదకరంగా మారడంతో ఎగుమతులు దాదాపుగా నిలిచిపోయాయి. దీంతో సుమారు 10 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం భారత ఓడ రేవుల్లోనే పేరుకుపోయింది. దీనికి తోడు, షిప్పింగ్ కంపెనీలు వార్‌రిస్క్ సర్ ఛార్జి పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తుండటంతో రవాణా ఖర్చులు రెట్టింపయ్యాయి. ఇది ఎగుమతిదారులపై పెను భారంగా మారింది. మరోవైపు, ఇప్పటికే ఎగుమతి చేసిన సరుకులకు సంబంధించి చెల్లింపులు కూడా ఆగిపోయాయి.ఇరాన్ వంటి దేశాల నుంచి రూ.2 కోట్ల నుంచి రూ.25వేల కోట్ల వరకు బకాయిలు నిలిచిపోయినట్లు అంచనా. అక్కడి బ్యాంకింగ్ వ్యవస్థలు సరిగ్గా పనిచేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామాల ప్రభావంతో దేశీయ మార్కెట్లలో బాస్మతీ ధర క్వింటాల్‌కు రూ.800 వరకు పడిపోయింది.ఇది పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తోంది. భారత్ నుంచి ఎగుమతయ్యే మొత్తం బాస్మతీలో 70–75 శాతం సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ వంటి దేశాలకే వెళ్తుంది.ఈ అనిశ్చితి ఇలాగే కొనసాగితే, భారత మార్కెట్‌ను పాకిస్థాన్ వంటి పోటీ దేశాలు కైవసం చేసుకునే ప్రమాదం ఉందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆప్టిమమ్ హెల్త్‌కేర్‌పై ఇన్ఫోసిస్ ఫోకస్




**ముంబయి, మార్చి 26:** హెల్త్‌కేర్ ఐటి, డిజిటల్ వ్యవస్థల్లో కీలకంగా ఉన్న ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటి సంస్థను కొనుగోలుకు ఇన్ఫోసిస్ ఒపనపందం చేసుకుంది. మొత్తం 465 మిలియన్ డాలర్లుగా ఈ కొనుగోలు విలువ ఉంది.అంటే భారత కరెన్సీలో రూ.4376కోట్లకు ఈకంపెనీని ఇన్ఫోసిస్ కొనుగోలుచేయనున్నది.వచ్చే సంవత్సరం తొలిత్రైమాసికంలోనే ఈ డీల్‌ను ముగించేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వపరంగా అనుమతులకోసం దరఖాస్తులుచేసింది. ఆసుపత్రులు, హెల్త్‌కేర్ వ్యవస్థల్లో ఐటి డిజిటల్‌విభాగాలపై ఇన్ఫోసిస్ ఫోకస్ పెంచిందనడానికి ఈ డీల్ ఒక ఉదాహరణగా నిలిచింది. ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటి ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, సలహాలు,అమలు విభాగాల్లో కీలకంగా టెక్నాలజీని వినియోగిస్తుంది. ఇన్ఫోసిస్‌పరంగాప్రస్తుతం క్లౌడ్, ఎఐ, మౌలికవనరుల సాయంతో క్షేత్రస్థాయిలో హెల్త్‌కేర్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని చూస్తోంది. ఇందుకోసం ఇపుడు ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటిని తమ పరంచేసుకుంటే ఆసుపత్రులు, హెల్త్‌కేర్ ఐటి వ్యవస్థల్లో మరింతగా పటిష్టం కావచ్చని ఇన్ఫోసిస్ అంచనా. ప్రత్యేకించి అమెరికా వంటి గ్లోబల్ మార్కెట్లపై ఫోకస్ పెంచే వీలుంటుంది. ఐటి సేవలరంగాల్లో ఇపుడు హేల్త్‌కేర్ విభాగానికి అత్యధిక ప్రాధాన్యత లభిస్తోంది. వృద్ధజనాభా పెరుగుతుండటం, ప్రభుత్వపరంగా వస్తున్న మార్పులతో డిజిటల్ హెల్త్‌రికార్డుల సృష్టివైపు కార్పొరేట్ ఆసుపత్రుల విభాగాలు దృష్టిసారించాయి.

## భారత్ ఆర్థికవృద్ధి 7.6%

### ఒఇసిడి అంచనా




**ముంబయి, మార్చి 26:** ఆర్థికసహకారం అభివృద్ధిసంస్థ (ఒఇసిడి) భారత్ జిడిపి వృద్ధిరేటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.6శాతంగా అంచనా వేసింది. 2026–27 సంవత్సరంలో 6.1శాతంగా ఉంటుందని తెలిపింది. సంస్థ తన తాత్కాలిక ఆర్థిక ముఖచిత్ర నివేదికలో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, మానవాళి, ఆర్థిక వ్యయాలు ఈ దేశాలపై విపరీతభారం చూపించాయని అంచనావేసింది. అంతేకాకుండా ప్రపంచ ఆర్థికవ్యవస్థ తీరుతెన్నులను కూడా మార్చివేసిందన్నారు. హర్ముజ్ జలసంధి నిలిపివేయడంతో షిప్‌మెంట్స్ అన్నీ ఆగిపోవడంతో చమురు ఆర్థికవ్యవస్థ దెబ్బతిన్నది.

చమురుధరలు చుక్కలనంటే విధంగా పెరిగిపోయాయి. దీనివల్ల ఇంధనం, ఇతర కీలక ఉత్పత్తులు వస్తువులు అంటే ఎరువులు, రసాయనాలపై భారీ విఘాతం కలిగింది. ఇక అమెరికా సుంకాలు తగ్గింపుతో భారత్ వృద్ధికి కొంత మద్దతు లభించింది. అయితే గ్యాస్ క్రమబద్దీకరణ లేక తకక్కువ సరఫరా కారణంగా కొంత ఉత్పత్తి కార్యకలాపాలు దెబ్బతిని ఆర్థిక మద్దతు కొంత మందగించిందని ఒఇసిడి అంచనా వేసింది. 2025–26లో 7.6శాతంనుంచి 2026–27లో 6.1శాతం, 2027–28లో 6.4శాతంగా ఉంటుందని అంచనావేసింది. ఆహార, ఇంధన ధరల వల్లనే కొన్ని షాకులు వచ్చాయని అంచనావేసిన ఒయిసిడి అంతర్జాతీయ ముడిచమురు ధరలు కీలక ప్రభావం చూపించాయని వెల్లడించింది. దీనితో ద్రవ్యోల్బణం రెండుశాతం పెరిగి 5.1శాతం, 2026–27లో 4.1శాతం, 2027–28లో కూడా 4.1శాతంగా ఉంటుందని ఒఇసిడి అంచనావేసింది. ద్రవ్యోల్బణ నియంత్రణకు సెంట్రల్ బ్యాంకు ఎంపిసి విధాన సమీక్ష మార్పులుంటాయని వెల్లడించింది. ఇక ప్రపంచ జిడిపి వృద్ధి 2.9శాతంగా ఉంటుందని 2027 నాటికి 3శాతానికి చేరుకోవచ్చని అంచనావేసింది.

## బ్యాంకులకు వరుస సెలవులు

**ముంబయి, మార్చి 26:** భారత్‌లో అనేక నగరాల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలకు రానున్న కొన్నిరోజుల్లో విఘాతం కలుగుతుంది. రిజర్వుబ్యాంకు విడుదలచేసిన శెలవుల జాబితానుచూస్తే బ్యాంకులు ఈనెల 26,28,29,31 తేదీల్లో శెలవుల్లో ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో ఈనెల 27వ తేదీ కూడా సెలవులో ఉంటాయి. చైత్రనవరాత్రి తొమ్మిదోరోజు ప్రజలు శ్రీరాముడి జయంతిని జరుపుకుంటారు. ఈ రోజుల్లోనే ప్రజలు ర్యాలీలు తీసి దేవాలయాలు దర్శిస్తారు. ఉత్తర భారతంలో ఈరోజు అనేక సంస్థలకు సెలవుగా ప్రకటిస్తారు. ఇక ద్రిక్ పంచాంగం ప్రకారం రామనమిని 26వ తేదీన 27వ తేదీ రెండురోజుల్లోను జరుపుకుంటున్నారు. నవమి తిథి గురువారం 11.48కి ప్రారంభం అయి శుక్రవారం 10.06 గంటలకు ముగుస్తుంది. కొన్నిప్రాంతాల్లో 26వ తేదీ మరికొన్ని ప్రాంతాల్లో 27వ తేదీ జరుపుకుంటున్నారు. వివరాలకు కస్టమర్లు ఆయా బ్యాంకుశాఖలను సంప్రదించాలని చెపుతున్నారు. గుజరాత్, కర్ణాటక, చండీఘర్, రాజస్థాన్, యుపి, బెంగాల్, మహారాష్ట్రజార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో రామ నవమి సెలవు 26వ తేదీనే ఉంది. మధ్యప్రదేశ్, ఒడిశా, సిక్కిమ్, తెలంగాణబీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల్లో 27వ తేదీ సెలవుగా ఉంది.ఇక బ్యాంకులకు నాలుగో శనివారం,ఆదివారాలు అంటే 28,29 తేదీల్లో యధావిధిగా సెలవులు వస్తాయి. ఈనెల 31వ తేదీ మంగళ వారం మహావీర్‌జయంతికి సెలవు లున్నాయి. మహావీర్‌జయంతికి 12 రాష్ట్రాల్లో బ్యాంకులు సెలవులు ప్రకటించాయి.

## మెటాలో 700 మందికి ఉద్వాసన




**న్యూఢిల్లీ, మార్చి 26:** కార్పొరేట్ రంగంలోనికి కృత్రిమ మేధ రావడంతో టెక్ రంగంలోని ఉద్యోగులకు లేఆఫ్‌లు విపరీతం గా పెరిగాయి. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా కూడా 700 మందిని ఉద్యోగాలనుంచి తొలగించింది. ఈ లేఆఫ్‌లకు కొన్ని గంటలముందే టాప్ ఉన్నతాధికారులకు కంపెనీ కొత్త స్టాక్ ఆప్షన్లుప్రకటించింది. రియాల్టీ ల్యాబ్స్, సేల్స్, రిక్రూటింగ్, ఫేస్‌బుక్ విభాగాలనుంచి 700 మందికిపైగా ఉద్యోగులకు మెటా ఉద్వాసన చెప్పింది. రియాల్టీ ల్యాబ్స్ డివిజన్‌లోకంపెనీ లేఆఫ్‌లు ఈఏడాదిలో రెండోసారి. ఈ ఏడాదిజనవరిలోకూడా ఈ విభాగంనుంచి 1000 మందికి మెటా లేఆఫ్ ప్రకటించింది. పెట్టుబడులు ఓవైపు పెంచుకుంటూనే ఎఐ కారణంగా ఉద్యోగుల ంఖ్యలోకోతపెడుతోంది.

సుమారుగా 16 వేలమందికి ఈ ఏడాది లే ఆఫ్‌లు ఇవ్వాలని నిర్ణయించింది. లేఆఫ్‌లు ఎదుర్కొన్నవారిలో కొందరికి కంపెనీలోనే ఇతర విభాగాల్లో ఆఫర్‌చేసింది. టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు కొత్తప్రోత్సాహకాలు కల్పించింది. లేఆఫ్‌లప్రకటనకు ఒకరోజు ముందే తమ కీలక ఎగ్జిక్యూటివ్‌లకు కొత్త స్టాక్ ఆప్షన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. సీనియర్ ఉద్యోగులకు వచ్చే ఐదేళ్లలో వేతన పరిహారం సుమారు 921 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.8600 కోట్లు వరకూ పెరుగుతుందని అంచనా. ఎఐ యుగంలో నైపుణ్యాలుకలిగిన ఉద్యోగులు సంస్థను వీడకుండా ఉండేందుకు ఈప్రోత్సాహకాలుప్రకటించింది.

## నీరవ్‌మోడీకి లండన్ హైకోర్టు షాక్

**లండన్, మార్చి 26:** పంజాబ్‌నేషనల్‌బ్యాంకును రూ.14 వేలకోట్ల మేర మోసగించారన్న అభియోగాలపై ప్రస్తుతం లండన్‌కోర్టులో విచారణ ఎదుర్కొంటున్న ఆభరణాల వ్యాపారి నీరవ్‌మోడీకి కోర్టు షాక్ ఇచ్చింది. తనను భారత్‌కు అప్పగించాలన్న పిటిషన్లు, కోర్టు నిర్ణయాలను పునర్విచారణచేయాలని ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను యుకె హైకోర్టు తిరస్కరించింది. వెస్ట్‌మినిస్టర్ కోర్టులో ఆయన దాఖలు చేసిన ఈ పిటిషన్ వాస్తవానికి వచ్చేనెలలో బెంచ్‌మీదికి రావాలి. జస్టిస్ కింగ్స్ బెంచ్ డివిజన్ ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ న్యాయవాది ఈ పిటిషన్‌పై పటిష్టమైన వాదనలు వినిపించారు. అంతేకాకుండా భారత్‌నుంచి వెళ్లిన సిబిఐ టీమ్ కూడా ఆయనకు సహకరించింది.భండారి తీర్పును అనుసరించి తనపై వచ్చిన నేరస్తుల అప్పగింత భారత్‌కు అప్పగింత ఉత్తర్వులపై పునర్విచారణచేయాలని నిందితుడి తరపు న్యాయవాది డిమాండ్‌చేసారు. పిటిషన్‌ను పునఃవిచారణ చేసేందుకు అందుకు తగిన పరిస్థితులు లేవని జడ్జి అభిప్రాయపడ్డారు. పిఎన్బీ కుంభకోణంనుంచి కూడా సిబిఐ 2018 నుంచి నీరవ్‌మోడీని భారత్‌కు రప్పించి విచారించాలని చూస్తోంది. ఇందుకు సంబంధించి 2019లోనే నీరవ్‌ను యుకెలో అరెస్టుచేసారు. అంతకుముందే కోర్టులు ఆయన్ను భారత్‌కు అప్పగించే నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని భారత్‌నుంచి వచ్చిన హామీలకు అనుగుణంగా నీరవ్‌ను భారత్‌కు అప్పగించవచ్చని తేల్చి చెప్పింది.

## విప్రో, టిసిఎస్, ఇన్ఫోసిస్ బైబాక్!




**ముంబయి, మార్చి 26:** కంపెనీలు అనుసరించే బైబాక్ విధానంలో పన్నుల వ్యవస్థ కూడా వచ్చేనెల ఒకటవ తేదీనుంచి మారుతోంది. వాటాదారులకు చేసే చెల్లింపుల్లో ఇకపై పన్నుల్లోకూడా మార్పులున్నాయి. ప్రస్తుతం విప్రో బైబాక్‌కు వస్తోంది. ఇప్పటివరకూ వాటాల బైబాక్‌లలో ఇన్వెస్టర్ల చేతుల్లో డివిడెండ్ ఆదాయంగా పరిగణించేవారు. 35శాతం వరకూ పన్నులు ఉండేవి. అత్యధిక పన్ను శ్లాబ్‌లో ఉండేవారు. ఇపుడు సవరించిన వ్యవస్థల్లో బైబాక్‌లు మూలధన లబ్ది పన్ను వ్యవస్థలోకి వస్తోంది.

దీనివల్ల 12.5శాతం పన్నురేటుతోపాటు 12శాతం సర్‌ఛార్జి పడుతుంది. బైబాక్ కార్యకలాపాల్లో మందగమనం నెలకొనడంతోనే కేంద్రం ఈ పన్నుల వ్యవస్థ మార్పును తెచినచంది. 2025లో షేర్‌బైబాక్‌లు 79శాతం క్షీణించాయి. అంతకుముందు 2024లో కేవలం 47 మాత్రమే జరిగాయి. వాస్తవానికి ఐటి మేజర్ కంపెనీల్లో ఎలాంటి బైబాక్ కార్యకలాపాలు లేవు. పన్నుల వ్యవస్థలో తెస్తున్న మార్పుల వల్ల కార్పొరేట్ చెల్లింపుల వ్యూహంలో కొంతమేర కీలక మార్పులు తెస్తున్నాయి. భారీ క్యాప్ ఐటి కంపెనీల్లో ఈ షేర్‌బైబాక్ వ్యవస్థ మూలదన కేటాయింపునకు కీలక వనరుగా ఉంది. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రోలు బైబాక్‌లకు వెళ్లాలని భావించాయి.

ఈ మూడు కంపెనీలు సమిష్టిగా వేలాది కోట్లు వాటాదారులకు గడచిన దశాబ్దకాలంలో చెల్లింపులుచేసాయి. ప్రైమ్‌డేటా గణాంకాల ప్రకారం టిసిఎస్ ఐదు బైబ్యాక్‌లలో రూ.83 వేల కోట్లు, ఇన్ఫోసిస్ ఐదు బైబాక్‌లలో 57,760 కోట్లు, విప్రో ఐదు బైబాక్‌లలో రూ.45,500 కోట్లు, టెక్ మహీంద్ర రూ.1956 కోట్లు షేర్‌బైబాక్‌కింద చెల్లింపులు చేసాయి. ఇపుడు ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్‌కూడా ఇదే దారిలో వెళుతున్నాయి. విప్రో, టిసిఎస్, ఇన్ఫోసిస్ బైబాక్ యోచనలో ఉన్నఆయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.